## సుప్రీం కోర్టులో తన కేసును తానే వాదించుకున్న విద్యార్థి




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 41 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA




## సీఎం శివరాత్రి శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ మహా దేవుడిని ప్రార్థించారు. మహా శివరాత్రి ఉపవాస పూజలను భక్తి ప్రవత్తులతో నిర్వహిస్తున్న భక్తులందరికీ శివయ్య ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

# అవి కూడా మనకే రావాలె

## హంగ్ మున్సిపాలిటీలపై సీఎం

- మంత్రులు, సీనియర్ నేతలతో రేవంత్ రెడ్డి భేటీ
- మంచి ఫలితాలు సాధించిన మంత్రులకు అభినందన
- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపైనా చర్చ
- 17న రైతు భరోసా నిధుల విడుదల?



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం బ్యూరో): రాష్ట్రంలో మున్సిపల్, కార్పొరేషన్ల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీలలో స్వతంత్ర అభ్యర్థులు కీలకంగా మారనున్నారు. మ్యాజిక్ ఫిగర్ దాటని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో శనివారం జూబ్లీహిల్స్‌లోని మల్కాజ్‌గిరి క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాలు, తదుపరి

...మిగతా 2లో


## మహా శివరాత్రి శుభాకాంక్షలు

పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు మనం మహా శివరాత్రి శుభాకాంక్షలు.

**సెలవు**

పండుగ సందర్భంగా మా కార్యాలయానికి ఆదివారం సెలవు. సోమవారం పత్రిక వెలువడదు. మంగళవారం పునర్దర్శనం.

– ఎడిటర్




## పుర పోరులో పొంగులేటి మ్యాజిక్

- 10 రోజుల్లో 249 వార్డుల్లో ప్రచారం
- 70 శాతం సక్సెస్ రేటుతో 174 వార్డుల్లో గెలుపు
- శీనన్న వ్యూహంతో ఉమ్మడి ఖమ్మం..
- ఉమ్మడి వరంగల్ పురపాలికల్లో హస్తం ప్రభంజనం!

3



## కాంగ్రెస్‌కు 39.08 శాతం

### మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీకే అత్యధిక ఓట్లు

### పార్టీలు పొందిన ఓట్ల శాతాలను ప్రకటించిన అధికారులు





హైదరాబాద్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో శుక్రవారం వెల్లడైన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 50 శాతానికి పైగా వార్డుల్లో కాంగ్రెస్ ఆధిక్యత కనబర్చిన విషయం తెలిసిందే. అయితే, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీల వారీ వచ్చిన ఓట్ల వివరాలను ఎన్నికల

...మిగతా 2లో

## ప్రతి పంటకూ మద్దతు ధర ఇవ్వాలె

- రైతు జాగృతి యాత్ర చైర్మన్ జగజిత్ సింగ్ డల్లేవాలా
- రైతు వ్యతిరేక చట్టాలను కేంద్రం రద్దు చేయాలె: కోదండరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం బ్యూరో): రైతులు పండించే ప్రతీ పంటకూ కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతు జాగృతి యాత్ర చైర్మన్ జగజిత్ సింగ్ డల్లేవాలా డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రభుత్వం రైతు కమిషన్ ఏర్పాటు చేయడం సంతోషమని హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైతులు పండించే పంటకు మద్దతు ధర, చట్టబద్దత కల్పించాలని కోరుతూ జాతీయ రైతు సంఘాల నేతలు దేశవ్యాప్తంగా చేపట్టిన రైతు జాగృతి యాత్ర శనివారం రాష్ట్రానికి చేరుకుంది. యాత్రలో భాగంగా యాత్ర సభ్యులు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రైతు జాగృతి యాత్ర చైర్మన్ జగజిత్ సింగ్ డల్లేవాలా మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. రైతుల పంటలకు ఎంఎస్పీ ఇవ్వాలనేది మా ప్రధాన డిమాండ్,

...మిగతా 2లో

## స్థానిక ఓటరుగా నమోదైతేనే..

### ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటు హక్కుపై ఎన్నికల సంఘం క్లారిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (మనం బ్యూరో): రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏ పార్టీకీ పూర్తి మెజార్టీ రాకుండా హంగ్ ఏర్పడటంతో ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటుకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మేయర్,

...మిగతా 2లో

## సీపీఐకి కొత్తగూడెం మేయర్ పదవి

హైదరాబాద్, ఫిబ్రవరి 14: కొత్తగూడెం మేయర్ పీఠంపై ఉత్కంఠ వీడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడితో సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. మేయర్ పదవిని సీపీఐ పార్టీకి ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారు. కాంగ్రెస్కు డిప్యూటీ మేయర్ పదవి ఖరారు అయింది. ఇదిలా ఉంటే.. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా కొత్తగూడెం కార్పొరేషన్లో సీపీఐ పార్టీ సాధించింది. కొత్తగూడెం కార్పొరేషన్లోని అత్యధిక వార్డుల్లో విజయం సాధించింది. అయితే, మెజార్టీకి

...మిగతా 2లో


### బీజేపీకి కరీంనగర్ కార్పొరేషన్? 2


## అరవిందుని విచారణకు అనుమతి

### ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కీలక పరిణామం



హైదరాబాద్,ఫిబ్రవరి 14(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఈ ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఐఏఎస్ అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఇప్పటికే బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు సైతం గవర్నర్ నుంచి అనుమతిచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ కేసులో రాజకీయ నాయకులు, అధికారుల ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభించడంతో ఏసీబీ అధికారులు ఛార్జిషీట్ దాఖలుకు సిద్ధమవుతున్నారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు ఇప్పటికే తుది నివేదికను సైతం సిద్ధం చేశారు. ఈ నివేదికలో కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ కేసులో ఏ1 మాజీ మంత్రి కేటీఆర్, ఏ2 ఐఏఎస్ అధికారి అరవింద్, ఏ3 బీఎన్ఎల్ రెడ్డి, ఏ4, ఏ5లుగా ఊడ్క ప్రతినిధులను తుది నివేదికలో ప్రస్తావించారు. ఫార్ములా-ఈ కార్ రేస్ నిర్వహించాలన్నది కేటీఆర్ సొంత నిర్ణయమని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ

...మిగతా 2లో

## సారు..కారు...పదహారు

- పురపోరులో గుభాళించని...గులాబీ
- కమలం, కారు కలిసిపోయినై
- జాగృతిది.. ట్రైలర్ మాత్రమే..! అసలు సినిమా ముందుంది
- భవిష్యత్తులో బలం పుంజుకుంటాం
- తెలంగాణ జాగృతి చీఫ్ కవిత



హైదరాబాద్,ఫిబ్రవరి 14(మనం,ప్రత్యేక ప్రతినిధి): మున్సిపల్ ఎన్నికలలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని, ఈ ఎన్నికలలో సారు... కారు ..పదహారు స్థానలకే పరిమితమైందని తెలంగాణ జాగృతి చీఫ్ కవిత స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కేంద్ర కార్యాలయంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ స్టేట్ కన్వీనర్ అంబటి జోజిరెడ్డి,

...మిగతా 2లో



### పుల్వామా దాడికి ఏడేండ్లు

## అమర వీర సైనికులకు నివాళులు

ఢిల్లీ, ఫిబ్రవరి 14: పుల్వామా దాడి జరిగి ఏడేండ్లవుతున్న సందర్భంగా అమరవీరులకు ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్లోని పుల్వామా ప్రాంతంలో

...మిగతా 2లో


## శ్రీశైలం దేవస్థానం, శ్రీశైలం



### మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు-2026

**ప్రకటన**

### ముఖ్య కార్యక్రమాలు

| | | |
|---|---|---|
| 15.02.2026 మహాశివరాత్రి | సాయంత్రం : 5.30 గం.లకు | ప్రభోత్సవం |
| | రాత్రి : 7.00 గం.లకు | నందివాహన సేవ |
| | రాత్రి : 10.00 గం.ల నుండి | శ్రీ స్వామి వారికి లింగోద్భవకాలం మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, పాగాలంకరణ |
| | రాత్రి : 12.00 గం.లకు | శ్రీ స్వామి అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం |
| 16.02.2026 | సాయంకాలం: 5.00 గం.లకు | రథోత్సవం |
| | రాత్రి : 8.00 గం.లకు | తెపోత్సవం |
| 17.02.2026 | ఉదయం : గం.9.45 లకు | పూర్ణాహుతి, కలశోద్వాసన, అవభృథం, వసంతోత్సవం, త్రిశూలస్నానం. |
| | సాయంత్రం : గం.6.00 గం.లకు | సదస్యం, నాగవల్లి, ఆస్థానసేవ |
| | రాత్రి : గం.7.30 లకు | ధ్వజావరోహణ |
| 18.02.2026 | రాత్రి : గం.7.30 లకు | అశ్వవాహన సేవ |
| | రాత్రి : గం. 8.30 లకు | పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ |



శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో...



పోతుగుంట రమేష్ నాయుడు
ధర్మకర్తల మండలి అధ్యక్షులు

యం. శ్రీనివాసరావు, యం.ఎ.,యం.ఇడి.,
స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మరియు
కార్యనిర్వహణాధికారి




## బాల్...బాల్‌కు బెట్టింగ్

### టీ20లో కాయ్ రాజా కాయ్ • ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ల జోరు

### ఇండియా-పాక్ మ్యాచ్‌పై పెద్ద ఎత్తున పందేలు

హైదరాబాద్,ఫిబ్రవరి 14(మనం,ప్రత్యేక ప్రతినిధి): టీ20 వరల్డ్ కప్‌లో బెట్టింగ్ రాయుళ్లు భారీ ఎత్తున పందెలు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా క్రికెట్ బూకీలు బాల్‌బాల్‌కు బెట్టింగ్ నిర్వహిస్తూ యువతను అప్పుల ఊబిలో నెడుతున్నారు. ఇదివరలో పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్ భూతం క్రమేన మారుమూల ప్రాంతాలకు పాకింది. ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని యువతతో పందెం కాయిస్తున్నారు. నిర్వాహకులు సూచించిన అప్లికేషన్లను సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకొని టీం20 మ్యాచ్‌లలో గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. బడా బూకీలు కొంతమంది ఏజెంట్లు తమ సహాయకులను రంగంలోకి దింపి యువకుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ బెట్టింగ్‌లలో

...మిగతా 2లో



# చైనా సరిహద్దులో ఈఎఫ్ఎల్‌పై దిగిన ప్రధాని విమానం



**దిబ్రూగఢ్, ఫిబ్రవరి 14:** అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈశాన్య భారతంలో ఏర్పాటైన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్ఎఫ్)పై ప్రధాని ప్రయాణిస్తున్న ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండయింది. ఈ ఫెసిలిటీ చైనా సరిహద్దుకు 300 కి.మీ దూరంలో ఉంది. ప్రధాని మోడీ దీన్ని నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాయుసేన ప్రత్యేక విన్యాసాలు ప్రదర్శించింది. ఈ ఫెసిలిటీ గురించి ప్రధాని ఇప్పటికే ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్ఎఫ్ కీలకమని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో దిబ్రూగఢ్ ఎయిర్ పోర్ట్, చబువా ఎయిర్ ఫోర్స్ స్టేషన్లలో కార్యకలాపాలు నిర్వహించలేని పరిస్థితి ఉంటే.. ఈ ఈఎల్ఎఫ్ ను ఒక ప్రత్యామ్నాయంగా వాడతారు. దాంతో సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు.. భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు వీలవుతుంది. టేకాఫ్, ల్యాండింగుకు అనుకూలంగా దీనిని డిజైన్ చేశారు. పశ్చిమ, ఉత్తర, మధ్య భారతంలో ఇప్పటికే ఈ ఈఎల్ఎఫ్ లున్నాయి. చైనాతో సరిహద్దు వివాదాల వేళ ఈశాన్య భారతంలో దీన్ని ఏర్పాటు చేయడం మన బలాన్ని చాటడం కోసమేనని కొందరు వ్యాఖ్యానిస్తుండగా.. యుద్ధ సన్నద్ధతలో భాగమని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. ఏది ఏమైనా ఇదొక చారిత్రక పరిణామమే.

# సుప్రీం కోర్టులో తన కేసును తానే వాదించుకున్న విద్యార్థి

**ఢిల్లీ, ఫిబ్రవరి 14:** దేశ అత్యున్నత న్యాయస్థానంలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఒక 19 ఏళ్ల కుర్రాడు 10 తన కేసును తానే వాదించుకుని సానుకూల తీర్పును సాధించుకున్నాడు. మధ్యప్రదేశ్ లోని జబల్ పూర్‌కు చెందిన లాయర్ మనోజ్ చతుర్వేది కుమారుడు అథర్వ చతుర్వేది. అతడు రెండుసార్లు నీట్‌లో 530 స్కోర్ సాధించాడు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఏదో ఒక ప్రైవేటు కాలేజీలో సీటు కచ్చితంగా వస్తుందని ధీమాగా ఉన్నాడు. కానీ, కౌన్సెలింగ్ లో సీటు రాలేదు. తమ రాష్ట్రంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయకపోవడం వల్లే తనకీ పరిస్థితి వచ్చిందని గ్రహించాడు. తనతో పాటు తనలాంటి ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని భావించాడు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు సీట్లు అందుబాటులో ఉన్నాయని గుర్తించాడు. ఈనేపథ్యంలో తానే సొంతంగా డ్రాఫ్టింగ్ చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను జనవరి 6న సుప్రీం కోర్టులో ఫైల్ చేశాడు. ఆర్థికంగా బలహీనవర్గానికి చెందిన విద్యార్థికి రెండుసార్లు నీట్ పాస్ అయినా సీటు రాకపోవడంతో అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. విధానపరమైన లోపాలు అతడి చదువుకు ఆటంకంగా ఉండకూడదని చెబుతూ ప్రైవేటు కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేయనందున అతని అడ్మిషన్ను తిరస్కరించకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. 2025-2026 సెషన్లో అతడికి అడ్మిషన్ ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల ఈ పిటిషన్ విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ను 10 నిమిషాలు సమయం ఇవ్వాలని కోరిన అథర్వ.. సొంతంగా తన వాదనలు వినిపించి విజయం సాధించడం విశేషం.

# కాంగ్రెస్‌కు 39.08 శాతం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు వెల్లడించారు. మొత్తం పోలైన ఓట్లలో కాంగ్రెస్ కు 39.08 శాతం పోలైనట్లు వారు తెలిపారు. బీఆర్ఎస్‌కు 28.75 శాతం, బీజేపీకి 15.67 శాతం, స్వతంత్రులకు 8.30 శాతం, ఎంఐఎంకు 3.28 శాతం, ఫార్వర్డ్ బ్లాక్ కు 1.5 శాతం, సీపీఐకి 1.3 శాతం, సీపీఎంకు 0.5 శాతం, జనసేనకు 0.3 శాతం ఓట్లు నమోదైనట్లు ప్రకటించారు.

116 మున్సిపాలిటీల్లోని 2,582 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ 1,347 వార్డుల్లో విజయం సాధించి 66 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ 717 వార్డుల్లో గెలుపొంది 13 మున్సిపాలిటీలు దక్కించుకుంది. భాజపా 261 వార్డుల్లో, స్వతంత్రులు 256 వార్డుల్లో విజయం సాధించారు. 36 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మిగతా చోట్ల హంగ్ ఏర్పడిన విషయం పాఠకులకు విదితమే.

# స్థానిక ఓటరుగా నమోదైతేనే..

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటు హక్కుపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. హైకోర్టు తీర్పు మేరకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు ఈ మేరకు సర్క్యులర్ జారీ చేసింది.

తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం 2019 ప్రకారం పక్కాగా నిబంధనలు అమలు చేయాలనీ, మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకుండా ఓటు వేసే ఎక్స్ అఫీషియో సభ్యులపై హైకోర్టు సీరియస్ అయిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు ఓటు హక్కు తప్పనిసరి అని స్పష్టం చేసింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకపోతే ఎక్స్ అఫీషియో సభ్యులుగా అనర్హులని పేర్కొంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఎక్స్ అఫీషియో సభ్యులుగా శనివారం వరకు ఓటు నమోదు చేసుకున్న వారే ఇందుకు అర్హులని పేర్కొంది.

# అవి కూడా మనకే రావాలె

(మొదటి పేజీ తరువాయి)

కార్యాచరణపై చర్చించారు. ప్రధానంగా 38 హంగ్ మున్సిపాలిటీలపై చర్చించారు. వీటిలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకునేలా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్, సీపీఐ సమాన స్థానాలు సాధించిన కొత్తగూడెం కార్పొరేషన్లో మేయర్ పదవికి మద్దతిచ్చే అంశంపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో మాట్లాడాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన సందర్భంగా మంత్రులందరినీ అభినందించిన సీఎం కొన్ని చోట్ల ఆశించిన ఫలితాలు రాకపోవడానికి గత కారణాలను విశ్లేషించారు. అందరం కలసికట్టుగా పనిచేయడం వల్లనే మంచి ఫలితాలు సాధించామన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు అభినందనలు తెలిపిన సీఎం గత ప్రభుత్వం పదేండ్లలోచేయలేని పనులను ప్రజా ప్రభుత్వం రెండేళ్లలో చేసి చూపించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజా పాలనపై నమ్మకాన్ని కలిగించాయనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని స్పష్టం చేశారు. ఇదే నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలనీ, ఎన్నిక ఏదైనా ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సై?**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన ఊపుతో పెండింగ్‌లో ఉన్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించే విషయంపై సీఎం రేవంత్ మంత్రులను అభిప్రాయం అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయనీ, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నోటిఫికేషన్ ఇచ్చే దిశగా అడుగులు వేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం.

**17న రైతు భరోసా నిధులు విడుదల**

ఇదే సమావేశంలో రైతు భరోసాపై మంత్రులతో సీఎం రేవంత్ చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రైతు భరోసా నిధులను ఈనెల 17న విడుదల చేసేందుకు ఈ సమావేశంలో సీఎం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన నిధుల సర్దుబాటు, లబ్దిదారుల ఎంపికపై మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల విజయం తరువాత రైతులకు ఈ ఆర్థిక సాయం అందించడం ద్వారా గ్రామీణ ఓటర్లలో మరింత విశ్వాసం నింపవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

**సీఎం రేవంత్‌తో ఫార్వర్డ్ బ్లాక్ కౌన్సిలర్ల భేటీ**

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కౌన్సిలర్లు శనివారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో మొత్తం 8 మంది కౌన్సిలర్లు ఈ భేటీలో పాల్గొన్నారు. సీఎంతో భేటీ అనంతరం కౌన్సిలర్లు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు.

కేవలం తమ మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి సహకారం కోరడానికే సీఎంను కలిసినట్లు చెప్పారు. నిధుల విషయంలో సానుకూలంగా స్పందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# బాల్...బాల్‌కు బెట్టింగ్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వాహకులే ఎక్కువగా లాభాలు పొందుతున్నట్లు తెలియకనే తెలుస్తోంది.

**ప్రధాన పట్టణాలుః**

రాజస్థాన్, ఢిల్లీ, చెన్నై, బెంగళూర్‌కు చెందిన బెట్టింగ్ నిర్వాహకులు హైదరాబాద్‌లోని లాడ్జ్‌లలో తిష్టవేసి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. . గత రెండు మూడేళ్లుగా పోలీసుల నిఘా పెరగడం వల్ల నిర్వాహకులు సాంకేతికతను ఉపయోగించుకొని ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఏజెంట్లను నియమించుకొని బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన నిర్వాహకులు సైతం బెట్టింగ్‌ల విషయంలో పోలీసులకు పట్టుబడకుండా తెలివిగా వ్యవహరిస్తున్నారు.పోలీసులు ఐపీ అడ్రస్ ఆధారంగా బెట్టింగ్ నిర్వాహకులను గుర్తిస్తుండటం వల్ల పందెంరాయుళ్లు ఒకడుగు ముందుకు వేసి.. ఇతర రాష్ట్రాల ఐపీ అడ్రస్‌లతో బెట్టింగ్ అప్లికేషన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. సదరు ఐపీ అడ్రసును గుర్తించి పోలీసులు అక్కడికి వెళ్లినా అక్కడ ఎవరూ ఉండరు.

**రుణ యాప్‌ల జోరు ః**

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు యాప్‌ల ద్వారా అప్పులు కూడా ఇస్తున్నారు. ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా, సెల్ నెంబర్ నమోదు చేస్తే వేయి నుంచి 10 వేల రూపాయల వరకు వెంటనే రుణాలు ఇస్తున్నారు. అయితే తిరిగి ఆయా మొత్తాలను చక్రవడ్డీతో కలిపి వసూలు చేస్తున్నారు. కాగా క్రికెట్ బెట్టింగ్‌లలో రెండింతల మొత్తాలు వస్తాయన్నా ఆశతో విద్యార్థులు, యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలవుతున్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా.. చదువు పేరుతో బెట్టింగ్ వెబ్ సైట్లు, అప్లికేషన్లలోకి వెళుతూ పందెం కాస్తున్నారు. చివరికి డబ్బులు కోల్పోయి.. ఒత్తిడికి లోనవుతూ ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు.

**బంతి బంతికి బెట్టింగ్:**

టీ20 క్రికెట్ మ్యాచుల బెట్టింగ్ రాయుళ్లను ఆకర్షించేందుకు ఆన్‌లైన్‌లో కొందరు బూకీలు నగదు వసూలు చేసి వారికి యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్‌లు ఇచ్చి దందాకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. తమను సంప్రదించే బుకీలను, నిందితులు ప్రత్యేక సెల్‌ఫోన్ నెంబర్‌తో పాటు బెట్టింగ్ డబ్బులు జమ చేసేందుకు బ్యాంకు ఖాతా నెంబర్ సైతం ఇస్తున్నారు. పందెంరాయుళ్లకు కేజీఎఫ్, సీఎం, కోటి, బైరా వంటి కోడ్‌లతో బంతి.. బంతికి బెట్టింగ్ నిర్వహిస్తున్నారని పోలీసుల విచారణలో తేలింది. ఫలానా జట్టే గెలుస్తుందంటూ రూ.వేల నుంచి రూ.లక్షల్లో డబ్బులు బెట్టింగులు పెడుతూ యువకులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా విలువైన వస్తువులు కుదువపెట్టి, విపరీతంగా అప్పులు చేస్తున్నారు.

**రహస్య స్థావరాలు ః**

హైదరాబాద్ నగరంలో కొంతమంది యువకులు శివారు ప్రాంతాలతో పాటు పట్టణం నడిబొడ్డున ఉన్న ఇళ్లను అద్దెకు తీసుకొని, అక్కడే బెట్టింగులకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ నిర్వాహకుడికి ముందస్తుగా కొంత మేర డిపాజిట్ చేస్తూ, ఓడిపోతే వాగ్వాదాలు చేయకుండా రూల్స్‌ను పెట్టుకుంటున్నారు. రాష్ట్రంలోని నిజామాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, ఆదిలాబాద్, నల్గొండ తదితర ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన డివిజన్ పరిధిలో బెట్టింగుల ప్రభావం ఎక్కువగా ఉంటోందని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో మ్యాచ్ ఉన్న రోజు ఎక్కువ స్థావరాలను ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.ఇదిలావుండగా నేడు జరిగే ఇండియా, పాక్ మ్యాచ్‌కు భారీ ఎత్తున బెట్టింగ్‌లకు పాల్పడే అవకాశం ఉండటంతో పోలీసులు అనుమానిత ప్రాంతాలలో తనిఖీలు చేపడుతున్నారు.

**నిషేధించారు కదా..**

ఇటీవలే తెలంగాణ, ఏపీలలో జూదానికి సంబంధించి ఆన్లైన్ రమ్మీ, పోకర్, తీన్ పత్తి వంటి ఆటలను ప్రభుత్వం నిలిపి వేసిన సంగతి తెలిసిందే. డ్రీం 11 యాప్‌ను నిషేధించినప్పటికీ.. ఇతర రాష్ట్రాల పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ కాంటెస్ట్‌లో పాల్గొంటున్నారు. 30 రూపాయల నుంచి 10,000 చెల్లించి ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు.

**కాంటెస్ట్ విధానం ఇలా..**

మ్యాచ్ జరిగే రోజు రెండు జట్ల నుంచి 11 మంది క్రికెటర్లను ఎంచుకొని ఒక టీమ్‌ను ఎంపిక చేసుకుంటారు. ఇందులో ఉన్న సభ్యుల ఆటను బట్టి యాప్ పాయింట్లు ప్రకటిస్తుంది. ఎంచుకున్న టీము సభ్యులు అందరూ బాగా ఆడి ఎక్కువ పాయింట్లు సంపాదిస్తే కాంటెస్టులో మొదటి స్థానంలో కొనసాగుతారు. 20 కోట్ల రూపాయలు కాంటెస్టులో మొదటి స్థానంలో నిలిచిన వారికి ఒక కోటి ప్రైజ్ మనీ ఇస్తారు. ఈ కాంటెస్టులో 54 లక్షల పైగా మంది 49 రూపాయలు చెల్లించి పాల్గొంటారు. ఇంతమందిలో మొదటి స్థానంలో నిలిచిన ఒక్కరికి మాత్రమే కోటి రూపాయలు వస్తాయి. తరువాత 10 స్థానాల వరకు 5 లక్షల నుంచి పదివేల వరకు ఇస్తారు. తరువాత 30 లక్షల మంది వరకు వరుసలో ఉన్న వారికి వారి డబ్బులు వారికి తిరిగి ఇస్తారు. ఆ తరువాత దిగువ ఉన్న పది లక్షల మంది తమ డబ్బులు కోల్పోవాల్సిందే.

# బీజేపీకి కరీంనగర్ కార్పొరేషన్..?

**కరీంనగర్, ఫిబ్రవరి 14:** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచిన ఇద్దరు స్వతంత్ర కార్పొరేటర్లు బీజేపీ గూటికి చేరారు. కేంద్రమంత్రి బండి సంజయ్ వారికి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఇది వరకే మరో ఇద్దరు కార్పొరేటర్లు బీజేపీలో చేరగా.. తాజాగా మరో ఇద్దరు కమలం పార్టీకే జై కొట్టారు. దీంతో కార్పొరేషన్లో బీజేపీ బలం 34కు చేరింది. మొత్తం 66 డివిజన్లలో ఎన్నికలు జరగ్గా.. బీజేపీ 30 స్థానాల్లో గెలుపొందింది. తాజాగా మరో నలుగురు చేరడంతో మ్యాజిక్ ఫిగర్ దాటేసింది. దీంతో దాదాపు బీజేపీకే కరీంనగర్ కార్పొరేషన్ దక్కింది.

# సీపీఐకి కొత్తగూడెం మేయర్ పదవి

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన స్థానాలు రాకపోవడంతో.. సీపీఐకి ఇతర పార్టీల మద్దతు అవసరం అయింది. ఇప్పటికే బీఆర్ఎస్ మద్దతు ప్రకటించగా.. కాంగ్రెస్ నిర్ణయం కోసం సీపీఐ నేతలు ఎదురుచూశారు. చివరకు కాంగ్రెస్ నుంచి సానుకూల ప్రతిపాదన కావడంతో మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు.

# అరవిందుని విచారణకు అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు లేకుండానే రేస్ నిర్వహించడంతో క్విడ్ ప్రో కో జరిగిందని వివరించారు. కాగా బీఆర్ఎస్ పార్టీకి రూ.44 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లు అందాయని తుది నివేదికలో పేర్కొన్నారు. ట్రైపార్టీ అగ్రిమెంట్‌కు ముందే బీఆర్ఎస్‌కు ఈ-బాండ్లు చెల్లించారని తెలిపారు.

# సారు..కారు...పదహారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌తో కలిసి ఆమె శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్, ఇప్పుడు కేవలం 16 స్థానాలకే పరిమితమైందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని, ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ నేతలు పరోక్షంగా సహకరించారని ఆరోపించారు. ఇది ఆ రెండు పార్టీల అక్రమ పొత్తుకు తొలిమెట్టు అని, అయినప్పటికీ వారు ఎన్నికల ఫలితాలలో రాణించలేకపోయారన్నారు. కాగా కూనంనేని సాంబశివరావు కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ మీద చేసిన ఆరోపణలను ఇప్పుడు సీపీఐకి మద్దతు ఇవ్వడం ద్వారా బీఆర్ఎస్ అంగీకరిస్తోందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిందని, చాలా చోట్ల రీకౌంటింగ్ పేరుతో అధికార దుర్వినియోగానికి పాల్పడిందని విమర్శించారు. ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారని, కానీ త్వరలోనే జాగృతి ఆ లోటును భర్తీ చేస్తుందని జోస్యం చెప్పారు. బీజేపీ కరీంనగర్ మేయర్ తప్ప ఎక్కడా గెలవలేదని, కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేసినా ఓడిపోయారని కవిత ఎద్దేవా చేశారు.

**ఇది...ట్రైలర్ మాత్రమే:**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తమ భవిష్యత్తు రాజకీయ ప్రస్థానానికి కేవలం ఒక 'ట్రైలర్' మాత్రమేనని, అసలు 'సినిమా' ముందుందని తెలంగాణ జాగృతి చీఫ్ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిస్తూ, రానున్న రోజుల్లో తమ కూటమి రాష్ట్రంలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కూటమి అద్భుతమైన ప్రతిభ కనబరిచిందని కవిత పేర్కొన్నారు. తాము రాజకీయ పార్టీగా మారబోతున్నామని ప్రకటించిన తక్కువ సమయంలోనే ప్రజలు మమ్మల్ని ఆదరించారని గుర్తు చేశారు. జాగృతి, ఫార్వర్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసిన అభ్యర్థుల్లో 40 మంది విజయం సాధించారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో మాకు స్పష్టమైన మెజార్టీ లభించిందని ఆమె వెల్లడించారు. అధికారికంగా 33 స్థానాలు వచ్చినప్పటికీ, మరో 7 చోట్ల బీ ఫామ్ సాంకేతిక కారణాల వల్ల స్వతంత్రులుగా గెలిచింది కూడా తమ అభ్యర్థులేనని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో అత్యంత పారదర్శకమైన, అహంకారం లేని, అందరూ ఆదరించే విధంగా ముందుకు సాగుతామన్నారు. తమకు ప్రజల మద్దతు ఇలాగే కొనసాగుతుందని, వారు మమ్మల్ని ఎల్లప్పుడూ ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నట్లు ఈ సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కవిత మీడియాతో చెప్పుకొచ్చారు.

# ప్రతి పంటకూ మద్దతు ధర ఇవ్వాలె

(మొదటి పేజీ తరువాయి)

స్వామినాథన్ కమిటీ కూడా ఇదే చెప్పిందని పేర్కొన్నారు. కానీ ఎంఎస్పీ ఇవ్వకపోవడంతో దేశవ్యాప్తంగా లక్షల మంది రైతులు చనిపోవడంతో పాటు కోట్లాది రూపాయలు నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుంచి పంట కొనుగోలు చేయకుండా బయట దేశాల నుంచి కొంటామని అంటున్నారనీ, మరి దేశంలో రైతులు ఏమైపోతారని ప్రశ్నించారు. మన పంట మనం కొనకపోతే ఎలా? మన రైతులకు సరైన ధర ఇచ్చి కొనమనడం నేరమా ? అని ప్రశ్నించారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## మీ త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరిచిపోదు

నాటి ఘటనను గుర్తుచేసుకుంటూ.. వారి త్యాగాన్ని భారత్ ఎన్నటికీ మరిచిపోదని మోడీ అన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టే మన భద్రతా దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువని.. దానిని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

- ప్రధాని మోడీ



**సైనికుల అత్యున్నత త్యాగాన్ని దేశం మరువదు**

'పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన సైనికులకు నివాళులు అర్పిస్తున్నాను. వారి అత్యున్నత త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరిచిపోదు. ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కోడానికి బలమైన, సురక్షితమైన దేశాన్ని నిర్మించడం కోసం భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది'

- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

**అమరుల కుటుంబాలకు దేశం మద్దతుగా ఉంటుంది**

'2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సీఆర్పీఎఫ్ జవాన్లకు నివాళులు అర్పిస్తున్నాను. వారి కుటుంబాలకు దేశం ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుంది. ఉగ్రవాదాన్ని నిర్మూలించి, దేశాన్ని సురక్షితంగా మార్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది'

- రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్

## పుల్వామా దాడికి ఏడేండ్లు

# అమర వీర సైనికులకు నివాళులు



**ఢిల్లీ, ఫిబ్రవరి 14:** పుల్వామా దాడి జరిగి ఏడేండ్లవుతున్న సందర్భంగా అమరవీరులకు ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై ఉగ్రవాదులు భీకర దాడి కి తెగబడి 40 మంది జవాన్లను బలిగొన్న సంగతి తెలిసిందే.

**భారత్ గౌర్వపడుతోంది**

పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల అంకితభావం, సంకల్పం, దేశ సేవ, ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. మాతృభూమి సార్వభౌమత్వం, సమగ్రత కోసం గొప్ప త్యాగం చేసిన ధీర జవాన్లు, వారి కుటుంబాలను చూసి భారత్ ఎప్పుడూ గర్వపడుతోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది'

- హోంమంత్రి అమిత్ షా

**అమరులైన సైనికులు ప్రజల గుండెల్లో నిలిచి పోతారు**

'2019లో పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడిలో అమరులైన మన సైనికులు ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. వారు చేసిన అత్యున్నత త్యాగానికి దేశం ఎప్పటికీ వారికి రుణపడి ఉంటుంది'

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

# పుర పోరులో 'పొంగులేటి' మ్యాజిక్

- 10 రోజుల్లో 249 వార్డుల్లో ప్రచారం
- 70 శాతం సక్సెస్ రేటుతో 174 వార్డుల్లో గెలుపు
- శీనన్న వ్యూహంతో ఉమ్మడి ఖమ్మం.. ఉమ్మడి వరంగల్ పురపాలికల్లో హస్తం ప్రభంజనం!



**ఖమ్మం, ఫిబ్రవరి 14(మనం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి (శీనన్న) ఒక అజేయ శక్తిగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంతన్న అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకున్న ఆయన, తన వ్యూహ చతురతతో ఫలితాలను తలకిందులు చేశారు. కేవలం అంకెలే కాదు.. ఆ అంకెల వెనుక ఉన్న ఆయన కష్టం, ప్రచారం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. కేవలం 10 రోజుల్లోనే అసాధ్యమనుకున్న సమీకరణాలను సుసాధ్యం చేసి చూపారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా :** శీనన్న అడ్డాలో తిరుగులేని హవా!

తన సొంత గడ్డపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గాలివాటం కాదు.. సునామీ సృష్టించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది.

**ఏదులాపురం :** 32 వార్డుల్లో ఏకంగా 24 చోట్ల జయకేతనం ఎగురవేసి సత్తా చాటారు.

**కొత్తగూడెం కార్పొరేషన్ :** సింగరేణి హృదయంలో 22 స్థానాలను కైవసం చేసుకున్నారు.

**కల్లూరు సత్తుపల్లి:** కల్లూరులో 12, సత్తుపల్లిలో 17 వార్డులను హస్తం ఖాతాలో వేశారు.

**ఇల్లందు అశ్వారావుపేట :** ఇక్కడ కూడా ఇల్లందులో 19, అశ్వారావుపేటలో 17 స్థానాల్లో గెలిచి తన పట్టును నిరూపించుకున్నారు.

**ఓరుగల్లు కోటపై హస్తం జైత్రయాత్ర!**

రేవంతన్న ఆశీస్సులతో ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యతలను స్వీకరించిన శీనన్న, అక్కడ కూడా ప్రత్యర్థుల కోటలను బద్ధలు కొట్టారు.

**భూపాలపల్లి :** అత్యంత కీలకమైన ఈ మున్సిపాలిటీలో 16 వార్డులను గెలుచుకుని పట్టు సాధించారు.

**పరకాల స్టేషన్ ఘన్పూర్ :** పరకాలలో 13, స్టేషన్ ఘన్పూర్లో 13 స్థానాలను గెలిపించి జిల్లాలో కాంగ్రెస్ ప్రాభవాన్ని చాటారు.

**గణాంకాలే సాక్ష్యం :** 249 వార్డుల ప్రచారం.. 174 స్థానాల్లో విజయం!

మొత్తంగా మంత్రి పొంగులేటి ప్రచారం నిర్వహించిన 249 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 174 స్థానాలను గెలుచుకుంది. అంటే సుమారు 70 శాతం గెలుపు రేటుతో ఆయన 'మోస్ట్ సక్సెస్ ఫుల్' లీడర్గా నిలిచారు. పగలు రేయి ఏకంచేసి ఆయన సాగించిన సుడిగాలి పర్యటనలు, రేవంతన్న సంక్షేమ పథకాలపై ప్రజలకు కల్పించిన భరోసా ఓట్ల వర్షంగా కురిసింది. మాట ఇస్తే తప్పని నైజంతో, అభివృద్ధిపై ఉన్న నిబద్ధతతో శీనన్న ప్రజాప్రభుత్వంలో తన మార్క్ రాజకీయాలను మరోసారి చాటిచెప్పారు.

# పేదల జాగా కోసం పోరుకు సిద్ధం

## సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**చేవెళ్ల, ఫిబ్రవరి 14 ( మనం న్యూస్):** పేదల జాగా కోసం పోరుకు సిద్ధం కావాలని. ఇండ్ల జాగా వచ్చేవరకు ఇంచు కూడా కదలకుండా ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య పిలుపునిచ్చారు . శనివారం చేవెళ్ల పట్టణంలోని 75వ సర్వే నంబర్ లో గల భూ పోరాట కేంద్రంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జీ కె.రామస్వామి అధ్యక్షతన మూడు సంవత్సరాల వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .ఈ వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ... భూమి భుక్తి విముక్తి కోసం నాడు తెలంగాణ సాయుధ రైతన్న పోరాటం చేసిన చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ నేడు పేదల కోసం బడుగు జీవుల కోసం జానెడు జాగ కోసం ఎర్రజెండా పార్టీ పేదల తరపున పోరాడుతున్నదని జంగయ్య తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమ్యూనిస్టు పార్టీలను ఎర్రజెండాను గొప్పగా కీర్తించడం సంతోషం కానీ అదే పార్టీలు పేదల తరపున పోరాడుతుంటే పోలీసు కేసులు పెట్టించడం లేదా భూ పోరాటాలు నిర్వహిస్తున్న మహిళలపై దౌర్జన్యాలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు . చేవెళ్ల పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలుగా పేదలు జానెడు జాగా కోసం ప్రభుత్వం భూమి సర్వే నెంబర్ 75 లో గుడిసెలు వేసుకొని అక్కడే జీవిస్తున్నారు అక్కడ కరెంటు సౌకర్యం లేకపోయినా మంచినీళ్ల సౌకర్యం లేకపోయినా అవస్థలు పడుతూ పేదలు పోరాడుతుంటే ప్రభుత్వ అధికారులు , స్థానిక ఎమ్మెల్యే వారిని పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన విమర్శించారు . సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు వార్షికోత్సవ సందర్భంగా పార్టీ పతక ఆవిష్కరణ చేశారు . ఈ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. ప్రభు లింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం. సత్తిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు మంజుల జే అంజయ్య , సుధాకర్ గౌడ్, స్వామి, కార్యకర్తలు బాబురావు, యాదగిరి , నర్సింలు , శ్రీను , రవి, లలిత , పెంటయ్య, వెంకటమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా

# భైరవసేర్లా భైరవేశ్వర స్వామి ఉత్సవాలు..

### ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా విరజిల్లుతున్న మహా పుణ్యక్షేత్రం

### కొండకోనలు, ప్రకృతి ఒడిలో కొలువుదీరిన ఆలయం







**ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఫిబ్రవరి 14 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని సిద్దాపురం గ్రామ సమీపంలో ఉన్న జోగ్యతండలో వెలసిన భైరవసేర్లా భైరవేశ్వర స్వామి ప్రకృతి ఒడిలో కొండల నడుమ వెలసిన ఈ పుణ్యక్షేత్రం కూడా ఆకట్టుకునేలా ఉంది క్షేత్ర మహాశివరాత్రి జాతర 2026 నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతంలోని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా విరజిల్లుతున్న క్షేత్రం శివరాత్రి పర్వదినానికి సిద్ధమవుతోంది సిద్దాపురం పరిధిలోని జోగీయ తండా సమీపంలో ఎస్ ఎల్.బిసి ప్రాజెక్టుకు దగ్గరగా వంకేశ్వరం సరిహద్దుల్లోని కొండల మధ్య ఈ క్షేత్రం ఉంది ప్రకృతి సౌందర్య, దట్టమైన అడవి ఎస్ ఎల్ బి సి ప్రాజెక్ట్ ఇక్కడ కొలువై ఉన్న భైరవుడు శివుడు భక్తుల కోరికలను తీర్చే ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందాడు పాదయాత్ర శివరాత్రి వేళ భక్తులు కాలినడకన అడవి మార్గం గుండా స్వామి వారిని దర్శించుకోవడం ఇక్కడి ప్రత్యేక ఆచారం ముఖ్య కార్యక్రమాలు ఫిబ్రవరి 15, 2026 మహాశివరాత్రి జాతర ఈ ఏడాది ఫిబ్రవరి 15న భారీ ఎత్తున జాతర నిర్వహించబడుతుంది అన్నదానం స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని జోగియా తండా సర్పంచ్ కుమార్ తెలిపారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నాము.




## న్యాయవాద రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలి

- టీఆర్పీ మండల అధ్యకుడు కునుకుర్తి అశోక్.

**చేవెళ్ల, ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** న్యాయవాద రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని టీఆర్పీ మండల అధ్యకుడు కునుకుర్తి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న న్యాయవాద రక్షణ చట్టం అమలు కోసం నిరవధిక దీక్ష చేస్తున్న తోటి న్యాయవాద సభ్యులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ... న్యాయవాద రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలి అని ఒకవేళ అమలు చేయకపోతే తను ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధంగా ఉన్నాని తెలియచేశారు. ఇప్పటి వరకు ఎంతో మంది న్యాయవాధులపై హత్యలు, దాడులు జరుగుతున్నప్పటికి ప్రభుత్వం న్యాయవాధులకు ఎలాంటి ప్రత్యేక చట్టం తీసుకు రావడం లేదు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో న్యాయవాదులు బురాన్ సత్యానందం, జైపాల్, డి శ్రీనివాస్, తలారి ప్రకాశం, సి హెచ్ రవీందర్, సాయి రామ్, ఎమ్ మహేష్, బి.ఆనంద్, గుట్టల శేఖర్, తెలుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చైర్మన్ కుర్చీ కోసం రాజకీయ కిడ్నాప్?

## హంగ్ ఫలితాల తర్వాత అడ్డదారి రాజకీయాలు ఆరోపణ

## బీఆర్ఎస్ నాయకుడు అల్లం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**చేవెళ్ళ, ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** మొయినాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో చైర్మన్ పదవి కోసం రాజకీయ పావులు కదులుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో అడ్డదారులు తొక్కుతోందని బీఆర్ఎస్ నాయకుడు అల్లం శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. చైర్మన్ కుర్చీ కోసం బీఆర్ఎస్ నుండి గెలిచిన కౌన్సిలర్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ నాయకులు తమ వైపు తిప్పుకునేందుకు 'కిడ్నాప్ రాజకీయాలు' ప్రారంభించారని మండిపడ్డారు. ఇది రాజకీయ ఆకర్షణ కాదు ఇది ప్రజాస్వామ్యాన్ని బందీ చేయడం అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

**ప్రజల తీర్పుని దొంగిలించే కుట్ర!**

ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్ను తిరస్కరించి బీఆర్ఎస్ను గెలిపించారు. అయినా చైర్మన్ సీటు కోసం సిగ్గులేకుండా మా కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. ఇది ఓటర్ల గౌరవాన్ని అవమానించడం అని అల్లం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్లో తీవ్ర అన్యాయం జరుగుతుండటంతోనే తాను బీఆర్ఎస్లో చేరానని గుర్తుచేస్తూ, ఇప్పుడు అదే అన్యాయ రాజకీయాలు మొయినాబాద్లో బయటపడుతున్నాయని విమర్శించారు.

**ఎమ్మెల్యే కాలే యాదయ్య ఎక్కడ?**

ముఖ్యంగా ఇటీవల స్పీకర్ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని స్పష్టం చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య పాత్రపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ఇలా కిడ్నప్ చేస్తుంటే కాలే యాదయ్య ఎక్కడ ఉన్నారు? పార్టీ తరపున స్పందన ఎందుకు లేదు? అని ప్రశ్నించారు.

మొయినాబాద్ రాజకీయాల్లో ఈ ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. చైర్మన్ ఎన్నికల ముందు చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానిక రాజకీయాలను అగ్గిపెట్టెలా మారుస్తోంది.

# పోలీసు వేషం.. పక్కా మోసం

- చట్టాల్లో డిజిటల్ అరెస్ట్ అనే పదమే లేదు
- సైబర్ మోసానికి గురైతే 1930 కు కాల్ చేయండి
- హైదరాబాద్ సీపీ సజ్జనార్



**హైదరాబాద్,ఫిబ్రవరి14(మనం ప్రత్యేక ప్రతినిధి):** బెట్టింగ్ యాప్‌లు,సైబర్ మోసాలు,స్కాంలపై అలుపెరుగని పోరు సల్పుతూ, నిరంతరం ప్రజల్లో అవగాహన కల్పించే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ శనివారం మరో ఇంట్రెస్టింగ్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఎత్తుగడతో అమాయకులను, విద్యావంతులను సైతం మోసం చేస్తున్నారని సీపీ ఎక్స్ ఖాతా ద్వారా తన సందేశాన్ని పంచుకున్నారు. పోలీసులు ఎప్పుడూ వాట్సాప్, వీడియో కాల్స్ ద్వార విచారణ జరపరని, డిజిటల్ అరెస్ట్ అనే పదమే చట్టంలో లేదని, ఇలాంటి మోసపూరిత కాల్స్ వస్తే ప్రజలు అందోళన చెందకుండా 1930 నంబరుకు కాల్ చేయాలని సజ్జనార్ ప్రజలకు సూచించారు.

**పక్కా మోసం:**

సైబర్ నేరగాళ్లు నకిలి పోలీస్ స్టేషన్ సెటప్ వేసి, పోలీసు దుస్తులు ధరించి వీడియో కాల్స్ చేసి,అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దండుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు. ఈ తరహా మోసాలను వివరిస్తూ..పోలీస్ వేషం చూసి మోసపోకు..వీడియో కాల్ నమ్మి మునిగిపోకు అంటూ ప్రజలకు సీపీ పిలుపునిచ్చారు. పోలీస్ వేషధారణలో వచ్చే వీడియో కాల్స్ పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని సీపీ చెప్పారు. నగర పోలీసులు చేపట్టిన 'జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సజ్జనార్ ప్రజలను కోరారు. ఇలాంటి బెదిరింపు కాల్స్ వస్తే ఆందోళన చెందకుండా వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులు, మిత్రులకు షేర్ చేసి వారికి కూడా అవగాహన కల్పించాలని సీపీ ప్రజలకు సూచించారు.

# నగరంలో న్యాయవాది దారుణ హత్య



**హైదరాబాద్,ఫిబ్రవరి 14(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సైబరాబాద్ పరిధిలోని అత్తాపూర్‌లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నడిరోడ్డుపై అడ్వకేట్ మహమ్మద్‌ను కిరాతకంగా కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఖదీర్.. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. స్థానికుల సమాచారంతో విషయం తెలిసిన పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు. కుటుంబ విభేదాలతో బంధువులే చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇటీవలే రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్నను దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆస్తి కోసం సొంత సోదరుడు స్వప్నను అత్యంత అమానుషంగా చంపేశారు. ఈ ఘటనను ఇంకా మరువకముందే నగరంలో మరో న్యాయవాదిని హత్య చేయడం కలకలం రేపుతోంది. తాజాగా మరో న్యాయవాది హత్యకు గురికావడంతో న్యాయవాద సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

# శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు

**షాద్ నగర్, ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా షాద్ నగర్ డిపో నుండి శ్రీశైలం కు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఉషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు అనుకూలంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ షాద్నగర్ డిపో నుండి శ్రీశైలంకు తేది 14-2-25నుండి 17-2-25 వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మరియు 30 మంది ప్రయాణీకులు ఉన్న వారికి స్పెషల్ బస్సులను కేటాయిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు భక్తులు వినియోగించుకోవాలని కోరారు.




## వీర జవాన్ల త్యాగం మరువలేనిది

- సంస్కృతి పాఠశాలలో పూల్వామా అమరులకు ఘన నివాళి

**చేవెళ్ల, ఫిబ్రవరి 14(మనం న్యూస్):** ప్రతీ విద్యార్థి దేశ భక్తిని కల్గివుండాలని సంస్క ృతి పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలిపారు. శనివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పామెన సమీపంలో గల సంస్క ృతి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పూల్వామా అమరుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ .. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... దేశ సరిహద్దులో రాత్రీపగలు తేడా లేకుండా అహర్నిశలు దేశ రక్షణ కోసం కాపలా కాస్తూ ఉగ్రవాదుల చేతిలో హతమైన వీర జవాన్ల త్యాగం మరవలేదనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది

- ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య




**రంగారెడ్డి ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** విద్యార్థులకు పాఠశాల విద్య ఎంతో ముఖ్యమని,విద్య కేవలం మార్కులకు పరిమితం కాకుండా బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దాలని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య అన్నారు. శ్రీ త్రివేణి పాఠశాలలో నిర్వహించిన 'ఉద్భవ్ 2026' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీ త్రివేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కె. గోవర్ధన్ రెడ్డి తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కుల కతీతమైన విద్యకు ప్రతిబింబం సరూర్నగర్లోని శ్రీ త్రివేణి పాఠశాల అని, ఈ కార్యక్రమం ద్వారా అనుభవాత్మక విద్య, విద్యార్థుల ఆత్మవిశ్వాసం , సమగ్ర అభివృద్ధిని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఫిబ్రవరి 13న నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్లో విద్యార్థులు నమూనాలు, ప్రాజెక్టులు, చార్టులు ప్రత్యక్ష ప్రయోగాల ద్వారా తమ విద్యను ధైర్యంగా వివరిస్తూ తమ అంశ పరిజ్ఞానం, స్వతంత్ర ఆలోచన, సంభాషణా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు తల్లిదండ్రులకు తమ పిల్లల అభ్యాసాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశాన్ని కల్పించాయి. విద్యార్థులు శాస్త్రీయ నృత్యం, పియానో, అబాకస్, ఇంగ్లీష్ కమ్యూనికేషన్, తైక్వాండో, యోగా, జీవన నైపుణ్యాలు వివిధ అంశాలపై ప్రత్యక్ష నమూనా వివరణలతో తమ ప్రతిభను ప్రదర్శించారు. సాంస్క ృతిక ప్రదర్శనలు క్రమశిక్షణ, సహానుభూతి, పర్యావరణ అవగాహన జాతీయ భావాన్ని ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీల్ కుమార్ , ప్రిన్సిపల్ యోగేశ్వరి , టీచర్ కౌన్సిల్ సభ్యురాలు అంజుమ్ ఫిర్దౌస్ , తల్లిదండ్రులు , సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య ద్వారానే సమాజంలో స్థిరమైన మార్పు తీసుకురాగలం: ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా



**రంగారెడ్డి ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** విద్య ద్వారానే సమాజంలో స్థిరమైన మార్పు తీసుకురాగలం అని ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా అన్నారు. అకడమిక్ అడ్వాన్స్మెంట్ ఫౌండేషన్ స్థాపకుడు కిరణ్ ఆధ్వర్యంలో ప్రతిభకు బలమైన తోడు ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి అవకాశాలు అందాలి అనే మహోన్నత లక్ష్యంతో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమము కు ఆయన ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకిగా మారకూడదనే ఆలోచనతో, ఫౌండేషన్ సమాజంలో అవసరమైన వారికి విద్యా పరంగా అండగా నిలువడం గొప్ప విషయం అని అన్నారు. స్థాపకుడు కిరణ్ మాట్లాడుతూ ప్రతిభ , అవకాశాల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం మా ప్రధాన ధ్యేయం. విద్య ద్వారానే సమాజంలో స్థిరమైన మార్పు తీసుకురాగలం. ప్రతి అర్హత కలిగిన విద్యార్థి తన కలలను నెరవేర్చుకోవడానికి మేము అండగా ఉంటాము అని తెలిపారు. విద్య ద్వారా భవిష్యత్ తరాలను బలోపేతం చేయాలనే సంకల్పంతో తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తోంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కోటేశ్వరరావు , మడిపడిగే రాజు , రాధా ధీరజ్ , బద్దం ప్రేమ మహేశ్వర్ , వరుణ్ గుప్తా , రంగ నరసింహ గుప్తా పాల్గొన్నారు.

# సనాతన ధర్మమే 'శైవ' ధర్మం





భారత హైందవ సంస్కృతిలో శైవం ఒక ప్రత్యేకతను సంతరించుకొని ఉంది. శైవమతం ప్రాచీన, వేద సాంప్రదాయాల సమ్మేళనం. చాతుర్వర్ణ వ్యవస్థ కలిగిన భారత హిందూ సమాజం శూద్రులు, అతిశద్రులను దేవుళ్ల దగ్గర కూడా అంటరాని వారిని చేసింది. కానీ ఇదే భారతదేశంలో అతి పురాతనమైన మతంగా విరాజిల్లుతున్న శైవ మతం అన్ని కులాలను అక్కున చేర్చుకున్నదని చెప్పాలి. ఆత్మ పరిశీలన ద్వారా ఆత్మ-పరమాత్మల ఐక్యతను శైవ మతం విశదీకరించడమే దీనికి కారణం కావచ్చు. దక్షిణ భారతదేశంలో ద్రావిడ సంస్కృతి ప్రభావంతో వైష్ణవ మతం కంటే ముందుగానే శైవ మతం బలంగా విస్తరించింది. శైవ మత సిద్ధాంతానికి దక్షిణ భారతదేశంలోని తమిళనాడు మరియు పొరుగున ఉన్న శ్రీలంక వంటి దేశంలో బలమైన పునాదులు పడ్డాయి. శైవ మతం అత్యంత ప్రాచీనమైన ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో ఒకటి. వేదాలు మూలాలుగా గల అష్టాదశ పురాణాలు ఉన్నాయి. ఆ వేదాలు చతుర్ముఖుడైన బ్రహ్మకు పరమశివుడే ఉపదేశించాడు అంటారు. కాబట్టి వేదాలు వాటి నుండి వెలువడిన శృతి,స్మృతులు, పురాణాలు అన్ని ప్రథమంగా శివుని చేత బ్రహ్మదేవుడికి తెలుపబడింది అన్నమాట. మహాభారతంలోని శాంతి పర్వంలో అష్టాదశ పురాణాం 'దశభిః కథ్యతే శివః' అని పేర్కొన్నారు. అష్టాదశ పురాణాల్లో పది పురాణాలు శివుని కథలతో నిండి ఉన్నాయంటేనే శివుడే పురాణ కథానాయకుడు అని తెలిసిపోతుంది. పురాణాలుఅలాగే సనాతనధర్మం వేదాలు మరియు ప్రాచీనగ్రంధాల నుండి ఉద్భవించిన అత్యంత ప్రాచీన వైదిక ధర్మంగా, పూర్వ ఆర్య సాంప్రదాయాలు, వేదాలలోని రుద్రుడి ఆరాధన నుండి శైవం ప్రాచుర్యంలోకి వచ్చిందని చెపుతారు. శైవమతం శివుడిని సర్వోన్నత దేవుడిగా ఆరాధించే పురాతన అతిపెద్ద సాంప్రదాయం. శైవమతంలో శైవ సిద్ధాంతం ( ద్వైతం ) కాశ్మీరీ శైవం ( అద్వైతం) వీరశైవం వంటి వివిధ శాఖల సంప్రదాయాలు ఉన్నాయి. సృష్టి స్థితి లయకారుడిగా శివుడిని ఆరాధిస్తారు. శివుని ఆరాధనకు శివాలయం ప్రధాన కేంద్రం. మన దేశంలో ఎన్నో శివాలయాలు ఉన్నాయి. అందునా మన తెలంగాణలో శైవ మతం చారిత్రకంగా కాకతీయుల కాలంలో బలంగా విస్తరించింది. శైవ మతం దాని ఆచారాలు పూర్వకాలం నుండి భారతదేశంతో పాటు నేపాల్, శ్రీలంక వంటి దేశాల్లో బలంగా వేళ్లూనుకుపోయి ప్రజలలో విడదీయరాని విశ్వాసాన్ని పాదుకొల్పాయనేది నిజం. ఇక యోగ, ధ్యానం, భక్తి మరియు ఆగమశాస్త్రాలకు శైవం ప్రాధాన్యత నిస్తుంది. శివుడు వేదాలకు పూర్వమే పూజించబడ్డాడని తెలుస్తోంది. క్రీ. పూ 200.. క్రీ.శ 100 సంవత్సరాల మధ్య కాలంలో రూపు దిద్దుకున్నాయి. శైవ మత మూలాలు క్రీ.పూ 2500-2000 మధ్యకాలంలోని సింధూ నాగరికత (పశుపతి ముద్రిక ) వరకు విస్తరించి ఉన్నాయని చెప్పాలి. ఋగ్వేదం ( క్రీ,,పూ1500-1200)లో రుద్ర ప్రస్తావన మొదటి స్పష్టమైన ఆధారం కాగా, పాణిని మహాభాష్యం (క్రీ.పూ 2వ శతాబ్దం) శివ భాగవతుల గురించి ప్రస్తావించడం గమనార్హం. ప్రధానంగా ప్రాచీన మధ్యయుగ భారతదేశంలో పల్లవ, చోళ, రాష్ట్ర కూట, కాకతీయ మరియు కళ్యాణి చాళుక్య వంశాల రాజులు శైవ మతాన్ని రాజ ధర్మంగా స్వీకరించి శైవ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా శైవ మత ఉద్యమాలకు ఊతమిచ్చి భారీ శివాలయాలను నిర్మించి శైవ మత వైభవాన్ని చాటిచెప్పారు. అంతెందుకు సృష్టికి మూలపురుషుడు అతి శూద్రుల ఆరాధ్యుడు జాంభవంతుడి కొలనుపాక లోని అదిజాంభవ మఠంలో శివారాధనే ప్రధాన మతాచారంగా కొనసాగుతోంది. లింగరూపంలో శివున్ని పూజించటం, ప్రకృతి నియమాలను పాటించటం ధ్యానం మరియు భక్తి మార్గాలద్వారా ముక్తి పొందటం దీని ప్రత్యేకత. శైవ సిద్ధాంతం ద్వంద్వ తత్వాన్ని బోధిస్తుంది. ఆత్మ శివుని అనుగ్రహంతో జ్ఞానోదయం పొందటం దీని అంతిమ లక్ష్యం. ఆదిశంకరాచార్యులు చెప్పినట్టు శివుడు అంటే అత్యంత పవిత్రమైన వాడు, ఎలాంటి కల్మషం లేనివాడు అని అర్థం. శివుడే సర్వజీవుల అంతర్ముఖుడు. శైవులు సాధారణ వ్యక్తిత్వం, అద్వైత వేదాంతం చుట్టూ కేంద్రీకృతమై ఉంటారు. రామాయణంలో మహావిష్ణు అవతారమైన రాముడు శివుడిని పూజించి కీర్తించాడు.

అలాగే శివుడు శ్రీరామ రామ రామేతి రామే రామే మనోరమే సహస్ర నామ తత్త్వం రామ నామ వారణనే అనిచెప్పి రామ నామాన్ని కీర్తించాడు. ఇక మహావిష్ణువు అవతారమైన భార్గవ రాముడు శివుడిని పూజించి 'పరశు' అనే దైవిక గొడ్డలి ని పొందాడు అని విన్నాం కదా అందుకే శివ తత్వాన్ని మించినది ఆయనతో సమానమైనది ఏదీ లేదు అంటారు. దక్షిణ భారతదేశంలో ద్రవిడ సంస్కృతి నేపథ్యంలో అత్యధిక జనాభా కలిగిన శూద్ర, అతిశూద్ర వర్గాల ప్రజలు అనాదిగా శైవ మతాన్ని ఆచరిస్తున్నారు. స్థానిక సాంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనతో శైవులుగా మారి వైష్ణవంలో సమ్మిళితం కాలేకపోయారు. కాబట్టి దక్షిణాదిన అనాదిగా శైవ మతం గొప్పగా విరాజిల్లుతుందని చెప్పొచ్చు. హర హర మహాదేవ శంభో శంకర, ఓం నమః శివాయ. సర్వం శివాత్మికం.

**నేడు మహా శివరాత్రి**

**- ధీరన్ కొడారి**
8008200664

## చిదానంద రూపం శివోహం

ఆనంద ప్రదాత ప్రళయ రుద్రుడు
జీవితం ఆనంద-విషాదాల మయం
దుఃఖ దాత, దహనుడూ ఆ శివుడే
శివైక్య ఆధ్యాత్మిక క్రమమే రౌద్రీకరణం

జీవన్నాటకం రక్తి కట్టించడానికి నటరాజు..
రంగరిస్తాడు సుఖదుఃఖాల వడ్డిస్తూ..
మంచి చెడుల్ని మేళవిస్తాడు పశుపతి
శివమెత్తి రౌద్ర రసాలు కుమ్మరిస్తాడు !

కైలాసం హిమాలయాల్లోనే కాదు..
కాయకష్టం చేసే శ్రమజీవిలోనూ ఉన్నాడు
కాయకమే కైలాసం, శ్రమజీవనమే శివం
భక్తి చిక్కబడితే 'అశివం' కరిగిపోతూ
సత్యం శివం సుందరం వెలువడుతుంది
అమృతం తాగినోళ్లు దేవతలైతే.
దేవతల హితానికి గరళాన్ని మింగినోడు..
ఎంత గొప్ప దేవ దేవుడో తెలుసుకోవాలి !

చావు పుట్టుకల మధ్య నాటకమాడించే..
ఆద్యంతరహితుడు, కాలాతీతుడు..
గంగలో జీవరాలు కొట్టుకుపోకుండా..
జాహ్నవిని జటాజూటంలోకి ఆహ్వానించి..

ఏడు పాయలుగా నేలపై పారించిన..
ఆ చిదానందరూప పరమేశ్వరుడు..
లింగమై భక్తకోటి దరికి దిగొస్తాడు..
అర్హతకు తగిన కోరిన వరాలిస్తాడు !

**మధుపాళీ**
9949700037

# బంధం ఇప్పుడైనా బలపడుతుందా?



ఎట్టకేలకు బంగ్లాదేశ్ లో ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడ్డాయి. బంగ్లా ఎన్నికలపై భారతదేశానికి ఆసక్తి ఎందుకో అందరికీ తెలిసిందే. ఎందుకంటే స్నేహితులని మార్చుకోవచ్చు కానీ పొరుగు వారిని మార్చలేము అన్నది పెద్దల సామెత. కాబట్టి పొరుగునే ఉన్న దాయాది దేశంలోని రాజకీయ పరిణామాలను ఆసక్తితో పరిశీలించడం అనేది మనకు అనివార్యమైపోయింది.

భారతదేశానికి చెందిన ఐదు రాష్ట్రాలు బంగ్లాదేశ్‌తో సరిహద్దులను పంచుకుంటున్నాయి. ఆయా రాష్ట్రాల్లో తీవ్రవాద గ్రూపుల బెడద తీవ్రంగా ఉండడం, వాటికి గతంలో భౌతిక మరియు నైతిక మద్దతు బంగ్లాదేశ్ నుంచి అంది ఉండడం, ఆ మద్దతు కూడా ఇప్పుడు బంగ్లాలో గెలిచిన పార్టీ హయాంలోనే అంది ఉండడం వలన ఇక్కడి ప్రతి పరిణామమూ భారత్‌కు ముఖ్యమైనదే. ఒకటిన్నర సంవత్సరాల క్రితం ఆ దేశంలో సంభవించిన పరిణామాలు ఆశ్చర్యకరమైనవి. అప్పటి ప్రధాని షేక్ హసీనా అమలుపరిచిన క్రూర నిర్బంధం, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా చెలరేగిన విద్యార్థి-యువజనుల ఉద్యమం ఆమె పదవీచ్యుతికి దారితీస్తుందని ఎవరు ఊహించి ఉండరు.

ఆమె తరువాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ కూడా ఇంత అధ్వాన్నంగా పరిపాలిస్తాడని ఎవరూ ఊహించలేదు. ఆయన పరిపాలన కాలంలో ఎక్కువ భాగం మత ఛాందస వాదాన్ని మరింత ఎగదోయడానికి మాత్రమే ఉపయోగించాడు.

ఒకప్పుడు తమ పార్టీని నిషేధించిన అవామీలీగ్‌పై తాత్కాలిక ప్రభుత్వము చేత నిషేధం విధింప చేసి జమాతే ఇస్లామి మీద ఒక విధంగా పగ తీర్చుకుంది.



ప్రధాన పార్టీ అయిన అవామీ లీగ్‌కు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకపోవడం, దానిపై నిషేధం ఉండడం, బిఎన్‌పి, జమాతే ఇస్లామిపార్టీలకు కలిసి వచ్చింది. 299 పార్లమెంటు స్థానాలలో 212 స్థానాలను బంగ్లా నేషనలిస్టు పార్టీ గెలుచుకోవడం, దానితో పాటుగా పూర్తి మతతత్వ పార్టీ అయిన జమాతే ఇస్లామి 70 స్థానాలను కైవసం చేసుకోవడం గొప్ప విషయం ఏమీ కాదు.

ఎందుకంటే పోటీయే లేని చోట ఎన్నికల పోరాటం అన్నది నల్లేరు మీద బండి నడకే కదా. విద్యార్థి యువజనుల పార్టీ అయిన నేషనల్ సిటిజన్ పార్టీకి అతి తక్కువ ఓట్లు రావడం ఇక్కడ గమనార్హం. ఉద్యమాన్ని నడపడం అయితే నడిపారు గాని దాని యొక్క లక్ష్యాలను సాధించడంలో వాళ్లు విఫలం కావడమే ఈ తక్కువ ఫలితాలకు కారణమని తెలుస్తూనే ఉంది.

అధికారంలోకి రాబోతున్న బీఎన్‌పీ కానీ ప్రతిపక్షంలో కూర్చోబోతున్న జమాతే ఇస్లామి పార్టీ గానీ భారత్‌తో అనుకూలమైన సంబంధాలను కోరుకునే పార్టీలు కాదు. వాటి గత చరిత్ర చూస్తే మనకు ఈ విషయం అర్థం అవుతుంది. అయినప్పటికీ బీఎన్‌పీ కొత్త నాయకుడు దివంగత బీఎన్‌పీ అధ్యక్షురాలు ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహమాన్ బంగ్లా ప్రజలకు ఇచ్చిన హామీలను బట్టి ఆయన పరిపాలన గతంలో కంటే భిన్నంగా ఉంటుందనీ,ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పుకొనే దిశగా ఆయన అడుగులు వేస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు.

బంగ్లాదేశ్ మనకు పొరుగు దేశం కావడం వలన సరిహద్దు భద్రత, నదీ జలాల పంపకం అక్రమ చొరబాట్లు వంటి అంశాలు భారత్ బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలను నిత్యం ప్రభావితం చేస్తాయి. ఈ విషయంలో బంగ్లా పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంటుంది.పశ్చిమ బెంగాల్లో చొరబాట్ల తీవ్రత ఎక్కువగా ఉందని అక్రమ వలసదారులను పంపించి వేయడానికి కేంద్ర ప్రభుత్వం దేశమంతా సర్ అనే కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ కార్యక్రమం పసివ బెంగాల్లో కొనసాగిస్తుండడం తెలిసిందే ఈ విషయంలో అనేక అనేక మలుపులు, సుప్రీంకోర్టు తీర్పులు సాక్షాత్తు ముఖ్యమంత్రి సుప్రీంకోర్టులో తమ రాష్ట్ర వాదనలు ఒక లాయర్ లాగా తానే వినిపించడం లాంటివన్నీ ఇటీవల జరిగిన పరిణామాలు. అలాగే ఇంకొక సరిహద్దు రాష్ట్రమైన అస్సాంలో కూడా ఎన్నికలు జరగబోతున్నాయి. వేరే రూపంలో అక్కడ కూడా అక్రమ చొరబాట్ల సమస్య అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రంగా ఉంది..నదీ జలాల ఒప్పందం ఇంకా అలాగే వుంది. ఇక సరిహద్దు భద్రత విషయంలో బంగ్లాదేశ్ అనుసరించే విధానం అనేది ఇరుదేశాల సంబంధాల పైన తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఎందుకంటే 2001- 2006లో బంగ్లాదేశ్ ను బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ పరిపాలించినప్పుడు జమాతే ఇస్లామి ఒత్తిడి మేరకు బి యన్ పి, భారత్‌తో ఘర్షణాత్మక వైఖరిని అవలంబించినందువల్లనే ఆ కాలంలో ఇరుదేశాల సంబంధాలు కుదుపునకు గురయిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా బంగ్లా నేషనలిస్టు పార్టీ అధికారంలోకి రాబోతుండడం, ప్రధాన ప్రతిపక్షంగా జమాతే ఇస్లామి ఉండడం అనేది ఇరు దేశాల సంబంధాల పైన తీవ్రమైన ప్రభావం చూపే అవకాశమే కనిపిస్తుంది.

ఎందుకంటే గతంలో జమాతే ఇస్లామి ప్రోత్సాహంతోనే తీవ్రవాద శక్తులు విజృంభించడం సరిహద్దుల్లో ఘర్షణలు తలెత్తడం జరిగేది. ఇప్పుడు ఆ పార్టీ ప్రధాన ప్రతిపక్షం స్థానంలో కూర్చుంటున్నది కనుక, అట్లాంటి చర్యలకి మళ్లీ ఊతమిచ్చే అవకాశం ఉంది గనుక, తారిఖ్ రెహమాన్ వివేకంతో వ్యవహరించాల్సి ఉంటుంది. అప్పుడే ఇరుదేశాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుంది.

**- గుండెబోయిన శ్రీనివాస్**
9985194697

# రుణాల ఊబిలో భారత్



సామాన్యులే కాకుండా ప్రభుత్వాలు సైతం అప్పులు లేనిదే ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అప్పులు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక స్థిరత్వం కోసం దేశాలు చేస్తున్న అప్పులు అతి భారీ స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి వెల్లడించిన గణాంకాల ప్రకారం కున్నారు. 2026 మార్చి నాటికి అప్పులు రూ. 7.46 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా వేశారు. 2026-27 బడ్జెట్లో గ్రాస్ మార్కెట్ బోరోయింగ్ (మొత్తం అప్పులు) సుమారు రూ. 17.2 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి తాజా గణాంకాల ప్రకారం ప్రపంచ దేశాల మొత్తం అప్పు 2025 నాటికి 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాలజాబితాలో అమెరికా తొలిస్థానంలో ఉండగా, భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో ఏడవ స్థానంలో




2025-26 నాటికి ప్రపంచ దేశాల మొత్తం అప్పు 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ అప్పులో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల్లోనే ఉండటం గమనార్హం.

భారతదేశంలోని 147 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరిపై ఈ ఏడాది మార్చి నాటికి రూ.1.34 లక్షల అప్పుంది. ఇది వ్యక్తులు చేసిన అప్పు కాదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం. ఈ సంవత్సరం (2026-27)కూడా భారీగాఅప్పులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14.61 లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్రం రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణానికి 17 శాతం ఎక్కువ కావడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ.53.47 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో మార్కెట్ నుంచి మొత్తం రూ.17.2 లక్షల కోట్లు సేకరించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించారు.

2025-26 సవరించిన అంచనాల ప్రకారం కేంద్రం మొత్తం అప్పులు రూ.1,97, 18,016 కోట్లు కాగా మార్చి 2027 నాటికి ఇది 2,14, 82,050 కోట్లకు చేరనుంది. ఇక జీడీపీలో రుణ నిష్పత్తిని 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వాస్తవానికి ఈ నిష్పత్తి 2019లో 50 శాతంలోపే ఉంది. ఇక తాజాబడ్జెట్లో జీడీపీలో ద్రవ్యలోటును 4.3 శాతంగా అంచనా వేశారు.2026 మార్చి 31నాటికి కేంద్రం మొత్తంఅప్పులు రూ.197.18లక్షల కోట్లకు (సుమారు ట్రిలియన్ డాలర్లు) చేరుకుంటా యని అంచనా వేశారు. ఇది 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ. 214.82 లక్షల కోట్లకు చేరవచ్చని బడ్జెట్ అంచనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో దేశం మొత్తం అప్పు సుమారు 85 శాతంగా ఉంది.

2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ. 197.18 లక్షల కోట్ల నుండి 2026-27 నాటికి రూ. 214.82 లక్షల కోట్లకు పెరుగుతాయని అంచనా.

2026 ప్రారంభానికి, దేశంలోని ప్రతి పౌరుడిపై సుమారు రూ. 1.34 లక్షల అప్పు (కేంద్రం చేసిన రుణాల ప్రకారం) ఉంది.

2025-26లో 4.4శాతం , 2026-27 నాటికి 4.3 శాతంకు తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 నాటికి 56.1శాతం గా ఉన్న అప్పు-జీడీపీ నిష్పత్తిని, 2026-27 నాటికి 55.6 శాతంకి తగ్గించాలని లక్ష్యంగా పెట్టు ఉంది. ప్రభుత్వం తన రుణ నిష్పత్తిని 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ అప్పులు ఉన్న దేశంగా అగ్రరాజ్యం అమెరికా తొలి స్థానంలో నిలిచింది. అమెరికా మొత్తం అప్పు 38.27 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచ మొత్తం అప్పులో మూడో వంతు కంటే ఎక్కువ కావడం గమనార్హం. నిరంతర బడ్జెట్ లోటు, పెరుగుతున్న వడ్డీ చెల్లింపులే ఇందుకు ప్రధాన కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది.

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా ఈ విషయంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ దేశం 18.68 ట్రిలియన్ డాలర్ల అప్పుల ఊబిలో ఉంది. చైనా అప్పులు 2025లో 13.6 శాతం వృద్ధితో అత్యంత వేగంగా పెరుగుతున్నట్లు ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది. రుణాల ఊబి జాబితాలో జపాన్ కూడా ఉంది. ఈ దేశం 9.83 ట్రిలియన్ డాలర్ల అప్పుతో 3వ స్థానంలో నిలిచింది. జపాన్ అప్పు దాని జీడీపీలో దాదాపు 230 శాతంగా ఉండటం ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక యూరప్ దేశాల్లోని యునైటెడ్ కింగ్డమ్ 4.09 ట్రిలియన్ డాలర్లతో 4వ స్థానం, ఫ్రాన్స్ 3.92 ట్రిలియన్ డాలర్లతో 5వ స్థానం, ఇటలీ 3.48 ట్రిలియన్ డాలర్లతో 6వ స్థానంలో నిలిచాయి. ఆయా దేశాల్లో సామాజిక సంక్షేమం, పింఛన్ల కోసం కోసం ఇబ్బడి ముబ్బడిగా ఖర్చు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. అన్ని దేశాల మాదిరిగానే భారత్ కూడా అప్పులు ఇబ్బడి ముబ్బడిగా తీసుకుంటోంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో 7వ స్థానంలో నిలిచింది. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. దీంతో అభివృద్ధి పనుల కోసం చేసే ఈ అప్పు సాధారణమేనని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, కేంద్ర బడ్జెట్లో ప్రభుత్వం ఒక సానుకూల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దేశ అప్పుల నిష్పత్తిని జీడీపీలో 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియా తర్వాత స్థానాల్లో జర్మనీ 3.23 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.60 ట్రి.డా, బ్రెజిల్ 2.06 ట్రిలియన్ డాలర్ల అప్పులతో టాప్ 10 జాబితాలో నిలిచాయి. జర్మనీ ఆర్థిక క్రమశిక్షణ మారుపేరు. అయినప్పటికీ ఇంధన ఖర్చులు తదితర కారణాలతో అప్పులపాలైంది. కెనడా, బ్రెజిల్..బడ్జెట్ లోటు, ప్రాంతీయ రుణాల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి.

**- ఇస్కా రాజేష్ బాబు**
93973 99298

# చట్ట సభలంటే వైసీపికి చులకనా?



ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించి సమర్థవంతమైన పరిష్కార మార్గాలను వెతకడమన్నది ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైన ప్రక్రియ. కానీ రాష్ట్రంలో ప్రతిపక్ష వైసీపీకి ఇది అర్థమైనట్టు లేదు. ఆ పార్టీ నాయకులు శాసనసభల పట్ల నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. బడ్జెట్ సమావేశాలను బహిష్కరించి, బయట మీడియా ముందు మాత్రం అడ్డగోలుగా మాట్లాడారు. అనేక ప్రజా సమస్యలతో పాటు తిరుపతి లడ్డు వ్యవహారం తదితర అంశాలపైన శాసనసభలో చర్చ జరిగే వేళ ప్రతిపక్షం ఇలా ప్రవర్తించడం ఎంతో బాధ్యతా రహితం. శాసనసభలో అధికారికంగా చెప్పే అవకాశం ఉన్నప్పుడు, బయట ఎన్ని చిలుక పలుకులు పలికినా అవన్నీ 'ఆఫ్ ది రికార్డు'గానే మిగిలిపోతాయి.

ప్రతిపక్ష హోదా అంశంతో శాసనసభనే బాయ్ కాట్ చేసిన వైసీపీకి రాజ్యాంగ నిబంధనలపై అవగాహనలోపం స్పష్టంగా కనిపిస్తున్నది. అసెంబ్లీలో ప్రతిపక్షానికి తగిన సంఖ్యాబలం లేకపోయినా ప్రతిపక్ష హోదాతో గుర్తింపు ఇవ్వాలని వైసీపీ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉంది. సభా నియమావళి ప్రకారం నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ ఇప్పటికే పలుమార్లు చెప్పినప్పటికీ తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు అన్నట్టుగా వైసీపీ ప్రవర్తిస్తూ చట్ట సభలను అవహేళన చేస్తోంది. ప్రజలు ఎన్నికలలో తమ ప్రతినిధిగా ఎన్నుకుని చట్ట సభలకు పంపేది,అక్కడ తమ వాణిని వినిపించి తమ సమస్యల పరిష్కారానికి పాటుపడతారని.అంటే ఒక నియోజకవర్గం లోని సమస్యలు పరిష్కరించబడాలంటే ఆ నియోజకవర్గ ప్రతినిధి తప్పనిసరిగా సభకు హాజరు కావాలి. ఆలా హాజరు కావడం లేదంటే తన్ను ఎన్నుకున్న ప్రజలకు ద్రోహం చేసినట్లే.అందుకే చట్టసభ సభ్యులు ఎవరైనా ఆకస్మికంగా మరణించినా ఆరు నెలల లోపుగా ఎన్నికలు నిర్వహిస్తారు.అంటే ఆరు నెలలకు మించి ఆ స్థానం ఖాళీగా ఉండ కూడదు.ఇటీవలి కాలంలో అధికారంలో ఉన్నంత కాలం సభలో కొనసాగుతూ,అధికారం పోతే తమ అహంతో సభను బహిష్కరించి వెళ్లిపోవడం జరుగుతుంది.గత శాసనసభలో చంద్రబాబును వైఎస్ఆర్సీపీ సభ్యులు ప్రతినిత్యం అవహేళన చేస్తూ, నిందిస్తూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడడంతో ఒకరోజు ఆయన విలపిస్తూ ఇది కౌరవసభ, ఈ సభకు ఇక రాను, తిరిగి ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడతాను అంటూ సభను వీడి, అన్న మాట ప్రకారం తన



ప్రతిజ్ఞ నెరవేర్చుకునే తిరిగి ముఖ్యమంత్రిగా సభలో అడుగు పెట్టారు. మరి అప్పుడు ఆయన జీత భత్యాలు తీసుకున్నారో, లేదో తెలీదు. ఆయన ఆరోజు ఆ విధంగా సభను విడడానికి బలమైన కారణం ఉంది. ఆయన సభా సాంప్రదాయం తెలిసిన వ్యక్తి. అంత తేలిగ్గా దూషణలకు చలించే వ్యక్తి కాదు. ప్రధానంగా తన వాణిని సభలో వినిపించే అవకాశం ఇవ్వకపోవడం వల్లనే తప్పని స్థితిలోఎంతో బాధతో ఆయన సభని వీడారు. పైగా గత సభలో ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రతిసారీ వైఎస్ఆర్సీపీ సభ్యులు వారిని గేలి చేస్తూ వ్యక్తిగతంగా దూషిస్తూ చర్చను పక్కదారి పట్టించడం నిత్య కృత్యమై పోయింది. దానిని సిఎం జగన్ కూడా వెకిలిగా నవ్వుతూ ఎంకరేజ్ చేస్తూ సభా సమయం వృధా కావడంలో తనవంతు పాత్ర పోషించారు. ఇక ఇప్పుడు వైఎస్ఆర్సీపీని ప్రజలు అత్యంత అవమానకర రీతిలో ఓడించి కేవలం 11 సీట్లకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. జగన్ దీనిపై ఆత్మ విమర్శ చేసుకోకుండా ప్రజలు తనను మోసం చేశారని ఒకసారి, ఇవిఎంలను టాంపర్ చేశారని మరోసారి నిందిస్తున్నారు. ప్రజల తీర్పును అర్థం చేసుకోకుండా ఇదే రీతిన వ్యవహరిస్తే ఈ పార్టీ మనుగడ కష్టమౌతుంది.పైగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం నుండి 2029 ఎన్నికల్లో మనదే గెలుపు, టీడీపీకి సింగిల్ డిజిట్ సీట్లే వస్తాయి అంటూ చిత్త చాంచల్యపు మాటలు మాట్లాడుతున్నారు. సభకు హాజరు కాబోనంటూ పరోక్షంగా సంకేతాలిస్తున్నారు. సభలో జరిగే అర్థవంతమైన చర్చల్లో పాల్గొనడు. సభలో ప్రమాణ స్వీకారానికి హాజరైన జగన్‌ను అధికార పక్షం గౌరవంగానే చూసింది. గతంలో చంద్రబాబును తొలి సమావేశంలో వైఎస్ఆర్సీపీ సభ్యులు చాలా గేలి చేసారు.అయినా బాబు గారు నవ్వుతూ తిప్పికొట్టారు.జగన్ తనకున్న అహంభావంతో సాధారణ సభ్యుడిగా సభలో కూర్చోలేకున్నారు అందుకే ప్రమాణం పూర్తయిన వెంటనే సభను విడి వెళ్ళిపోయారు. అధికారంలో ఉంటే సభలో ఉంటారు..ప్రజల్లోకి వెళ్ళరు.అధికారం లేకుంటే సభలో ఉండలేరు, ఓదార్పు యాత్ర అంటూ ప్రజల్లోకి వెళ్తారు. అయినా ప్రజలు పీడపోయిందంటూ సంతోషంగానే ఉన్నారు. వారికి ఎవరి ఓదార్పు అవసరం లేదు. ఓదార్పు కావలసింది ఈయనకే. స్వంత నియోజకవర్గం పులివెందులకు వెళ్తే నాయకులు మొహం చాటేశారు. కార్యకర్తలు తిరగబడ్డారు.ఇప్పటికైనా జగన్ మారి బుద్ధిగా సభకు హాజరై అర్థవంతమైన చర్చల్లో పాల్గొని ప్రజల మనసుల్ని గెలవడం మంచిది. కేవలం ఇద్దరు సభ్యులతో భాజపా సభలో పోరాడి ఆ తర్వాతి ఎన్నికల్లో వందకు పైగా సీట్లు సాధించింది. కనుక ఉన్న కొద్దిపాటి సభ్యులను నిలుపుకొని ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రతిపక్ష పాత్ర సక్రమంగా పోషిస్తూ ప్రజలిచ్చిన తీర్పుని సరిగా అర్థం చేసుకుని తన పాత్రకు న్యాయం చేయాలి. అలా కాదని అహంభావంతో సభను బహిష్కరిస్తే, ప్రజా తీర్పును వమ్ము చేసినందుకు 6 నెలల్లో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసి,పులివెందులలో తిరిగి ఎన్నికలు నిర్వహించి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. అదే విధంగా ప్రజల తీర్పుని కాలరాసి సభకు హాజరు కాని ఆయనను తదుపరి ఎన్నికలో అక్కడి నుంచి పోటీ చేయకుండా అనర్హుడిని చేయాలి. గతంలో చంద్రబాబుకు ఈ విధంగా చేయలేదని అనేవారికి ఒక్కటే సమాధానం ఆ సభలో చంద్రబాబు గొంతు నొక్కేశారు. ఈ సభలో ఆ విధంగా జరగలేదు. ఒకవేళ జరిగితే జగన్ కూడా ప్రజల్లోకి వెళ్ళవచ్చు. అయినా సభా మర్యాదను ఏ మాత్రం పాటించని జగన్‌లో మనం మార్పును ఆశించలేం.

ప్రభుత్వం తరుపున జరిగే అధికారిక కార్యక్రమాలకు జగన్‌ను ఆహ్వానిస్తున్నప్పటికీ ఆయన ఏ ఒక్క కార్యక్రమానికి హాజరు కాలేదు. ప్రజలు ఏమనుకుంటారనే వెరపు కూడా లేదు.కనీస మర్యాద పాటించడు. అసూయతోనూ, ప్రతీకారేశ్చతోనూ నిత్యం రగిలిపోతుంటాడు. భవిష్యత్తులో ఈ సంప్రదాయం కొనసాగకుండా ఉండాలంటే తప్పకుండా శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేసి సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. అప్పుడే ఈ పెడ ధోరణిని అరికట్టగలుగుతాం.

**- వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖమంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# మహాజాతరకు సర్వం సన్నద్ధం



- ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ

**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి13(మనం ప్రతినిధి):** ప్రసిద్ధ దక్షిణ కాశీ క్షేత్రం వేములవాడలో ఈ నెల 14, 15,16 తేదీల్లో మహాశివరాత్రి జాతర వేడుకలు వైభవోపేతంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. జాతర సందర్భంగా చేసిన ఏర్పాట్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, జాతర నిర్వహణలో పాల్గొంటున్న సంబంధిత శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జాతర గ్రౌండ్ పరిసరాలు, శివార్చన స్టేజ్, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టాయిలెట్లు, చలువ పందిళ్లు, జల ప్రసాదం పంపిణీ కేంద్రాలు, క్యూ లైన్లు, త్రాగునీటి సదుపాయాలు, భీమేశ్వర దేవాలయం పరిసరాలు, భక్తులకు మార్గదర్శనం చేసే సూచిక బోర్డులు, షవర్స్, అదనంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, కమాండ్ కంట్రోల్ రూమ్, తదితర ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. భక్తులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీసి, అవసరమైన చోట్ల తక్షణమే మెరుగుదల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. షిఫ్ట్ వారీగా సిబ్బంది ఉండాలని అన్నారు. త్రాగునీటి సరఫరా, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు నిరంతరంగా అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. మహాశివరాత్రి జాతరను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. పరిశీలనలో ఆర్డీఓ రాధాభాయి, ఈఓ రమాదేవి, డీఆర్డీఓ గీత, ఆర్ బి ఈఈ నరసింహ చారి, పంచాయత్ రాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ కిషోర్, సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఆలయ ఈఈ రాజేష్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అన్వర్, ఇంట్రా ఈఈ సుమలత, తహసీల్దార్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవానికి రండి



- మహాశివరాత్రి మహోత్సవానికి రండి
- ఎమ్మెల్యే ను ఆహ్వానించిన సర్పంచ్

**బోయిన్ పల్లి, ఫిబ్రవరి 13(మనం న్యూస్):** శ్రీశ్రీశ్రీ తిలింగ సంగమేశ్వర స్వామి దేవస్థానం విలాసాగర్ లో జరిగే మహాశివరాత్రి మహోత్సవ కార్యక్రమానికి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ను ఆహ్వానించడం జరిగిందని విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య తెలిపారు. గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజలు కూడా ఆహ్వానించడం జరిగింది . దాంట్లో భాగంగా ఈ శివరాత్రి మహోత్సవ కార్యక్రమానికి చొప్పదండి శాసనసభ్యులు విలాసాగర్ గ్రామానికి వచ్చి మహాశివరాత్రి కార్యక్రమంలో పాల్గొంటారని భక్తులందరూ పెద్ద ఎత్తున విలాసాగర్ త్రిలింగ సంగమేశ్వర స్వామి దేవస్థానం కు విచ్చేసి పెద్ద ఎత్తున విజయవంతం చేస్తారని ఆశిస్తున్నానారు.



# వెబ్ కాస్టింగ్ సెంటర్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 13(మనం ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ సెంటర్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలోని సినారె కళామందిరాల్లో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, వెబ్ కాస్టింగ్ సెంటర్ ద్వారా పరిశీలించారు. సెంటర్ లోని సిబ్బందికి సూచనలు చేశారు. పరిశీలనలో కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, శ్రావణ్, ఈడీఎం శ్రీనివాస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.





# గోదావరి స్నానానికి వెళ్లె భక్తుల కోసం ఏర్పాట్లు

**జన్నారం ఫిబ్రవరి 14(మనం న్యూస్):** జన్నారం మండలం లోని బాదంపల్లి కలమడుగు ప్రాంతాలలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరి స్నానానికి వెళ్ళే భక్తులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవటం జరిగిందని అధికారులు తెలిపారు.భక్తులు స్నానాలు చేసే దగ్గర ఘాట్ లను ఏర్పాటు చేయటం జరిగిందని

స్త్రీలకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని మంచినీటి సౌకర్యం కల్పించడం జరిగింది అని వాహనాలు పార్కింగ్ చేసుకోవటానికి ఏర్పాట్లు చేయటం జరిగింది అని చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని భక్తులు శాంతియుతంగా ఇతరులకు అసౌకర్యం కలగకుండా గోదావరి స్నానాలు చేసి మొక్కులు తీర్చుకోవాలని తెలిపారు.

# ఘనంగా జిల్లాస్థాయి సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీలు

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 14(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలు సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి జిల్లా డివైస్ ఓ అక్కపాక సురేష్ మున్సిపల్ కమిషనర్ రమేష్, మండల విద్యాశాఖ అధికారి ఆరెపల్లి రాజయ్య, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత శారీరకంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, సీఎం కప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రతిభకు మంచి వేదిక లభిస్తోందని పేర్కొన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, ఐక్యత పెరుగుతాయని తెలిపారు. అథ్లెటిక్స్ లో 100 మీటర్, 200 మీటర్, లాంగ్ జంప్, వివిధ కేటగిరీలలో పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పేట బాధ్యులు శోభారాణి, పెద్దపల్లి జిల్లా పేట అధ్యక్ష కార్యదర్శులు దాసరి రమేష్, వేల్పుల సురేందర్, మండల ఎస్ జి ఎఫ్ కార్యదర్శి తాండ్ర ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీవాణి, సరోజ,వెంకటేష్, విష్ణు, జావిద్, మాధవి, వెంకటేష్, అజయ్, కుమార్,రాజేందర్, సత్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



# గడ్డి మందు తాగినవారిని.. బతికించవచ్చు

- మెడికవర్ నెఫ్రాలజిస్టు రాంచందర్




**పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** పారాకుట్ (గడ్డిమందు) తాగిన వారిని 4-5 గంటల్లోపు ఆసుపత్రికి తీసుకురాగలిగితే వారిని బతికించే అవకాశం ఎక్కువగా ఉంటుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ అన్నారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎక్కువగా ఎండోసల్ఫాన్ మందు తీసుకునే వారని దానికి విరుగుడు ఉండడంతో దాదాపుగా అందరిని కాపాడగలిగామన్నారు. ఇటీవల ఆత్మహత్యలన్నీ గడ్డి మందుతోనే జరుగుతున్నాయన్నారు. విరుగుడు లేకపోవడం వల్ల చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కానీ గడ్డి మందు తాగిన వారిని 4 నుంచి 5 గంటల్లోపు ఆసుపత్రికి తీసుకురాగలిగితే.. ఏయే సమయంలో ఏ ట్రీట్మెంట్ ఇవ్వాలి, ఏ మందులు ఇవ్వాలనేది సరియైన సమయంలో ఇచ్చి ఐదారు దశల్లో చికిత్స అందిస్తూ బ్రతికించగలుగుతున్నామని తెలిపారు. ఇదే 5-6 సంవత్సరాల క్రితం గడ్డి మందు తాగితే 100 శాతం చనిపోయే పరిస్థితి నుంచి 25 శాతం బతికించే పరిస్థితికి తీసుకువచ్చామన్నారు. ఇప్పటి వరకు మెడికవర్లో గడ్డి మందు తాగిన 200 మంది పెషెంట్లను ట్రీట్ చేసి 52 మంది దాకా బతికించ గలిగామని వెల్లడించారు. స్పెషల్ ఫిల్టర్లు, అధునాతన చికిత్స సహాయంతో ఇది సాధ్యపడుతుందన్నారు. గడ్డిమందు తాగిన పేషెంట్కు తరలించేటప్పుడు ఆక్సిజన్ను పెట్టకూడదని తెలిపారు. ఆక్సిజన్తో లంగ్స్కి వెళ్లే ప్రమాదముందన్నారు. ఇక స్టోన్స్బెల్ట్గా పేరున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాంతాల్లో కిడ్నీల్లో రాళ్లు ఎక్కువగా వస్తాయన్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ ఉన్న వాళ్లు స్టోన్స్ని సరిగా పట్టించుకోకపోవడం, కొంతమంది మామూలు నడుం నొప్పిగా భావించి పేయిన్ కిల్లర్స్ వాడడం అలవాటుగా మారిందని తెలిపారు. దీంతో కిడ్నీలు ఎక్కువగా డ్యామేజ్ అవుతున్నాయన్నారు.

తగిన జాగ్రత్తలు తీసుకుంటే కిడ్నీ సమస్యల నుంచి బయటపడవచ్చని తెలిపారు.మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, క్రిటికల్కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, బొంగోని హరీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# 40 శాతం మైనార్టీలు ఉన్నా.. బిజెపికి 28 సీట్లు రావడం గర్వకారణం



- ఎంపీ అరవింద్.

**నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14 ( మనం న్యూస్ )** నిజామాబాద్ నగరంలో 40 శాతం మైనార్టీలు ఉన్నా బిజెపికి 28 సీట్లు రావడం గర్వకారణమని ఎంపీ అరవింద్ అన్నారు. నిజామాబాద్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో బిజెపి ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూ., 40 శాతం మైనార్టీలు ఉన్నా బిజెపికి 28 సీట్లు రావడం గర్వకారణం అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజలు బిజెపికి బ్రహ్మరథం పట్టారన్నారు. ఇందూరు ప్రజలకు బిజెపి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. టిఆర్ఎస్ కార్పొరేటర్ ను ఇంటి నుంచి ఎత్తుకు రావడానికి ఏసిపి, ఎస్ఐ లు ఎందుకు అని వారికి అందుకే జీతాలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుందని అన్నారు. నా మీద కేసు పెట్టడం కాదు నేనే పోలీసులపై కేసు పెడుతానని, లా అండ్ ఆర్డర్ బ్రేక్ చేస్తారా అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్, ఎంఐఎం ఒకటేనని తాము ముందు నుంచి ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల్లో అదే జరిగిందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కోర్టులను క్షమించేది లేదని అరవింద్ హెచ్చరించారు. సాంకేతికంగా తాము ఓడినా బీజేపీ పెరిగిందన్నారు. మున్సిపల్ కాలపరిమితి ముగిసే లోగా ఇందూర్ పేరు మారడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నైతిక విజయం బిఆర్ఎస్ పార్టీదే



**గోదావరిఖని, ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దౌర్జన్యాలు, కాంగ్రెస్ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఓటేశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు తక్కువ ఓట్ల తేడాతోనే ఓడిపోయారని తెలిపారు. రామగుండం రాజకీయాల్లో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలను బెదిరించడం, ప్రజలను ప్రచారానికి రాకుండా అడ్డుకోవడం, అధికార దుర్వినియోగం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు కల్పించినా ప్రజలు కాంగ్రెస్కు వ్యతిరేకంగా గొప్ప తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ఓటమి పాలైనప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థులు కష్టపడిన తీరు, అధికార పార్టీపై చేసిన పోరాటం అభినందనీయమని ప్రశంసించారు. ఇది నైతికంగా బీఆర్ఎస్ పార్టీ విజయమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అరాచక పాలనకు తమ అభ్యర్థుల విజయం నిదర్శనమని అన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం అందరికీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థులను సత్కరించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, మురళీధర్ రావు, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య, మేకల శారద, ఆవుల శ్యామణి, రమేష్, కర్క పద్మజ శ్రీనివాస్ రెడ్డి, తాళ్ళ చిన రాజయ్య, నాయకులు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, అచ్చే వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాణి జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ సంబరాలు



**సుల్తానాబాద్ ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** సమయం వృధా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి మీ లక్ష్యాన్ని సాధించి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని శ్రీవాణి కళాశాల కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అన్నారు. సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి లోని శనివారం విజయ ఏసి ఫంక్షన్ హాల్ లో శ్రీవాణి జూనియర్ కళాశాల వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక మాట్లాడుతూ సద్వినియోగం చేసుకొని ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి మీ లక్ష్యాన్ని సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకుని రావాలి అని అన్నారు. అలాగే ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ మేడం మాట్లాడుతూ ఇష్టపడి ఏకాగ్రతతో చదివి గత సంవత్సరం సాధించిన మార్కుల కన్నా ఎక్కువ మార్కులు తీసుకురావాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ బాలసాని శ్రీనివాస్ కళాశాల విద్యార్థులు సాధించిన మార్కులు వారు ఈ విద్యా సంవత్సరం వివిధ క్రీడా పోటీలలో సాధించిన విజయాల ను వార్షిక నివేదిక లో సమర్పించారు.ఈ కార్యక్రమంలో డిగ్రీ, పీజీ ప్రిన్సిపల్ బండారి కమలాకర్, మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. గత సంవత్సరం కళాశాల టాపర్లుగా నిలవడంతో పాటు స్టేట్ ర్యాంక్ లు సాధించిన విద్యార్థులకు వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలు గా నిలిచిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ, రెస్పాండెంట్ రేకులపల్లి శశాంక డైరెక్టర్ సుష్మ మేడం చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంలతో ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లను సన్మానించిన, చిగురు మామిడి కాంగ్రెస్ నాయకులు



- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు..
- మాజీ సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్..

**చిగురుమామిడి: ఫిబ్రవరి 14 (మనం న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిందని,ఇది ప్రజా విజయమని,తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఇచ్చిన విజయమని చిగురుమామిడి మాజీసింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ గుప్తా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,రెడ్డి ఐక్యవేదిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డిలు తెలిపారు. హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లను శాలువాలు కప్పి చిట్టుమల్ల శ్రీనివాస్,పోటు మల్లారెడ్డిలు ఘనంగా సత్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణ అభివృద్ధిని చూసి,సంక్షేమ పథకాల అమలును చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారని గుర్తు చేశారు. రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో ఎన్నడూ లేని విధంగా హుస్నాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని,పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు.హుస్నాబాద్ లో 20వార్డులకు గాను 16వార్డుల్లో కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షంగా ఓట్లు వేసి గెలిపించిన హుస్నాబాద్ పట్టణ ప్రజలకు కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.హుస్నాబాద్ మున్సిపల్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ కు వారు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుందరగిరి మాజీసర్పంచ్ శ్రీమూర్తి రమేష్, మాజీ సర్పంచ్ జిమ్మల భీమ్ రెడ్డి, నాయకులు చెల్పూరి విష్ణుమాచారి,గంధం చంద్రయ్య, దోమ శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద కుటుంబానికి సహాయం

**మంథని,ఫిబ్రవరి14 (మనంన్యూస్):** శ్వాసకోస ఇబ్బందితో మృతి చెందిన నిరుపేద కుటుంబానికి శ్రీ గంగాదేవి నిత్య దీపారాధన కమిటీ సభ్యులు,ముంబై, స్థానిక బిస్తపల్లి గ్రామస్థులు కలిసి ఆర్థిక సాయం అందజేశారు. శనివారం మంథని మండలం బెస్తపల్లి గ్రామానికి చెందిన బోరే చిన్న లింగయ్య కుటుంబాన్ని శ్రీ గంగాదేవి నిత్య దీపారాధన కమిటీ సభ్యులు పరామర్శించారు. అనంతరం లింగయ్య కుటుంబ సభ్యులకు కమిటీ సభ్యులు, బెస్తపల్లి గ్రామస్తులు కలిసి రూ.12,400, 25కిలోల బియ్యం బస్తా,నిత్యవసర సరుకులు అందజేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో బిస్తపల్లి గ్రామ మత్స్యకారులు, కుల పెద్దలు ధర్మాజీ నగేష్,గ్రామ సర్పంచ్ అరిపల్లి పెద్ద శ్రీనివాస్, కూనారపు వెంకటేశం, గుమ్ముల చిన్న రాజేశం,ధర్మాజీ ఓదేష్,మేడివెంకటేష్, కట్టకాడి బోరెరాజేశం, తదితరులు పాల్గొని సహాయం అందించారు.

# సకాలంలో రక్తం అందించి ప్రాణదాతగా నిలిచిన ఉపాధ్యాయుడు

- ప్రశంసించిన రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డా. బాలు.



**కామారెడ్డి, ఫిబ్రవరి 14 ( మనం న్యూస్ )** కామారెడ్డి పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న గడ్డమీది బాపురావుకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరంమైన వేళ, ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ముందుకు వచ్చి 25వసారి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. ఈ విషయాన్ని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు వెల్లడించారు. ఆపదలో ఉన్న సమయంలో శ్రీనివాస్ చూపిన మానవతా స్పందన అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ., నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు 200 మందికి పైగా ఉన్నారని తెలిపారు. ఆ చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం అవుతుందని పేర్కొన్నారు. వారి ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, మరిన్ని రక్తదాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు. ఆపద సమయంలో సకాలంలో రక్తాన్ని అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న శ్రీనివాస్కు డాక్టర్ బాలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రక్తదానం ద్వారా అనేక కుటుంబాలకు కొత్త ఆశ నింపిన ఆయన సేవలు సమాజానికి ప్రేరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

# క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





మంచిర్యాల,ఫిబ్రవరి 14( మనం ప్రతినిధి) క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు అలవాడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కొనసాగుతున్న సి. ఎం. కప్ 2025 పోటీలకు జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి అధికారులు, క్రీడాకారులతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రభుత్వం సి ఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని, క్రీడలతో ప్రశాంతత అలవాటు అవుతుందని తెలిపారు. నాయకత్వ లక్షణాలతో టీం వర్క్ ప్రాధాన్యత తెలుస్తుందని, కలిసి పని చేయడంతో ఏదైనా సాధించవచ్చు తెలిపారు. క్రీడలలో గెలుపు, ఓటములు సామాన్యమని, క్రీడా స్ఫూర్తితో ఆటలలో పాల్గొనాలని తెలిపారు. ఒకసారి ప్రయత్నించి రాలేదు అని నిరుత్సాహపడకుండా సాధించే వరకు ఫలితం ఆశించకుండా ప్రయత్నిస్తూనే ఉండాలని తెలిపారు. సి.ఎం. పోటీలలో భాగంగా గ్రామీణ, మండల, నియోజకవర్గస్థాయి స్థాయి పోటీలను పూర్తి చేసుకుని జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుండి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారని, అథ్లెటిక్స్, బాస్కెట్బాల్, జిమ్నాస్టిక్స్, రూలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్ ఇతర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో సిబ్బంది సహకారం తక్కువగా ఉన్నప్పటికీ జిల్లాలో క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఒలంపిక్స్ లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా సాధించవచ్చు అని, క్రీడాకారులు ఏకాగ్రతతో శిక్షణ పొంది క్రీడలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోసంబంధిత అధికారులు, వివిధ క్రీడ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనాన్ని కాపాడుతామని సాయి విజ్ఞాన్ పాఠశాలలో పుడమితల్లికి ప్రతిజ్ఞ

కామారెడ్డి, ఫిబ్రవరి 14 ( మనం జిల్లా ప్రతినిధి ) కామారెడ్డి జిల్లా పద్మాజీవాడి ఎక్స్ రోడ్డులోని సాయి విజ్ఞాన్ హై స్కూల్ పాఠశాలలో పుడమి తల్లికి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని పెద్ద చెట్టును తల్లి చెట్టుగా గుర్తించి పుడమి తల్లికి ప్రతిజ్ఞ నిర్వహించారు పాఠశాలలో గాని, ఇంటి వద్ద గాని, ప్లాస్టిక్ వాడకుండా ఉండి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేస్తామని మొక్కలను పెంచి పచ్చదనాన్ని వ్యాపసి పర్యావరణ సమతుల్యతను కాపాడి పుడమితల్లి రుణాన్ని తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర సహాయ అధ్యాపకులు డాక్టర్ వి. మధు మొక్కల యొక్క ప్రాముఖ్యత పర్యావరణ సంరక్షణ, వాతావరణంలో జరుగుతున్న మార్పులను గురించి, జీవవైవిధ్యం అవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం గడ్డం రవీందర్ రెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




## మున్సిపల్ ఎన్నికల్లో ప్రలోభాలకే ప్రాధాన్యత



- **సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్...**

జమ్మికుంట, ఫిబ్రవరి 14 (మనం న్యూస్): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి అంశాల కంటే ప్రలోభాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారని సామాజిక కార్యకర్త సిలివేరు శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్య విలువలు పక్కనబెట్టి డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు జరిగాయని ఆయన విమర్శించారు. ఓటర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అభ్యర్థులు ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్లు చైతన్యంతో ఉండి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటును వినియోగించుకోవలసి ఉండగా జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో అందుకు విరుద్ధంగా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉండగా ఓటర్లు అభ్యర్థుల ప్రలోభాలకు లొంగి ఓటు వేయడం ఆందోళన కలిగించే అంశం అని అన్నారు. ప్రలోభాల రాజకీయాలకు చెక్ పెట్టకపోతే భవిష్యత్తులో మంచి పాలన ఆశించడం కష్టమవుతుందని అన్నారు.

# లోతట్టు ప్రాంతాలకు వెళ్లొద్దు



- **ఎస్సై కిరణ్ కుమార్**

హాజీపూర్, ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముల్కల గంగ పరివాహక ప్రాంతంలో జాతర ఏర్పాట్లను ఎస్సై కిరణ్ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాస్నానం కోసం సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తగా స్నానం ఆచరించాలని సూచించారు. స్నానఘట్టాల వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముల్కల ప్రత్యేక అధికారితో కలిసి ఏర్పాట్లను సమీక్షించి, తగిన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని మోహరించనున్నట్లు ఎస్సై తెలిపారు. గోదావరి లోపల నీటి లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. శివరాత్రి వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందంగా, భద్రతా నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలని ఆయన సూచించారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ పదవికై పోటాపోటీ

- **చైర్మన్ రేస్‌లో ముగ్గురు కౌన్సిలర్లు**
- **వైస్ చైర్మన్ రేస్‌లో ముగ్గురు కౌన్సిలర్లు**

గజ్వేల్ ఫిబ్రవరి 14 మనం న్యూస్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ పదవికై పోటాపోటీగా లాబింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తుంది. మునిసిపల్ ఎన్నికలు పూర్తవడంతో బిఆర్ఎస్ పార్టీ తరపున 11 మంది సభ్యులు గెలుపొందడం జరిగింది. ఒకరు ఇండిపెండెంట్గా గెలిచినా కూడా గత పాలకవర్గంలో టిఆర్ఎస్ పార్టీ పైన గెలిచిన అభ్యర్థి కూడా ఉన్నారు దీనితో 12 మంది గా చెప్పుకుంటున్నారు. మునిసిపల్ చైర్మన్ పదవికి పోటాపోటీగా ఎవరికి సంబంధించిన ఎవరి అను నైయులతో వారు వారు పైరవీలు చేస్తున్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం గెలిచిన కౌన్సిలర్లందరూ క్యాంపులో ఉన్నప్పటికీ కూడా అక్కడి నుండే లాబీ నిర్వహిస్తున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది. ముఖ్యంగా బిఆర్ఎస్ పార్టీకి మొదటినుండి పనిచేస్తున్న కళ్యాణ్కర్ నర్సింగరావు పద్మ ముందు రేసులో ఉన్నట్టు, వీరికి మాజీ మంత్రి హరీష్ రావు అండదండలు పుష్కలంగా ఉన్నాయని గుసగుసలాడుతున్నారు. గజ్వేల్ కు సంబంధించి హరీష్ రావు చెప్పినదే ఫైనల్ అవుతుందని అందరూ అనుకుంటున్నారు. కానీ స్థానిక నాయకుల అభిప్రాయాలు కూడా ఎంతో అవసరమని బిఆర్ఎస్ నాయకులు అంటున్నారు. అలాగే గంగిశెట్టి చందన రవి చైర్మన్ దేస్ లో ఉన్నారు వీరికి ముఖ్యంగా స్థానిక నాయకులైన ఒంటేరు ప్రతాపరెడ్డి ఆశీస్సులు పుశలంగా ఉన్నాయని అలాగే ఈయనతో పాటు స్థానిక నాయకులు కూడా సపోర్ట్ చేస్తున్నట్లు వారి అనునయులు అంటున్నారు. గత పాలకవర్గంలో కూడా చందన కౌన్సిలర్ గా గెల్పొందడంతో ఇది రెండోసారి కావడం గమనార్హం.ఇంకొక కౌన్సిలర్ అయిన బొగ్గుల స్వప్న సురేష్ ని కూడా చైర్మన్ లిస్ట్ లో ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది ఎందుకంటే పార్టీకి చాలాకాలంగా పట్టుకొమ్మలా పని చేస్తూ ముందుకు సాగుతున్నారని, ప్రతి ఒక్కరితో ఆత్మీయ అనుబంధాలు ఉన్నట్లు అలాగే బిఆర్ఎస్ పెద్ద స్థాయి నాయకులు కూడా హామీ ఇచ్చారని వార్తలు వస్తున్నాయి. వీరితోపాటు వైస్ చైర్మన్ పదవికి పోటీలో కూడా ముగ్గురు కీలకంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తుంది. అయితే స్థానిక బి ఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మరియు మాజీ ఎంపీపీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డిలు స్వయంగా గోలి మమత సంతోష్ కు ఇస్తామని హామీ ఇవ్వడంతో గట్టిగా ప్రయత్నించి గెలవడం జరిగిందని దానితో తప్పనిసరిగా గోలి మమతా సంతోష్ కు వైస్ చైర్మన్ పదవి వస్తుందని వారి ఆయన అనునయులు గట్టిగా వాదిస్తున్నారు. అలాగే గతంలో కూడా మునిసిపల్ ఎన్నికల్లో గెలిచినటువంటి శ్రీధర్ ఈసారి కూడా గెలవడంతో అతనికి వైస్ చైర్మన్ పదవి తప్పనిసరిగా కావాలని పట్టు పడుతున్నట్టు తెలుస్తుంది. వీరితోపాటు గత మున్సిపల్ లో కౌన్సిలర్ గా పనిచేసిన అత్తిలి శ్రీనివాస్ కూడా ఈసారి ఇండిపెండెంట్గా పోటీ చేసి విజయం సాధించడంతో తిరిగి సొంతగూటికి వెళ్లి వైస్ చైర్మన్ పదవి తనకి వచ్చేలా చూడాలని గజ్వేల్ నాయకులతో మాట్లాడుతున్నట్టు సమాచారం తెలుస్తుంది. ఏది ఏమైనా ఈసారి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా ఉంటుందని ప్రజలు అనుకుంటున్నారు.

## వైభవంగా జరిగిన కనకదుర్గమ్మ జాతర



చిలుకూరు, ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో రెండు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న కనకదుర్గమ్మ జాతర శనివారం ముగిసింది. జాతర సందర్భంగా రెండో రోజు కాంగ్రెస్, సీపీఐ. బీఆర్ఎస్, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో కోలాట ర్యాలీ, ప్రదర్శనలు చేశారు. దేవాలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రభలను ఇంటిని తీసుకెళ్ళారు. జాతరతో బేతవోలు గ్రామం కోలహాలంగా మారింది. ప్రతి ఇంట్లో బంధుమిత్రలతో ఇండ్లు కళకళలాడినాయి.జాతర, శివరాత్రి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల ఎడ్ల పందేలు ముమ్మరంగా జరిగినాయి. ఎడ్ల పందేలల్లో భాగంగా రెండో రోజు నాలుగు పళ్ల ఎండ్ల విభాగం, ఆరు పళ్ల ఎండ్ల విభాగంలో పందేలు జరిగినాయి. ఆదవారం న్యూ కెటగిరి ఎడ్ల పందేలు జరుగుతాయని నిర్వాహాకులు తెలిపారు. జాతీయ స్థాయి నిర్వహించిన ఎండ్ల పందేలలు చూసేందుకు బేతవోలు గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల రైతులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి నాగయ్య, ఉప సర్పంచ్ ఏడు కొండలు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జాతరలో ఏలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఉండేందుకు చిలుకూరు ఎస్ఐ హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో భారీగా బందోబస్తు నిర్వహించారు.

# ప్రతిపక్ష పాత్రలో ప్రజల పక్షాన నిలబడతాం

- **బీజేపీ గెలుపులో మాజీ బీఆర్ఎస్ నేతలే ఎక్కువ**
- **కాంగ్రెస్ - బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం**
- **బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లహరి శంకర్**




కరీంనగర్, ఫిబ్రవరి 14(మనం న్యూస్): నగర పాలక సంస్థ ఎన్నికల తీర్పును గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడతామని , నగర ప్రజల సమస్యలపై రాజీ పడకుండా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శనివారం కరీంనగర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజల తీర్పును శిరసావహిస్తున్నామని, తమను ఆదరించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్లో బీజేపీ సాధించిన 30 సీట్లలో 11 మంది మాజీ బీఆర్ఎస్ అభ్యర్థులే ఉన్నారని, ఇతర పార్టీల నేతలను చేర్చుకుని గెలవడం బీజేపీ నైతిక విజయం కాదని విమర్శించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇతర మున్సిపాలిటీల్లో బీజేపీ పరాజయం పాలవ్వడం కేంద్ర మంత్రి బండి సంజయ్ వైఫల్యమేనని ఎద్దేవా చేశారు. మేయర్ ప్రమాణ స్వీకారానికి ముందే బండి సంజయ్ ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని హరిశంకర్ డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన సంజయ్, అదే పార్టీకి చెందిన వారిని బీజేపీలో ఎలా చేర్చుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి రూ.50 లక్షలు ఖర్చు చేశారని ఆరోపిస్తూ, ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వెల్లడించాలన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ , బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. గతంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ హయాంలో అభ్యర్థులు అక్రమాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాలని ధైర్యంగా చెప్పారని, ఇప్పుడు బండి సంజయ్ తన కార్పొరేటర్ల విషయంలో అలాంటి హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పిన బండి సంజయ్, గెలిచిన తర్వాత మాట మార్చారని విమర్శించారు. డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను లేకుండా చేస్తానని వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, రాజకీయ ప్రతీకారం కాకుండా అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని సూచించారు. మూడేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన టీటీడీ ఆలయ పనులు ఎందుకు ఆగిపోయాయో చెప్పాలన్నారు. కేంద్ర మంత్రిగా నగరానికి ప్రత్యేక నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కాగా, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కార్యకర్తలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, పార్టీ కోసం శ్రమించిన వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ జక్కని ఉమాపతి బిఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చేతి చంద్రశేఖర్, తొంటి రాజేందర్ రాచకొండ నరేష్ అనుమల్ల ఉమా శంకర్ దూలం సంపత్ గౌడ్ నాగుల కిరణ్ కుమార్ గౌడ్ దుర్గం శ్రీకాంత్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఓసిల మహా ధర్నాను విజయవంతం చేయాలి



- **రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్న**
- **ధర్నాపోస్టరును ఆవిష్కరించిన ఓసి నేతలు**

జగిత్యాల ఫిబ్రవరి 14(మనం న్యూస్) ఓసి ల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 23 న డిల్లీలో జంతర్ మంతర్ వద్ద జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఓసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్నలు తెలిపారు. ధర్నా పోస్టరును శనివారం ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య నాయకులు జగిత్యాల లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా కిషన్ రెడ్డి, రాజన్న లు దేశవ్యాప్తంగా ఓసిల స్థితి గతులను అధ్యయనం చేసి జాతీయ స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. మాట్లాడుతూ అగ్రవర్ణాల్లోని ఆర్థికంగావెనుక బడి ఉన్నవారు రిజర్వేషన్లు లేమి కారణంగా అటు సంక్షేమ పథకాలఫలాలు ఇటు రాజకీయ పదవులు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్దంగా ఏర్పడ్డ 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పై రాజకీయ పబ్బం కోసం కొందరు ఆయా కులాల్లోని ప్రజలను మభ్యపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద ఓసి లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంబెడ్కర్ ఆలోచన విధాన ప్రకారం వెనుకబడిన తరగతుల వారికి పదేళ్ళ వరకు రిజర్వేషన్లు అమలుచ్చేయాలని అంటే 70 ఏళ్ళు దాటినా వాటిని అలానే కంటిన్యూ చేయడం వల్ల ఓసిలకు తీరని అన్యాయం జరుగుతున్నదాన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేసేందుకు జాతీయ ఈడబ్ల్యూఎస్ కమిషన్ను ఏర్పాటు చేయాలని కిషన్ రెడ్డి, మహంకాళి రాజన్నలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓసి జేఏసీ జగిత్యాల జిల్లా ఓసి నాయకులు సిరిసిల్ల వేణుగోపాల్, సిరిసిల్ల రాజేందర్ శర్మ, సంత గౌతమ్ రెడ్డి, పుల్లూరి సత్యనారాయణ, మేతే ఉమాపతి శర్మ, కటకం చంద్రమౌళి, అయిల్నేని స్వప్న రావు, దేవరశెట్టి జనార్దన్,బండారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం

- **కీ.శే.చిదురాల శ్రీనివాస్ చూపు సజీవం**
- **నేత్రదానంతో ఇద్దరికి చూపు**



జమ్మికుంట, ఫిబ్రవరి 14 (మనం న్యూస్): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గా కాలనీకి చెందిన చిదురాల శ్రీనివాస్(60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందిన విషయాన్ని శనివారం స్థానికుల ద్వారా తెలుసుకున్న సదాశివ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు నేత్రదానంపై మృతుడి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు.

మృతుడి కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నరహరి ఆధ్వర్యంలో వరంగల్ ఎల్వీపి టెక్నీషియన్ నరేందర్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఎల్ వి పి ఐ బ్యాంక్ పంపించారు. కీర్తిశేషులు చిదురాల శ్రీనివాస్ నేత్ర దానంతో ఇద్దరు అంధులకు చూపును అందించిన సందర్భంగా మృతుడి భార్య చిదురాల భాగ్యలక్ష్మి, కుమారుడు కార్తీక్, కూతురు అల్లుడు సకినాల అనూష విజయ్ కుమార్ లకు. సహకరించిన డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు, చిటికేసి శివానందయ్య , ముత్యాల జగదీశ్వర్ చిరురాల శ్రీనివాస్(భాగ్యలక్ష్మి ఫర్టిలైజర్స్ )లకు సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

# కుల మత లకు అతీతం క్రీడామైదానం

- **పి. చంద్రయ్య,**
- **అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ**



మందమర్రి, ఫిబ్రవరి 14 : (మనం న్యూస్ ) కుల మత వర్గ విభేదాలు లేని ప్రదేశం కేవలం క్రీడా మైదానమే అని పి చంద్రయ్య అడిషనల్ కలెక్టర్ అన్నారు. మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ నందు నేడు రెండవ ఎడిషన్ చీఫ్ మినిస్టర్స్ కప్ - 2025-26 మంచిర్యాల జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలెక్షన్స్ కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రీడాకారులు అన్ని క్రీడల్లో పాల్గొని తమ ఫిట్నెస్ ను సాధించుకోవాలని క్రీడల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారునికి శరీరంతొ పాటు మానసిక ఉల్లాసం కలిగి ఉంటారని ఆయన ఉద్ఘాటించారు. ముఖ్యంగా క్రీడ మైదానంలో వివిధ ప్రాంతాల నుండి వివిధ సంస్క ృతుల నుండి విచ్చేసినటువంటి క్రీడాకారులు ఒకటిగా లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏకతాటిపై సమిష్టిగా పోరాటం చేస్తారని ఆయన అన్నారు. క్రీడల వల్ల పోటీ తత్వమే కాకుండా నాయకత్వ లక్షణాలను ఆత్మ సైర్యాన్ని కలిగిస్తాయని తప్పకుండా క్రీడాకారులందరు కూడా వివిధ క్రీడల్లో పాల్గొనాలని అదేవిధంగా ర్యాంకుల వైపు పరిగెత్తకుండా పిల్లల్ని క్రీడల వైపు కూడా మరలిచాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మందమర్రి సింగరేణి జిఎం ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ క్రీడల పట్ల సింగరేణి సానుకూలంగా స్పందిస్తుందని సింగరేణి క్రీడలే కాకుండా రాష్ట్ర స్పోర్ట్స్ నుండి కానివ్వండి క్రీడా సంఘాలు వివిధ సంస్థలతో ఏర్పాటు చేసేటువంటి క్రీడలను కూడా తమ ప్రోత్సహిస్తున్నామని అవసరమైన వాటికి గ్రౌండ్ సౌకర్యం కల్పిస్తూ ప్రజలను ప్రోత్సహిస్తున్నామని క్రీడలను అభివృద్ధి చేయాలని ఆయన అన్నారు. నేడు గ్రామస్థాయి నుండి మండలం నుంచి కాన్సెన్సీ నుంచి జిల్లా స్థాయికి వచ్చినటువంటి క్రీడాకారులు ఇక్కడ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి విజయబావుట ఎగరవేయాలని, ఓడిపోయిన వారు నిరుసహాని గురి కాకుండా తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి సరైన సంకల్పాన్ని చేసుకుని క్రమశిక్షణతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన ఉద్బవించారు. ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేష్ మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రభుత్వం ఎన్నో జీఓ లను విడుదల చేసినప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని కలెక్టర్ గారు ఈ విషయంలో చొరవ చూపాలని సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ క్రీడలను కూడా ప్రోత్సహిస్తూ తమ గ్రౌండ్లను, కావలసిన సౌకర్యాలను కల్పిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు. తెలియజేస్తూ రేపు జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో మంచిర్యాల జిల్లా క్రీడా పతకాన్ని ఎగరవేయాలని క్రీడాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సి కార్పొరేషన్ ఎడి చాతరాజుల దుర్గాప్రసాద్, స్థానిక సీఐ పార్ళ రమేష్, ఎస్సై గోపతి నరేష్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ రామ్ వేణు, పిడి రోజా వరకుమారి, బాస్కెట్బాల్ కార్యదర్శి సుకుమార ఫ్రాన్సిస్, సీనియర్ క్రీడాకారులు కోచ్ లు, పీఈటీలు పీఈడీలు, మాస్టర్స తో పాటు పలు క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



# గుమ్మడి నరసన్నకు గౌరవ డాక్టరేట్

- డాక్టరేట్ ప్రదానం చేసిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ

కారేపల్లి, ఫిబ్రవరి14(మనం న్యూస్): సింగరేణి మండల పరిధిలోని టేకులగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య చెన్నై, మైలాపూర్ భారతీయ విద్యా భవన్లో శనివారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రజల చేత పలుమార్లు ఎన్నికై ఎలాంటి అవినీతికి తావు లేకుండా,నిబద్ధతతో ప్రజలకు సేవలు అందించినందుకు గాను గుమ్మడి నరసయ్యకు ఈ ఏడాది ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డా.గౌని నర్సింహ గౌడ్, నామినేషన్ కమిటీ మెంబర్ ఎండీ.అరిపుద్దీన్ చేతుల మీదుగా గుమ్మడి నరసయ్య ఈ గౌరవ డాక్టరేట్ను అందుకున్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

# సుజాతనగర్లో మైనార్టీ స్మశానవాటిక దుస్థితి బౌండరీ వాల్ నిర్మించాలని డిమాండ్

సుజాతనగర్ ఫిబ్రవరి 14 (మనం న్యూస్): సుజాతనగర్లోని 22వ డివిజన్ పరిధిలో ఉన్న మైనార్టీ స్మశానవాటిక అపశుభ్రంగా మారిందని స్థానిక మైనార్టీ సోదరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనున్న పొలాల నుంచి వర్షపు నీరు, మురుగు నీరు స్మశానవాటికలోకి చేరడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వ్యాపిస్తోందని, శ్మశానానికి వచ్చే కుటుంబ సభ్యులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారని వాపోయారు. స్మశానవాటిక చుట్టూ పహాని గోడ లేకపోవడంతో కొందరు మందు సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు ఇతర చెత్తను అక్కడే పడేస్తున్నారని చెప్పారు. రాత్రి వేళల్లో అనవసర వ్యక్తులు





ప్రవేశించి ప్రదేశాన్ని మరింత అపవిత్రం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడం, మార్గం సరిగా లేకపోవడం వల్ల అంత్యక్రియల సమయంలో మరింత ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

వెంటనే బౌండరీ వాల్ నిర్మించి, లోపల మట్టిని సమతల పరచడం, నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ ఏర్పాటు చేయడం, చెత్త తొలగించి శుభ్రత చర్యలు చేపట్టాలని మైనార్టీ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

అవసరమైతే గేటు ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరిస్తే తమకు ఇబ్బందులు లేకుండా అంత్యక్రియలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కోడిపందాల స్థావరల రాలపై మెరుపు దాడి





ఎర్రుపాలెం,ఫిబ్రవరి 14 (మనం న్యూస్): ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం గ్రామ శివారు ప్రాంతంలో ది.13.02.2016 రాత్రి 10 గంటల సమయంలో కోడిపందేలు వేస్తున్నట్లు స్థానిక సమాచారం మేరకు ఎర్రుపాలెం ఎస్సై రమేష్ కుమార్ తన సిబ్బందితో కోడిపందేలు స్థావరం పై దాడి చేసి 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో రూ.43,300 నగదు,9 కార్లు,23 మోటార్ సైకిళ్ళు,రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా వైరా ఏసీపీ సారంగపాణి కోడిపందేలు స్థావరాన్ని పరిశీలించి జూదగాళ్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని, తెలంగాణ రాష్ట్రం లో కోడిపందేలు,పేకాట జూద క్రీడలకు నిషేధమని తెలిపారు.ఇక నుండి ప్రతి గ్రామంలో నిఘా ఏర్పాటు చేశామని,ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.అనుమతులు లేకుండా అక్రమ ఇసుక,గ్రావెల్ తొలకాలు నిర్వహించిన ఎటువంటి వారిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. తన అపార అనుభవంతో ధైర్యం చేసి రాత్రి సమయంలో 20 మందిని అదుపులోకి తీసుకున్న ఎస్సై రమేష్ కుమార్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో సిఐ మధు,మధిర,బోనకల్ మండలాల ఎస్సైలు పాల్గొన్నారు

# పుల్వామా అమరవీరులకు నివాళి

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14(మనం న్యూస్): ఖమ్మం పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ త్రివేణిస్కూల్ లో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, యాజమాన్యం పుల్వామా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. 2019 ఫిబ్రవరి 14 జమ్ము కాశ్మీర్లో సైనిక బలగాన్ని తీసుకు వెళుతున్న వాహనాల కాన్వాయ్ పై ఉగ్రవాదులకి సంబంధించిన కారుతో ఆత్మాహుతి దాడి జరిపి 40 మంది అమరవీరుల మృతికి కారణమైన ఈ రోజున భారతదేశంలో బ్లాక్ డే గా పిలుచుకుంటారు. ఈ సందర్భంగా త్రివేణి డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ సైనికుల గొప్పదనాన్ని వివరించారు, అలాగే వారి మృతికి సంతాప సూచికంగా 2 నిమిషాలు మౌనం పాటించారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మన దేశ రక్షణకోసం గడ్డకట్టే చలిలో సైతం, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా,వారి కుటుంబాలను సైతం ఇక్కడే విడిచి పోరాడుతున్న మన సైనికులు నిజమైన హీరోలని, వారి పట్ల మనం ఎప్పుడు గౌరవభావం కలిగి ఉండాలని తెలిపారు. ఈ




కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ,వైస్ ప్రిన్సిపాల్ స్వప్న , ముస్తఫా , క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ మరియు సందీప్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకతీయ డిగ్రీ ఫలితాలలో ప్రియదర్శిని విద్యార్థుల ప్రతిభ



కొత్తగూడెం, ఫిబ్రవరి 14(మనం న్యూస్): కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి యూనివర్సిటీ పరిధిలో విజయకేతనం ఎగరవేశారని కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు.

5వ సెమిస్టర్ బీసీఏ విభాగం నుంచి క్షమా కౌసర్ 8.98, చంద్ర మౌనిక 8.77, సైన్స్ విభాగం నుంచి టీ బిందు శ్రీ 9.04, ఎం నందిని 8.13, మాథ్స్ విభాగం నుంచి బి అపూర్వ 8.62 , బి కామ్ విభాగం నుంచి పవిత్ర 8.4, షబానా 8.2

మూడువ సెమిస్టర్ బీసీఏ విభాగం నుంచి ఎండి సమీనా 8.93 ఎండి ఫరీన్ 8.90, బికాం విభాగం నుండి జి సుభాషిని 8.25 మాథ్స్ విభాగం నుండి కే హర్షిని 8.48 , సైన్స్ విభాగం నుండి ఎస్ శరణ్య 8.2

ఫస్ట్ సెమిస్టర్ లో బీకాం నుండి తమన్నా మాలి 9.0 , భార్గవ్ 8.64 బి సి ఎ నుండి ఈ తేజస్విని 8.25 ఎన్ అంకిత 8.25 , సైన్స్ విభాగం నుండి ఆసరా కౌసైన్ 8.8 , ఎల్ కీర్తన 8.6 , మాథ్స్ విభాగం నుండి సహశ్రిత 8.84 , కే స్పందన 8.84 నజ్రీన్ 8.84 లతో , అత్యధిక జీపీఏ పర్సంటేజ్ తో, మొత్తం మీద 76% ఉత్తీర్ణులు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నయీం పాషా తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ , డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, వైస్ ప్రిన్సిపల్ ఆర్ వివేక్, పి డి రమేష్ , అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ --ఫిబ్రవరి 14 (మనం న్యూస్): రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఆ భోళాశంకరుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. శివయ్య అనుగ్రహంతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ముఖ్యంగా రాష్ట్ర మౌలిక సదుపాయాలు, రోడ్ల నెట్వర్క్ బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

'లయకారుడైన ఆ పరమశివుడు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఈ పవిత్ర లింగోద్భవ కాలం అందరికీ ప్రశాంతతను చేకూర్చాలని మనసారా కోరుకుంటున్నాను' అని మంత్రి పేర్కొన్నారు.మహాశివరాత్రి జరుపుకుంటున్న భక్తులందరికీ, ముఖ్యంగా ఆలయాలకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్ల నిర్వహణపై అధికారులకు తగు సూచనలు చేశారు.

# గుడ్డిలో మెల్ల గెలుపు

- బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలిచిండ్రు? : తలసాని

హైదరాబాద్, మనం ప్రతినిధి : కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులు మీద పుట్టి, దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందన్నారు. సిద్దిపేట బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ దుష్ట కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆయన ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదని దుయ్యబట్టారు. తమకు ప్రజ(లే)లు శాశ్వతం అని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని ఆరోపించారు.

ఇదిలాఉంటే, గత పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్టులు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు. తాను టీడీపీలో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయిందని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్దిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

# అది మాదే... మే(తా)మే దక్కించుకుంటం

- కాంగ్రెస్, బీజేపీని నిరోధించాలే.. ఇందుకోసం మాతో కలిసిరావాలన్న కేటీఆర్
- ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన సీపీఐ నేత కూనంనేని

హైదరాబాద్, మనం ప్రతినిధి : కొత్తగూడెం కార్పొరేషన్లో హంగ్ వచ్చిన నేపథ్యంలో పాలకవర్గం ఏర్పాటులో సీపీఐకి మద్దతిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ప్రతిపాదనపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సానుకూలంగా స్పందించారు. కేటీఆర్ ప్రతిపాదన మేరకు కొత్తగూడెం మేయర్ పదవి కైవసంచేసుకుంటామని ప్రకటించారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, ఇతరులు 6, బీజేపీ 1, సీపీఎం 1 సీట్లు రావడంతో హంగ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సీపీఐ ఒప్పుకుంటే తమ మద్దతుతో మేయర్ పదవి ఇస్తామని కేటీఆర్ ఆఫర్ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీని నిరోధించాల్సిన అవసరం ఉన్నదని.. ఇందుకోసం కలిసిరావాలని కోరారు. ఈ నేపథ్యంలోనే సీపీఐ కొత్తగూడెం కార్పొరేషన్ను తీసుకోదలిస్తే తాము మద్దతిస్తం' అని కేటీఆర్ ప్రకటించారు. దీనిపై కూనంనేనితో కేటీఆర్ ఫోన్ చేసి చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ ప్రతిపాదన మేరకు బీఆర్ఎస్ పార్టీతో కలిసి మేయర్ పదవి దక్కించుకుంటామని సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.

# ముగిసిన సేవాలాల్ విద్యార్థి సేన క్రికెట్ టోర్నమెంట్

## కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రవికుమార్

## సేవాలాల్ సేన టీం ఫస్ట్ మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ సెకండ్

## సేవాలాల్ విద్యార్థి సేన స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వంకుడోత్ అశోక్ నాయక్



కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ మహారా జ్ 287 వ జయంతిని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ బంజారా విద్యార్థులు, సేవాలాల్ సేన క్రికెట్ టోర్నమెంట్ మరియు అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా ప్రారంభించిన కాకతీయ యూనివర్సిటీ ఎస్ డి ఎల్ సిఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ లాల్ కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రవికుమార్ మరియు కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ రమేష్ నాయక్ కంటెస్టెంట్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డా. రాజు నాయక్ మరియు బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డా. వెంకట్ నాయక్ కాకతీయ యూనివర్సిటీ టోర్నమెంట్ నిర్వహించిన సేవాలాల్ సేన క్రికెట్ ఫస్ట్ ప్రైజ్ కొట్టిన సేవలాల్ సేన టీము అభినందించిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రవికుమార్ అలాగే క్రీడలలో ముందుండి ఆరోగ్యంగా మంచి దృఢంగా డిపార్ట్మెంట్ వైపు అన్ని రంగాలలో అభివృద్ధి దిశలో ఉండాలని ఈ ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన అశోక్ గారిని అభినందించారు. దాదాపు 32 విభాగాలను చెందిన విద్యార్థులు, గిరిజన సంఘం నాయకులు, పాల్గొని ఈరోజు విజయవంతం చేయడం జరిగింది ఈ కార్యక్రమ ంలో ఈ కార్యక్రమంలో వెంకట్ నాయక్ రమేష్ నాయక్ మరియు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు కాళోజి, చరణ్, శ్రీను, సచిన్ ,వెంకన్న, పాల్గొన్నారు

# లారీ బోల్తా



చిగురుమామిడి ఫిబ్రవరి 14 ( మనం న్యూస్): చిగురుమామిడి మండలంలోని,ఖ.09ఒఇ1442 లారీ కాటన్ బేల్స్ లోడ్ తో రఘునాథపల్లి(జనగాం) నుండి మహారాష్ట్ర కి వెళుతున్న క్రమంలో సీతారాంపూర్ రోడ్డు మూల మలుపు వద్ద, ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కంట్రోల్ కాకపోవడం తో అదుపుతప్పి పడిపోయింది లారి, డ్రైవర్ క్లీనర్ కు ఎలాంటి, ఉపాయం జరగలేదని, చిగురుమామిడి పోలీసులు తెలిపారు.



# పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్ రెడ్డిని ఆశీర్వదించిన ఉత్తమ్ దంపతులు

నేరేడుచర్ల ఫిబ్రవరి 14(మనం న్యూస్): నేరేడుచర్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల సందీప్ రెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయన సతీమణి కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి తో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం కౌన్సిలర్ లతో పాటు క్యాంపులో ఉన్న సందీప్ రెడ్డి ని మంత్రి ఉత్తమ్ దంపతులు కలిసి సందీప్ రెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ వేడుకలలో నేరేడుచర్ల లో కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్లుగా గెలుపొందిన కొణతం చిన్న వెంకటరెడ్డి, తాళ్ల లావణ్య సురేష్ రెడ్డి,యారవ లక్ష్మీ శ్రీనివాస్, అబ్దుల్ కలీం, నన్నెపంగ శ్రీనివాస్, బొలిశెట్టి లక్ష్మయ్య, ఇంజమూరి శ్రీకాంత్, కొణతం మంజుల తదితరులు ఉన్నారు.

# రాజ్యాధికారం కోసం మాదిగలు సంఘటితం కావాలి

- మాజీ మంత్రి మోత్కులపల్లి నర్సింహులు



కరీంనగర్, ఫిబ్రవరి 14(మనం న్యూస్): రాజ్యాధికారం కోసం మాదిగలు చైతన్యవంతులై సంఘటిత శక్తిగా ఎదగాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ లోని ప్రతిమ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో మాదిగ మేథావుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెపల్లి రాజేందర్ అధ్యక్షతన జరిగిన మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయాల పార్టీలను ఎంఐఎం పార్టీ నేత అసదుద్దీన్ ఒవైసీ శాసిస్తుండా, 12 శాతం జనాభా కలిగిన మాదిగలు వారి తరహాలోనే ప్రభుత్వాలను,రాజకీయ పార్టీలను శాసించాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగలల్లో ఐక్యతను సాధించినప్పుడు ఇది సాకారమవుతుందన్నారు. అందుకే మాదిగల్లో ఐక్యతను పెంపొందించాలనే మహత్తర ఉద్దేశంతోనే మాదిగల మహాశక్తి ఆత్మయ సభలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 50వేల వరకు ఉన్న ఎస్సీలంతా గంపగుత్తగా మనకే ఓట్లేసే స్థితికి రావాలన్నారు. మాదిగ దండోరా ఉద్యమంలో ఎంతో మంది మాదిగలు అమరులయ్యారని వివరించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో వారి పాత్ర మరువలేనిదని కొనియాడారు. అమరుల స్తూపం, కోటి రూపాయలు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారని తెలిపారు. రాష్ట్రంలో అరకోటికి పైగా జనాభా ఉన్న మాదిగలు ఓట్లకే పరిమితమవుతూ అనాథలుగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం లేకపోవడమే మన జాతి వెనుకబాటు తనానికి కారణమని పేర్కొన్నారు

**అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి : డాక్టర్ కవ్వంపల్లి**

టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములపై పూర్తిస్థాయిలో హక్కులు కల్పిస్తూ వారికే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మూతపడ్డ లెదర్ పార్కులను తెరిపించడమే కాకుండా ఇంకా ఏర్పాటు చేయలేని లెదర్ పార్క్ ను ప్రారంభించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల లెదర్ పార్క్ స్థలాలను లీజుకు ఇచ్చారని, వాటి లీజులు రద్దు చేసి పార్కులను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

**మాదిగలు ఏకం కావాలి : మాజీ ఎంపీ పసునూరి**

వరంగల్ మాజీ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ మాదిగలను ఏకతాటి పైకి తీసుకురావడమే కాకుండా మన ఓట్ల మన జాతి బిడ్డలకే ఓట్ల వేయడం ద్వారా రాజ్యాధికారాన్ని పొందాలన్నదే మాదిగ మహాశక్తి ఆత్మీయ సదస్సుల ఉద్దేశమన్నారు. దీనిని ఒక రాజకీయ శక్తిగా రూపకల్పన చేయడం జరిగిందని అనేక సంవత్సరాలుగా విడిపోయిన మాదిగల అందరిని ఒక తాటిపైకి తీసుకువచ్చి ఈ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ కనుకయ్య, ఎం విజయ్ కుమార్, గజ్జెల స్వామి, పల్లెల వీరస్వామి, డాక్టర్ కె.శ్రీనివాస, బొంకూరు శంకర్, ఎం. దేవేందర్, బండా శ్రీనివాస్ తోపాటు మేథావులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, మాదిగల సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధుల చొరవ ,సింగరేణి సహకారం

జైపూర్, ఫిబ్రవరి: 14 (మనం న్యూస్): జైపూర్ గ్రామ అంతర్గత రహదారి ద్వారా ఊరి చివరి వాగు వద్ద దుబ్బ పల్లి వైపు వెళ్లే రహదారి చెడిపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సింగరేణి సహకారంతో మరమ్మత్తులు చేపట్టారు.శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సొంత ఖర్చులతో కొంత మొత్తం వెచ్చించి ఈ పనులకు సహకరించారు.ఈ రహదారి మరమ్మత్తు పనులు పూర్తయిన తర్వాత ఇరు గ్రామాల ప్రజలు సులభంగా ప్రయాణం సాగించే అవకాశం ఉంటుందని గ్రామ సర్పంచ్ కున భాస్కర్ పేర్కొన్నారు. చెడిపోయిన దారిని శివరాత్రి పండుగ వేళ పనులను త్వరితగతిన పూర్తి చేసి, రోడ్డు సౌకర్యం కల్పించినందుకు రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబాల సంపత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రవణ్ పాల్గొన్నారు.



# కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోసం ఆ నలుగురి కొట్లాట

- మెజారిటీ స్థానాలు వచ్చిన కుర్చీ కుమ్ములాటలో జరిగే నాటకీయ పరిణామం ఇదేనా !
- ఒక అరలో నాలుగు కత్తులు ఇముడవన్న చందంగా మారే అవకాశాలు ఉన్నాయేమో ?
- అధిష్టానం ఆదేశాలా ?
- చైర్ పర్సన్ కుర్చీ కోసం పోరాటమేనా ?
- చైర్ పర్సన్ కుర్చీ రేసులో తగ్గేదెవరు నెగ్గేదెవరు ?






కోరుట్ల ఫిబ్రవరి 14 (మనం న్యూస్) :చైర్ పర్సన్ కుర్చీ పవర్ ఏంటో చూసిన ఆ ఇద్దరు కాస్త దగ్గరగా నుండి చూసిన మరో ఇద్దరు ఆ కుర్చీని వదిలే ప్రసక్తే లేదు తగ్గేదేలే అని భీష్మించుకుని కూర్చున్న చైర్ పర్సన్ అభ్యర్థులు కుర్చీ రేసులో ఉన్న మహిళ కౌన్సిలర్ ల పతి దేవుళ్ళు అని పట్టణంలో అనేకమంది మేధావి వర్గం చర్చించుకుంటున్నారు. వారు ఒక ప్రణాళిక ప్రకారమే మహిళా చైర్పర్సన్ రిజర్వేషన్ ఉండటంతో ముందస్తుగా ఎన్నికలలో గెలుపు కోసం ప్రత్యేక వ్యూహాలు రచించి తమదైన శైలిలో ఓటర్లను ఆకర్షించి గెలుపును ఆస్వాదించారు. కానీ వారి గమ్యం కౌన్సిలర్ నుండి చైర్పర్సన్ వరకు అని ముందే నిర్ణయించుకున్నాక ఇప్పుడు ఎలా తగ్గేది అంటూ ఏది ఏమైనా ఎవరిని ఏరకంగా మెప్పించి ఒప్పించైన చైర్పర్సన్ పీఠం దక్కించుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలుస్తోంది.

**చైర్ పర్సన్ పీఠం కోసం భారీ కా..ల వ్యూహరచన**

రాష్ట్రంలో ద్వితీయ శ్రేణి మున్సిపల్ గా పేరొందిన కోరుట్ల మేజర్ మున్సిపల్ చైర్ పర్సన్ గా పీఠం అధిరోహిస్తే కలిగే ఆనందం ఆ ఆర్భాటం ఆ పవర్ చూసినవారు దక్కించుకునేందుకు ఇప్పటికే ఒక చక్కని ప్రణాలిక రూపొందించుకోగా ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని జెండా మోసాము ఇప్పటికైనా మాకు ఒక అవకాశం కావాలని మరో ఇరువురు సంబంధిత అధినేతలను అనేక విధాలుగా బ్రతిమిలాడుతూ చైర్పర్సన్ ఇవ్వండి లేదంటే. ? మా ఆలోచన విధానం మారే అవకాశాలు ఉన్నాయని చెప్పకనే చెబుతున్నారన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరిని సముదాయించేందుకు నేతలకు తలకు మించిన భారంగా మారడంతో సంబంధిత జిల్లా నాయకులతో పాటు రాష్ట్ర నాయకులు కూడా ఒకరిని చైర్పర్సన్ గా ఒప్పించి మరొకరికి ఇంకోరకంగా నామినేటెడ్ పోస్ట్ లేదా వైస్ చైర్మన్ ఇచ్చి మెప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

**చైర్ పర్సన్ కోసం అవసరమైతే దేనికైనా సిద్ధం అంటున్న ఆ ఇద్దరు**

ఎన్నికల ఫలితాలు విడుదలైన నుండి సంబంధిత కౌన్సిలర్ అభ్యర్థులను క్యాంప్ కు తరలించినప్పటికీ వారి మధ్య సయోధ్య కుదిరేలా లేదని వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సంబంధిత కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ తీవ్ర కృషి చేస్తున్నప్పటికీ వారు ససేమిర అంటున్నట్లు వినికిడి. ఈ చైర్ పర్సన్ కుర్చీ మద్దతు కోసం మంతనాలు ? భాజపా తో పాటు మైనార్టీ , టిఆర్ఎస్ కౌన్సిలర్లు కీలకంగా మారే అవకాశం. ? ప్రస్తుతం జరుగుతున్న నాటకీయ పరిణామాల ద్వారా చైర్పర్సన్ కోసం ఇతర పార్టీలతో మంతనాలు పావులు కదుపుతున్న నాయకులకు అవసరమైతే భారతీయ జనతా పార్టీతో పాటు మైనారిటీ కౌన్సిలర్ అభ్యర్థులను కలుపుకొని చైర్పర్సన్ పీఠం దక్కించుకుంటామని కొంతమంది యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది జరిగితే భాజపా, మైనారిటీ, టిఆర్ఎస్ కౌన్సిలర్లు కీలకంగా మారనున్నారని పలువురు విశ్లేషించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చైర్ పర్సన్ కుర్చీ రేసులో ఇలాంటి నాటకీయ పరిణామాలు జరుగుతుండడం కోరుట్ల పట్టణ రాజకీయ వర్గాలలో ప్రజలలో తీవ్ర చర్చనీయాంశమైంది.

# అందుబాటులో సమాచారం.. అన్ని సేవలు

- అన్ని మార్గాలు, రద్దీ ప్రదేశాలు, చోట్ల సైన్ బోర్డ్ లు ఏర్పాటు
- క్యూలైన్లు ఇతర చోట్ల స్టీల్ గ్లాసుల్లో తాగునీటి వసతి
- బేబీ ఫీడింగ్ సెంటర్ అందుబాటులోకి
- దివ్యాంగులు, వృద్ధులకు సహాయంగా వీల్ చైర్లు




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి (మనం ప్రతినిధి): మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్ని చోట్లా పూర్తి సమాచారం ఏర్పాటు చేశారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక ప్రణాళిక ప్రకారం జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇలా ప్రతి చోట జిల్లా అధికారిని ఇన్చార్జిగా నియమించారు. అలాగే జాతర పరిసర ప్రాంతాల్లో 10 హెల్ప్ డెస్క్ లు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, సౌకర్యాలు, పారిశుద్ధ్యం, భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లపై ఇప్పటికే రెండు సార్లు సంబంధిత అధికారులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశాలు నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు.

**బేబీ ఫీడింగ్ రూమ్**

చిన్న పిల్లలతో వచ్చే తల్లులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకంగా బేబీ ఫీడింగ్ రూమ్లను ఏర్పాటు చేశారు. ఈ గదుల్లో పరిశుభ్రమైన వాతావరణం, గోప్యత, కూర్చునే సదుపాయాలు కల్పించారు. తల్లులు ప్రశాంతంగా పిల్లలకు పాలు ఇవ్వడానికి ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

**దివ్యాంగుల, వృద్ధుల కోసం వీల్ చైర్లు**

దివ్యాంగ,వృద్ధ భక్తులు స్వామివారి దర్శనానికి సులభంగా చేరుకునేలా వీల్ చైర్ సౌకర్యం కల్పించారు. ప్రధాన ప్రవేశ ద్వారాలు, హెల్ప్ డెస్క్ వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించారు. అవసరమైన సహాయాన్ని వెంటనే అందించేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు 100 వీల్ చైర్లు అందుబాటులో ఉన్నాయి.

**త్రాగునీటి కోసం స్టీల్ గ్లాసులు**

భక్తులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా స్టీల్ గ్లాసులను వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఏర్పాటు చేశారు. అన్ని త్రాగునీటి కేంద్రాలు, క్యూ లైన్లలో గ్లాసుల శుభ్రతపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

**సూచిక బోర్డులు**

భక్తులు దారి తప్పకుండా దర్శన మార్గాలు, క్యూలైన్లు, మరుగుదొడ్లు, త్రాగునీటి కేంద్రాలు, హెల్ప్ డెస్క్లను సులభంగా గుర్తించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. తెలుగులో బోర్డులు ఏర్పాటు చేసి భక్తులకు మార్గనిర్దేశం చేస్తున్నారు.

**హెల్ప్ డెస్క్**

భక్తుల సమస్యలు, సందేహాలకు వెంటనే స్పందించేందుకు 10 హెల్ప్ డెస్క్లను ఏర్పాటు చేశారు. దర్శన సమయాలు, వసతి, వైద్య సహాయం, దివ్యాంగుల సదుపాయాలు తదితర సమాచారం ఇక్కడ పొందవచ్చని అధికారులు తెలిపారు.

**పారిశుధ్య నిర్వహణ**

పంచాయితీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో దేవస్థానం పరిసరాలు, ప్రధాన రహదారులు, క్యూలైన్లు, మరుగుదొడ్ల వద్ద పారిశుద్ధ్య పనులను విస్తృతంగా చేపట్టారు. చెత్త తొలగింపు, శుభ్రపరిచే పనులు నిరంతరంగా కొనసాగించేలా ప్రత్యేక సిబ్బంది, వాహనాలను నియమించారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**వైద్య శిబిరాలు**

భక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అత్యవసర చికిత్స, ప్రాథమిక వైద్య సేవలు, మందుల పంపిణీ కోసం వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అనారోగ్యం, గాయాలు తదితర సమస్యలు తలెత్తిన వెంటనే చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గుడి ఆవరణలో వైద్య సిబ్బంది, అగ్ని మాపక సిబ్బంది ఉన్నారు.

**కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ**

జాతర ఏర్పాట్లు, సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాల సహాయంతో భక్తుల రాకపోకలు, క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




- అలరించిన నృత్యాలు, ప్రదర్శనలు
- ప్రారంభించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): మహా శివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన శివార్చన స్టేజిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి శనివారం ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శనలు అలరించాయి. అంతకముందు బేబీ ఫీడింగ్ సెంటర్ ను ఇంచార్జి కలెక్టర్ ప్రారంభించారు. క్యూ లైన్లలో ఏర్పాట్లు పరిశీలించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

- రాజన్న ఆలయ విస్తరణ పనులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలన



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి14(మనం ప్రతినిధి): రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్చం అందజేసి, స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ కు స్వస్తితో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీర్వచనం అందించారు.

**ఆలయ విస్తరణ పనుల పరిశీలన**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.

**ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభం**

వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం దాకా భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.

**ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. సమావేశంలో ఆర్అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎస్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కర ఘాట్లను పరిశీలించిన అధికారులు



ములుగు,ఫిబ్రవరి 14మనం ప్రతినిధి : 2027 గోదావరి పుష్కరాల నిర్వహణ కొరకు శనివారం మండల కేంద్రంలోని పుష్కరఘాట్ స్థలాన్ని ఇరిగేషన్ ఈఈ శంకరయ్య, డీఈ రవి కుమార్, ఏఈఈ వలీం మహమ్మద్లతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టున్న నేపథ్యంలో జిల్లాలోని గోదావరి తీరంలోని ముల్లెకట్ట, రామన్నగూడెం, మంగపేట గోదావరి పుష్కర ఘాట్ లను పరిశీలించి మంత్రి సీతక్కకు నివేదించనున్నట్లు తెలిపారు. మంగపేటలో పాత పుష్కర ఘాట్ గోదావరి వరదల సమయంలో కొంత భాగం కొట్టుకుని పోగా దాన్ని పునర్నిర్మాణం చేసే అవకాశాలతో పాటు మండల కేంద్రంలోని మార్కెట్ గోదాముల వద్ద గోదావరి తీరాన్ని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, జీపీవోలు రాము, నర్సయ్యలు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం



త్రిపురాంతకం ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి, బాలత్రిపుర సుందరిదేవీ దేవస్థానంనకు తరలివచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించామని, ఈ మేరకు అధికారులతో మాట్లాడి ఏర్పాట్లపై సమీక్షించిన టీడీపీ ఇంఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఇప్పటికే యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం వరకు నూతన రహదారి నిర్మాణం పూర్తి చేసాము,కొండపైకి వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా నూతన రోడ్డు. పదేళ్లుగా గతుకుల రోడ్డుతో భక్తుల ఇబ్బందులు. ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరిచేలా నూతన రోడ్డు ఏర్పాటు చేయడం జరిగింది అని ,భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ట్యాంకులు. ఏర్పాటు చేయడం జరిగింది అని,వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎరిక్షన్ బాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

# మెడికల్ మరియు ఫార్మా మాఫియాను అరికట్టాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ



(మార్కాపురం ఫిబ్రవరి 14 మనం న్యూస్): మెడికల్ మరియు ఫార్మా మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు మార్కాపురంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. అధికారులు కార్యాలయంలో లేకపోవడంతో నిరసనకారులు తమ డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని కార్యాలయ గోడకు అంటించారు.ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఖాసిం మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ మరియు ఫార్మా మాఫియాపై పోరాటం చేయాలని సీపీఐ పిలుపునిచ్చిందని తెలిపారు.ఫార్మా పరిశ్రమలు మరియు కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజలను నిరంతరం దోపిడీ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. నాసిరకం మందుల విక్రయం, జనరిక్ మందులపై అధిక ధరలు, అద్దె సర్టిఫికెట్లతో ఫార్మసిస్టులు లేకుండా మందుల విక్రయం వంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు మరియు ప్రభుత్వ వైద్య సంస్థల్లో పేరుకుపోయిన అవినీతిని నిర్మూలించాలని, ముఖ్యంగా ప్రైవేటు వైద్య కళాశాలల్లో సుమారు రూ.300 కోట్లకు పైగా స్టైఫండ్ ఎగవేత జరిగిన అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.అలాగే ఫార్మసీ, మెడికల్, డెంటల్, నర్సింగ్ మరియు పారామెడికల్ కౌన్సిళ్లలో ఉన్న అవినీతి పై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మెడికల్ మాఫియాను అరికట్టి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు, అందుబాటులో ధరలలో మందులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి కేశవరావు, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి కృష్ణారావు, శంకర్రావు, బిల్డింగ్ వర్కర్స్ సీనియర్ నాయకులు శ్రీనివాసులు, పి. సుబ్బారెడ్డి, మల్లేశ్వరి, గురమ్మ పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

- రూ 20 వేల నగదు,మోటర్ బైక్,టి.వి అగ్నికి ఆహుతి



పొదిలి ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మార్కాపురంజిల్లా పొదిలి పట్టణంలోని పిచ్చిరెడి తోట గురజాల నరేష్ కు చెందిన పూరి గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధం అయింది. ఒక్కసారిగా మంటలు ఎగసి పడటంతో ఇంట్లోవారు బయటకు వచ్చే ఆర్పే ప్రయత్నం చేసిన మంటలు అదుపులోకి రాలేదు.త్వరలో గుడిసెతోలగించి రేకులు వేసుకుందామని రూ 20 తెచ్చి పెట్టుకున్నారు అవి కుడా ఆగ్నికి ఆహుతి కావడంతో తీవ్రంగా దుఖ్ఖిస్తున్నారు.ఇంట్లో వంట సామానులు, బట్టలు అన్ని మంటల్లో కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలారు.ప్రభుత్వం తక్షణమే ఆదుకొని తగిన నష్టపరిహారం చెల్లించాలని బాధితులు వేడుకొంటున్నారు.

# సంజీవయ్య స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు




మార్కాపురం ఫిబ్రవరి 14 (మనం న్యూస్): మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన 105 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయినప్పటికీ పట్టుదలతో చదివి దేశంలోనే మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి అయ్యారని వివరించారు. బడుగు బలహీన వర్గాల కోసం కోసం ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమన్నారు. అదేవిధంగా కాపులకు ప్రత్యేక రిజర్వేషన్ కృషి చేసిన ఘనత కూడా ఆయన దేనని కొనియాడారు. విద్యార్థులుగా భవిష్యత్తును తీర్చిదిద్దు కావాల్సిన బాధ్యతలపై తల్లిదండ్రులపై కాకుండా మీ పైనే ఉందన్నారు. దళితులు అంటే కొన్నిచోట్ల ఇప్పటికి చిన్నచూపు ఉందన్నారు. ప్రభుత్వం కనిపిస్తున్న కల్పిస్తున్న అవకాశాలు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి జిల్లా మలేరియా అధికారి జు రాహుల్, మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి, పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, సచివాలయ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అస్సాంలో ప్రధాని మోడీ పర్యటన..

## మణిపూర్‌కు టికెట్ బుక్ చేసిన కాంగ్రెస్



**ఢిల్లీ, ఫిబ్రవరి 14:** మణిపూర్‌లోని లిటాన్ సరిఖోంగ్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి తాంగ్ఖుల్ నాగా వర్గానికి చెందిన వారి ఇళ్లకు సాయుధ మిలిటెంట్లు నిప్పు పెట్టడంతో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఈ సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ అస్సాం పర్యటనకు వెళ్తుండడంతో కాంగ్రెస్ పార్టీ మణిపూర్ అంశాన్ని లేవనెత్తింది. ఉద్రిక్తతలు జరుగుతోన్న మణిపూర్‌లో కాకుండా మోదీ అస్సాంలో పర్యటించడాన్ని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా తప్పుబట్టారు. అస్సాం నుంచి మణిపూర్‌కు కేవలం గంటలో వెళ్లొచ్చని.. దయచేసి అక్కడికి వెళ్లాలని కోరారు. ప్రధాని హామీ ఇస్తే ప్రజలు నిర్భయంగా ఉంటారన్నారు. అక్కడికి వెళ్లడానికి తాము ప్రధానికి విమానం టికెట్ కూడా బుక్ చేశామన్నారు.

"2023 నుంచి మణిపూర్ మండుతూనే ఉంది. తాజా దాడులతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. మీరు ఈ రోజు అస్సాంలోనే ఉన్నారు. అక్కడి నుంచి మణిపూర్‌కు మీరు వెళ్లడానికి వీలుగా గువాహటి విమానాశ్రయం నుంచి ఇంఫాల్‌కు విమానం టికెట్ బుక్ చేశాము. మీరు ఆ విమానాన్ని ఎక్కి మణిపూర్‌కు వెళ్లొచ్చు. మీ ఫోన్ నెంబర్ నా దగ్గర లేదు కాబట్టి.. విమాన టికెట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నా. దయచేసి దానిని ఉపయోగించుకోండి'' అని పవర్ ఖేరా ప్రధాని మోడీని ఉద్దేశించి 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా ఈ పోస్టుపై బీజేపీనేతలు విమర్శలు చేస్తున్నారు.

మెయిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనపై వచ్చిన వ్యతిరేకత 2023లో మణిపూర్‌ను హింసాత్మకంగా మార్చిన సంగతి తెలిసిందే. దీనికితోడు రిజర్వేషన్ల అంశం తెరపైకి రావడంతో నిరసనలు ఘర్షణ రూపం దాల్చాయి. ఆ క్రమంలో అమానవీయ ఘటనలు చోటుచేసుకున్నాయి. మణిపూర్‌లో చెలరేగిన అల్లర్లలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా కొన్ని వేల మంది నిరాశ్రయులయ్యారు. ఘర్షణలు చోటుచేసుకున్న రెండేళ్ల తర్వాత గతేడాది పీఎం నరేంద్ర మోడీఆ రాష్ట్రానికి వెళ్లి.. అక్కడ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

# ట్రక్కును ఢీకొట్టిన కారు..




## ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు మృతి

రాయ్‌పూర్, ఫిబ్రవరి 14: ఆగిఉన్న ట్రక్కును కారు ఢీకొట్టడంతో డ్రైవర్‌తోపాటు ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతి చెందిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. ధాంతరి జిల్లా జగదల్‌పూర్ -రాయ్‌పూర్ జాతీయ రహదారిపై ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. మృతులు సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ 201 బెటాలియన్ కోబ్రా జవాన్లు సౌరభ్ తోమర్, ముఖేష్ కుమార్, రాజ్ కుమార్, హీరాలాల్ నగర్‌గా గుర్తించారు. నలుగురు కోబ్రా కమాండో బెటాలియన్ జవాన్‌లు బస్తర్ జిల్లాలోని ప్రధాన కార్యాలయం నుంచి సెలవు మీద స్వగ్రామాలకు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఓ జవాను, డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా.. గాయపడిన మరో ఇద్దరు జవాన్లను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మరో జవాను అభిమన్ రాయ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# త్వరలో ఇరాన్ పాలనలో మార్పులు




అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో యూఎస్ సైన్యం ఇప్పటికే ఇరాన్‌ను చుట్టుముట్టిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై సైనిక చర్య అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఆ దేశంలోని పాలనలో మార్పు జరగడం వల్లే అక్కడి పరిస్థితులు చక్కదిద్దుకుంటాయని.. అదే ఉత్తమమైన విషయమని అభిప్రాయపడ్డారు. త్వరలోనే అదికూడా జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. 47 ఏళ్లుగా చర్చల పేరుతో వారు మాట్లాడుతూనే ఉన్నారని.. ఈలోగా ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ట్రంప్ అన్నారు. ఇకపై ఈ విషయంలో ఆలస్యం చేయదలుచుకోలేదని పేర్కొన్నారు. అయితే నూతన పాలకులను ఇరాన్ ప్రజలే ఎన్నుకుంటారన్నారు.

అణు ఒప్పందంపై ప్రస్తుతం ఇరాన్‌తో జరుగుతోన్న చర్చలు విజయవంతమవుతాయని తాను భావిస్తున్నానని.. కానీ అవి విఫలమైన రోజు ఇరాన్ చరిత్రలో ఓ చెడు రోజుగా నిలిచిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించినట్లు తెలిపారు. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌకలను ఇరాన్ వైపు తరలివస్తున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడంతో.. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని పశ్చిమాసియా దేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

ఆందోళనలు కొనసాగించండి: యువరాజు రెజా పహ్లావి

ఇరాన్‌లో నిరసనలు మరింత తీవ్రం చేయాలని ప్రవాసంలో తలదాచుకున్న ఆ దేశ యువరాజు రెజా పహ్లావి ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనకారులపై ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అణచివేత చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా వీధుల్లోకి వచ్చి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలన్నారు. ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ప్రపంచ దేశాలు అండగా ఉంటాయని పేర్కొన్నారు.

# అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యం




**బర్కిలీ, ఫిబ్రవరి 14:** అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యమయ్యాడు. కర్ణాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య (22) ఫిబ్రవరి 9 నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతడి కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు.

సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతడు చివరిసారిగా క్యాంపస్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న లేక్ అంజా సమీపంలో కన్పించినట్లు తెలుస్తోంది. అక్కడ అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాక్‌ప్యాక్‌లను అధికారులు గుర్తించారు. అతడిని గుర్తించేందుకు స్నేహితులతో కలిసి స్థానిక అధికారులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. అమెరికా అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

# పన్నూ హత్యకు కుట్ర..



## నేరాన్ని అంగీకరించిన భారతీయుడు..!

**న్యూయార్క్, ఫిబ్రవరి 14:** ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నిన కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తాపై అభియోగాలు దాఖలైన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాన్‌హట్టన్‌లోని ఫెడరల్ కోర్టులో నిఖిల్ గుప్తా తన నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు అమెరికా అటార్నీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

దాని ప్రకారం.. గురువారం గుప్తా యూఎస్ మెజిస్ట్రేట్ జడ్జి సారా నెట్‌బర్న్ ముందు హాజరయ్యారు. ఈ క్రమంలో కిరాయి తీసుకొని పన్నూని హత్య చేయడానికి ఒప్పుకోవడం, దానికి ప్లాన్ చేయడంతో పాటు మనీలాండరింగ్ కుట్ర వంటి మూడు నేరారోపణలను అతడు అంగీకరించాడు. వీటన్నింటికీ కలిపి అతడికి 40 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసుపై మే 29న న్యాయస్థానం శిక్ష విధించనుంది. తాజా పరిణామాలపై గుప్తా తరఫు న్యాయవాదులు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని భగ్నం చేశామని గతంలో అగ్రరాజ్యం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కుట్ర కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా ప్రమేయం ఉందంటూ అమెరికా అటార్నీ కార్యాలయం ఆరోపించింది. ఇందుకోసం అతడికి ఓ భారత ప్రభుత్వ అధికారి నుంచి ఆదేశాలు అందాయని ఆరోపణలు చేసింది. ఈ క్రమంలోనే చెక్ రిపబ్లిక్ అధికారులు గుప్తాను అరెస్టు చేశారు. ఆ తర్వాత అమెరికా ఒత్తిడి నేపథ్యంలో అతడిని అగ్రరాజ్యానికి అప్పగించారు. భారత ప్రభుత్వాధికారిపై అమెరికా చేసిన ఆరోపణలను కేంద్రం తీవ్రంగా ఖండించింది. ఈ కేసులో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కాగా, తాజా పరిణామాలపై భారత్ ఇప్పటివరకు స్పందించలేదు.

## ఎప్‌స్టీన్ బంధంపై కలకలం..

# గోల్డ్‌మాన్ సాక్స్ న్యాయవాది రాజీనామా




**న్యూయార్క్, ఫిబ్రవరి 14:** అంతర్జాతీయ లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ ప్రసిద్ధ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు, ఆర్థిక సేవల సంస్థ అయిన గోల్డ్‌మాన్ సాక్స్ న్యాయవాదిగా ఉన్న కేతీ రుయెమ్లర్ తన పదవికి రాజీనామా చేశారు. ఎప్‌స్టీన్‌కు తాను రాసిన ఈమెయిల్లు బయటపడిన నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎప్‌స్టీన్‌కు రుయెమ్లర్‌కు గాఢానుబంధం ఉన్నట్టు వారి మధ్య సాగిన ఈమెయిళ్ల ద్వారా అవగతం అవుతోంది. తన ఈమెయిళ్లలో ఆమె ఎప్‌స్టీన్‌ను పెద్దన్నగా అభివర్ణించారు. పదవిని వదిలేది లేదని, తన ప్రస్తావన ఉన్న ఈమెయిళ్లతో తనకు సంబంధమే లేదని చెబుతూ వచ్చిన రుయెమ్లర్ చివరకు తన నిర్ణయాన్ని మార్చుకోక తప్పలేదు. బరాక్ ఒబామా హయాంలో ఆమె శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుని వ్యక్తిగత న్యాయవాదిగా పనిచేశారు.

తదనంతర కాలంలో ఎప్‌స్టీన్ నుంచి ఆమె అనేక ఖరీదైన బహుమతులు అందుకున్నారు. ఆర్థిక సేవల సంస్థలు ప్రైవేటు వ్యక్తుల నుంచి బహుమతులు పొందరాదన్న నియమాన్ని అమెరికా ఆర్థిక సేవల రంగంలో తప్పనిసరిగా పాటిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే రుయెమ్లర్ తన పదవికి రాజీనామా చేయక తప్పని పరిస్థితి తలెత్తింది. 2008లోనే లైంగిక నేరగాడిగా కోర్టు నిర్ధారించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ఎందరో బాలికలను, మహిళలను లొంగదీసుకొని వారిని పలువురు ప్రపంచ నేతలకు ఎరగా వేసిన సంగతి తెలిసిందే. ఎప్‌స్టీన్ ఫైళ్ల వ్యవహారం పలు దేశాల్లో రాజకీయ సంక్షోభానికి దారి తీసింది.



# ఈశాన్యంలో హైవేపై 'రన్వే'.. ఎందుకంత కీలకం?

**డిబ్రూగఢ్, ఫిబ్రవరి 14:** ఈశాన్య భారతంలోని అస్సాంలో ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ప్రధాని మోడీ విమానం ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. డిబ్రూగఢ్-మోరాన్ జాతీయ రహదారిపై ఉన్న రన్వే.. భారత్-చైనా సరిహద్దుకు దగ్గరగా ఉండటంతో కీలక, వ్యూహాత్మక ప్రదేశంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో పౌర, సైనిక విమానాల రాకపోకలు సాగించేందుకు వీలుగా ఈ రన్‌వేను నిర్మించారు.

అస్సాంలోని చబువా వైమానిక స్థావరానికి సమీపంలో ఉన్న ఈ రన్‌వే.. చైనా సరిహద్దుకు దాదాపు 300 కి.మీ దూరంలో, మయన్మార్‌కు 200 కి.మీ దూరంలోనే ఉంటుంది. అందుకే వ్యూహాత్మకంగా ఎంతో కీలకంగా మారింది. ఈ 4.2 కి.మీ ఈఎల్ఎఫ్ నిర్మాణానికి దాదాపు రూ.100 కోట్లు ఖర్చు చేశారు. సైనిక సంసిద్ధత, విపత్తు సమయాల్లో రెస్క్యూ ఆపరేషన్లతోపాటు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా బలగాలను మోహరించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి రన్‌వేను అందుబాటులోకి తేవడం ఇదే తొలిసారి.

సరిహద్దుకు అవతలివైపు చైనా అనేక నిర్మాణాలు చేపడుతోందని నివేదికలు వస్తున్నాయి. ముఖ్యంగా టిబెట్‌లో సరిహద్దుకు సమీపంలో అనేక కట్టడాలు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకుంటోందని తెలుస్తోంది. దీంతో అవసరమైన సమయాల్లో చైనా తమ సైన్యాన్ని వేగంగా సరిహద్దులకు తరలించే అవకాశం ఉంది. ఈ పరిణామం భారత్‌కు సవాల్ అని చెప్పవచ్చు. అందుకే ఈశాన్య రాష్ట్రాలపై దృష్టిపెట్టిన భారత ప్రభుత్వం.. అక్కడ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది.

వాస్తవాధీన రేఖ వెంట భారత వాయుసేనకు అనేక ఎయిర్‌బేస్‌లు ఉన్నప్పటికీ.. ఇతర బేస్‌లను సిద్ధం చేసుకుంటోంది. యుద్ధం వంటి సందర్భాల్లో వైమానిక స్థావరాలే లక్ష్యంగా దాడులు జరగవచ్చు. లేదంటే అక్కడ రద్దీ వాతావరణం ఏర్పడవచ్చు. అటువంటి క్లిష్ట సందర్భాల్లో ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారులపై ఏర్పాటు చేసే రన్వేలను ఉపయోగించుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తద్వారా సైన్యంతోపాటు యుద్ధ సామగ్రిని వేగంగా తరలించడానికి వీలు కలుగుతుంది. అన్ని రకాల యుద్ధ విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు అనుగుణంగా నిర్మించిన అస్సాం రన్వేపై.. రఫేల్, సుఖోయ్, సీ-17 గ్లోబ్‌మాస్టర్ వంటి యుద్ధ విమానాలు ట్రయల్ రన్స్ నిర్వహించాయి.

# 'సర్' ప్రక్రియ అంటూ పిలిచి.. ప్రియురాలి భర్త హత్య



**కోల్‌కతా, ఫిబ్రవరి 14:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపేరుతో పిలిచి ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన పశ్చిమ బెంగాల్లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల జిల్లాకు చెందిన బూత్ స్థాయి అధికారి రిజ్వాన్ హసన్ మండల్‌కు స్థానిక మహిళతో వివాహేతర సంబంధం ఉంది. వారి బంధానికి మహిళ భర్త నాసిర్ అలీ అడ్డొస్తున్నాడని అతడిని చంపడానికి రిజ్వాన్ పథకం వేశాడు.

ప్రణాళిక ప్రకారం బెంగాల్లో కొనసాగుతోన్న సర్ ప్రక్రియకు సంబంధించిన కొన్ని విషయాలను చర్చించాలనే నెపంతో రిజ్వాన్ సోమవారం సాయంత్రం నాసిర్ అలీని ఓ నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లాడు. అక్కడ తన స్నేహితుడు సాగర్ సహాయంతో అతడిపై దాడి చేసి, హత్య చేశాడు. ఆధారాలు దొరకకుండా ఉండేందుకు అతడి శరీరాన్ని ముక్కలుగా నరికి వేర్వేరు ప్రదేశాల్లోని కాలువల్లో పడేశాడు. సోమవారం సాయంత్రం నుంచి నాసిర్ అలీ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దర్యాప్తులో భాగంగా అతడి కాల్ లిస్ట్ పరిశీలించగా.. చివరగా రిజ్వాన్‌కు ఫోన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నాసిర్ అలీని హత్య చేసినట్లు అంగీకరించడంతో రిజ్వాన్‌ను, అతడి స్నేహితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

# ట్రంప్ 'పొలిటికల్ ప్రేమ'..

## వైట్‌హౌస్ వాలంటైన్స్ డే మెసేజ్






**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** ప్రేమికుల రోజు సందర్భంగా అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్ హౌస్ సోషల్ మీడియాలో కొన్ని డిజిటల్ కార్డ్స్‌ను విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికారం చేపట్టిన నాటి నుంచి ట్రంప్ తీసుకున్న పొలిటికల్ నిర్ణయాలకు సంబంధించిన విషయాలను ఈ విధంగా వినూత్నంగా వాటిలో ప్రస్తావించింది.

మీ కోసమే తయారు చేశాం అనే శీర్షికతో ఉన్న ఈ పోస్టులోని మొదటి కార్డులో వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురో కళ్లకు గంతలు కట్టి, చేతులకు సంకెళ్లు వేసి అమెరికా సేనలు బంధించిన ఫొటోను వైట్ హౌస్ పంచుకుంది. దానిపై 'మీరు నా హృదయాన్ని స్వాధీనం చేసుకున్నారు' అని రాసి ఉంది. మరొక కార్డులో 'ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 4547' అని రాసి ఉన్న అధికారిక పత్రాన్ని ట్రంప్ చూపిస్తున్నట్లు ఉంది. ఈ ఆర్డర్ ద్వారా అమెరికాలోని ట్రాన్స్‌జెండర్లు మహిళల క్రీడల్లో పాల్గొనకుండా ట్రంప్ నిషేధించారు. ఈ కార్డుపై 'యూ ఆర్ మై వాలెంటైన్' అనే సందేశం రాసి ఉంది. మూడో కార్డులో డెమోక్రటిక్ సెనేటర్ క్రిస్ వాన్ హోలెన్, ఎంఎస్-13 ముఠా సభ్యుడు కిల్మార్ అబ్రెగో గార్సియాతో మాట్లాడుతున్న దృశ్యం కనిపిస్తోంది. దానిపైన 'మీపై నాకున్న ప్రేమ అక్రమ వలసదారుల పట్ల డెమోక్రాట్ల ప్రేమలా బలంగా ఉంటుంది' అని వ్యంగ్యంగా రాసి ఉంది. చివరి కార్డులో హృదయం ఆకారంలో గ్రీన్‌లాండ్ మ్యాప్ చిత్రించి ఉంది. దానిపై 'పరిస్థితిని నిర్వచించే సమయం ఇదే' అని వ్యాఖ్యలు కనిపిస్తున్నాయి. వైట్‌హౌస్ షేర్ చేసిన ఈ డిజిటల్ కార్డ్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# స్వయంకృత.. అపరాధం

**గత రెండు ఏళ్లుగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మౌనం**
**వాణిజ్య వ్యాపార కార్మిక వర్గాలపై నజర్ ఏది..?**
**నిశ్శబ్దత... కొంప ముంచిందా పుర ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుందా**
**2 సంవత్సరాల్లో ఎన్నో ఇబ్బందులు దృష్టికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యేగా కొట్లాడని వైనం**
**పట్టు నిలుపుకోలేకపోయినా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి**
**పట్టించుకోని తీరు ....పార్టీ కొంపముంచిందా...!**
**గూడు చెదిరిన గులాబీ బలం పేటలో పట్టు సాధించలేకపోయిన గుంతకండ్ల**
**ఇప్పటికైనా పట్టణ ప్రజల ఇబ్బందులపై గళం ఎత్తటం ఆవశ్యం**






**సూర్యాపేట ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి)** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల ఫలితాలు.. గులాబీ పార్టీ కొంపముంచిందా లేక స్వయంకృత అపరాధమా... అనే చర్చ పట్టణ ప్రజల్లో నెలకొంది... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సునామి సృష్టించి... గులాబీ పార్టీని గద్దె దించిన... సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా క్రియాశీలకంగా ఓట్లు అధికంగా ఉన్న పట్టణ ప్రజలు అక్కున చేర్చుకొని..మూడోసారి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డికి ప్రజలు పట్టం కట్టారు... అయితే రెండు పర్యాయాలు మంత్రిగా వ్యవహరించి వందల కోట్లతో ... అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి సూర్యాపేట పట్టణ రూపు రేఖలే మార్చిన జగదీశ్వర్ రెడ్డి.. నేడు పేట మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలపై పుర ప్రముఖుల్లో ఇంతటి ఘోర పరాజయం చవి చూడడం సర్వత్ర ఆశ్చర్యానికి గురిచేస్తుంది.. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై పేట ప్రజలు బహిరంగ చర్చించుకుంటున్న కొన్ని అంశాల మనం దినపత్రిక.. మీ ముందు ఉంచుతుంది.. మూడోసారి ప్రతిపక్ష శాసన సభ్యుడిగా జగదీశ్వర్ రెడ్డిని గెలిపించిన ప్రజలు ముఖ్యంగా పట్టణ ప్రజలు గత రెండేళ్లలో ఎదుర్కొంటున్న సమస్యలపై జగదీశ్వర్ రెడ్డి మౌనంగా ఉండడం.. వాణిజ వ్యాపార కార్మిక. తో పాటు వార్డు ప్రజలు కొంతమంది సెగ్మెంట్ కు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న గుంటకండ్ల దృష్టికి తీసుకొచ్చిన.. వేచి చూసే ధోరణి పుర ఎన్నికల్లో ఓటమికి ప్రధాన కారణంగా తెలుస్తుంది... ఇలా గుంతకండ్ల రెండేళ్ల నిశ్శబ్దం పుర ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది.. కొట్లాడాల్సిన శాసనసభ్యుడే మౌనం వహించడం పట్టణ ప్రజలు తట్టుకోలేక పోయారు అనే చర్చ నడుస్తోంది. దీని ఫలితమే మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ పార్టీకి దిమ్మతిరిగే తీర్పు ఇచ్చారు అనడంలో సందేహం లేదు.. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను పెద్ద ఎత్తున ఎండగట్టి.. ముఖ్యమంత్రినీ సైతం వ్యతిరేక విధానాలపై కడిగిపారేసి రాష్ట్ర ప్రజల దృష్టిని ఆకర్షించిన.. జగదీశ్వర్ రెడ్డి పట్టణ ప్రజల ఇబ్బందులను అంతగా పట్టించుకోలేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అంతే తప్ప ఏ ఒక్క కులాని వర్గానికి పదవులు ఇస్తే నే ఇలాంటి మూల్యం చెల్లించింది అని అర్థం లేని వాదనలు తెర మీదికి రావడం. ప్రాధాన్యత లేని అంశాలు.. ఇవన్నీ జరిగిన సంఘటనలు బేరీజు వేసుకున్నాకే.. పేట నియోజకవర్గ మెజార్టీ జనం ఆదరించారు ఒకటి మాత్రం నిజం.. మెజార్టీ ఏదైనా అయి ఉండొచ్చు..మూడు పర్యాయాలు. జగదీశ్వర్ రెడ్డికి సూర్యాపేట సెగ్మెంట్ ప్రజలు విజయం కట్టబెట్టడం.. అంత ఆషామాసి వ్యవహారం కాదు.. ఇప్పటికైనా వచ్చే మూడు సంవత్సరాలు సెగ్మెంట్ తోపాటు. పుర పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎదుర్కోబోతున్న సమస్యలపై శాసనసభ్యుడిగా గళం విప్పితే ఈ ప్రాంత ప్రజలు మళ్లీ గులాబీ పార్టీకి తిరుగులేదు అనడంలో ఎలాంటి సందేహం లేదు..

**పట్టు నిలుపుకోలేక పోయిన జగదీష్ రెడ్డి**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు జగదీశ్వర్ రెడ్డి పట్టుకొని పోలేక పోయారు.. ముఖ్యంగా సూర్యాపేట మున్సిపాలిటీ ఫలితాలు ఒక్కింత ఆశ్చర్యానికి గురిచేసింది ఎంతో అభివృద్ధి చేసిన 48 వార్డుల్లో పోటీ చేస్తే కేవలం 11 వార్డులే గులాబీ పార్టీ విజయం సాధించింది దీనికి ఎమ్మెల్యే మౌనమా.. లేక టికెట్ల కేటాయింపు అభ్యర్థుల ఎంపిక పట్ల పొరపాటు తెలియదు గాని మొత్తానికి పుర ఫలితాల్లో గులాబీ పార్టీ చతికిల పడింది పట్టణ ప్రజల ఇబ్బందులపై గళం ఎత్తటం ఆవశ్యం ఇప్పటికైనా పట్టణ ప్రజల ఇబ్బందులపై స్థానిక శాసనసభ్యులుగా గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి గళం విప్పడం ఆవశ్యం. ఈ నేపథ్యంలో పార్టీ పరంగా గత బి ఆర్ఎస్ పాలనలో పదవులు అనుభవించిన నాయకులు ఇప్పుడు మాత్రం ప్రతిపక్ష పాత్రలో ఉండి ప్రజా సమస్యలపై స్పందించటం లేదన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఏదో కంటి చూపు చర్యగా ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అడపా తడప ప్రెస్ మీట్ పెట్టి ఖండిస్తున్నారు. కానీ గులాబీ పార్టీ క్రింది స్థాయి క్యాడర్ వద్దకు ఎన్నో సమస్యలపై బాధ్యులు నేరుగా తమ సమస్య దిగువ శ్రేణి నాయకుల దృష్టికి బాధితులు తీసుకొచ్చిన.. మాకెందుకు వచ్చిందిలే ఈ తంటా అంటూ మౌనం వహిస్తే.. రాబోయే రోజుల్లో పార్టీ కొంప మునిగే పరిస్థితి ఏర్పడుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అవినీతి రహిత పురపాలన అందించండి



- **సూర్యాపేట పట్టణాభివృద్ధికి అవిరళ కృషి చేస్తా**
- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**సూర్యాపేట ఫిబ్రవరి 14 (మనం ప్రతినిధి)** పేట పురపాలక సంఘాన్నిఅవినీతి రహిత పురపాలక సంఘంగా తీర్చి దిద్దాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవుపలికారు.గతంలో సూర్యాపేట పురపాలక సంఘంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా నూతన పాలక మండలి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలనిఉద్బోధించారు.నూతనంగా ఎన్నికయిన సూర్యాపేట పురపాలక సంఘం ప్రతినిధులు శనివారం సాయంత్రం హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 48 వార్డులకు 31 స్థానాలలో విజయం సాధించిన కౌన్సిలర్లను మంత్రి అభినందించారు.ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి మీద ఉన్న సూర్యాపేట పట్టణం ఇప్పటివరకు ఊహించిన మేరకు అభివృద్ధి సాధించ లేక పోయిందన్నారు.పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మీద చూపిన ఆదరణ అనన్య సామాన్యమైనదని,ప్రజలు మనమీద అపారమైన నమ్మకంతో గురుతర బాధ్యత మోపారని వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు పని చేయాలని ఉపదేశించారు.జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా సూర్యాపేట పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎప్పటికప్పుడు పట్టణాభివృద్ధిపై సమీక్షించుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించుకుండమన్నారు. అందుకు సరిపడా నిధులు తెచ్చి సూర్యాపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,ఏ.ఐ.సి.సి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి,సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు లతో పాటు నూతనంగా ఎన్నికయిన కౌన్సిలర్లు కలిశారు.

## నాగారం శివాలయంలో వైభవంగా పూర్ణాహుతి హోమం



- **రేపు శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి**

**నాగారం,ఫిబ్రవరి14.మనం న్యూస్.** నాగారం మండల కేంద్రంలోని శివాలయంలో శనివారం పూర్ణాహుతి హోమం వైభవంగా నిర్వహించారు. భక్తుల నడుమ వేద పండితుల వేదమంత్రాలతో జరిగిన ఈ హోమంలో గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ ప్రాంగణం భక్తి పారవశంతో నిండిపోయింది. పూర్ణాహుతి కార్యక్రమంలో ఉపసర్పంచ్ వంగూరి అంజయ్య ఉమా దంపతులు,విగ్రహ దాతలు కజ్జం శివాజీ-జ్యోతి దంపతులు ప్రత్యేకంగా పాల్గొన్నారు.శివాలయ కమిటీ అధ్యక్షుడు బొబ్బలి లింగమల్లు మమత దంపతులు, అలాగే కమిటీ సభ్యులు బద్దం వంశీకృష్ణా రెడ్డి కీర్తి దంపతులు,కన్నెబోయిన అంజయ్య ఐలమ్మ, మోదుగు జగదీష్ రెడ్డి మాధవి, కొంరెడ్డి వెంకట్ రెడ్డి సంధ్య,చిప్పలపల్లి అంజయ్య ఎల్లమ్మ దంపతులు తదితరులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ,రేపు జరగనున్న శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## యూత్‌కు మల్టీమీడియాపై అవగావాహన కార్యక్రమం

**కోదాడ, ఫిబ్రవరి 14(మనం న్యూస్):** ఫిబ్రవరి 14 వాలెంటెన్స్ డే పురస్కరించుకొని యవనస్తులకు డ్రగ్స్ అండ్ మల్టీ మీడియా మీద అవగాహన సదస్సు కోదాడ పట్టణ క్రిస్టియన్ మైనార్టీ నాయకులు పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. యేసయ్య మాట్లాడుతూ ఈనాటి దినాల్లో ఇలాంటి అవగాహన సదస్సులు ఉండటం వల్ల యవనస్తులు చెడు ఆలోచనలు మాని, తమ దృష్టి చదువు మీదను భవిష్యత్తు మీదను మళ్లించుకుంటారని తల్లిదండ్రులకు లోబడి తమ కాళ్ళ మీద తాము నిలబడే శక్తిని కలిగి ఉంటారని యేసయ్య అన్నారు.
ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ మాజీ కోఆప్షన్ సభ్యురాలు వంటిపాక జానకి ఏసయ్య, ముఖ్యవక్తగా రెవ ఎనోశారాజ్ పాల్గొని యువతపై మల్టీమీడియా ప్రభావము చాలా ఉందని అన్నారు. పాస్టర్ అబ్రహం, పాస్టర్ రాజేష్, పాస్టర్ ప్రభుదాస్, సామ్యూల్, డానియల్ యవనస్తులు పాల్గొన్నారు.

## వామ్మో ప్రభుత్వ దవాఖాన




**సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 14, మనం న్యూస్:** ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రి (ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి) గా మార్చి నిరుపేదలకు ఉచితంగా కార్పోరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలని తలంపుతో గత ప్రభుత్వ హయాంలో రూ. కోట్లు వెచ్చించి అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం సైతం నిరుపేదలకు నాణ్యమైన చికిత్స అందించేందుకు ఖర్చు చేస్తుంది. రోజు వందలాది మందికి వైద్యం చేయించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. అయితే ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో విధులు నిర్వహించే సిబ్బంది ఇక్కడికి వచ్చే రోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వామ్మో ఆ ఆసుపత్రి కా అని భయకంపితులను చేస్తున్నారనట్లు సమాచారం. ఈ నెల 10 తేదిన ఓ మహిళా పట్టణంలోని తెలిసిన బంధువుల ఫంక్షన్ కు హాజరై భోజనం చేస్తున్న క్రమంలో ఆహారంలోని పదార్థం నోటిలో గుచ్చుకొని రక్తం కారడంతో హుటాహుటిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లింది. అక్కడి వైద్య సిబ్బంది సూచన మేరకు ఎక్స్ రే తీయించింది. ఎక్స్ రే పరీక్షించిన వైద్య సిబ్బంది భయానికి గురి చేస్తూ ప్రమాదకరంగా ఎదో ఆహార పదార్థం ఇంకా నోట్లోనే ఉందని వెంటనే అడ్మిన్ కావాలని భయాందోళనకు గురి చేయడంతో, కంగారు పడిన సదరు మహిళ తన వారికి తెలియజేసి పట్టణంలోని మరో ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించారు. అక్కడి వైద్యులు ఆమెను పరీక్షించి, ఎక్స్ రే తీయించి ఏమి లేదని, భోజనం చేస్తున్న సమయంలో ఎదో పదార్థం గుచ్చుకొని రక్తం కారి ఉండవచ్చునని చెప్పడంతో ఊపిరి పీల్చుకుంది. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ఇలా వైద్య సేవల కొరకు వచ్చే వారిని ఎందుకు భయాందోళనకు గురి చేస్తున్నారని, ఇలాంటి వారిపై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రామ్మూర్తి యాదవ్ కు మిత్రుల ఘన సన్మానం

- **శాలువాను కప్పి సత్కరించిన తోటి మిత్రులు**



**పెన్ పహాడ్ ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, ఉర్లుకొండ దేవాలయం కమిటీ చైర్మన్,డాక్టర్ వూర రామ్మూర్తి యాదవు కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్ గా గెలుపొందిన సందర్భంగా ఆయన మిత్రులైన మండలంలోని లింగాల గ్రామానికి చెందిన సీనియర్ ఆర్.ఎం.పి డాక్టర్ చల్లా అంజయ్య,ధూపహాడ్ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త తమ్మ జగన్మోహన్ రాజులు శనివారం ఆయనను స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాను కప్పి స్వీట్లను అందించి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృదుస్వభావి,స్నేహశీలి, రోగుల పట్ల అంకితభావంతో వైద్యాన్ని అందిస్తున్న రామ్మూర్తి యాదవ్ రాజకీయంగా ఇంకా అనేకమైన పదవులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు తనను ఇంతగా అభిమానించి సన్మానించిన మిత్రులకు రామ్మూర్తి యాదవ్ ధన్యవాదాలు తెలిపారు... ఇప్పటివరకు రోగులకు సేవలు అందిస్తున్న తనను రాజకీయంగా దీవించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ తనను గెలిపించిన వార్డులో ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని అన్నారు..

## సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్మన్‌లను ప్రకటించిన జగ్గారెడ్డి

- **ఈనెల 16న ప్రమాణ స్వీకారం.**









**సంగారెడ్డి ఫిబ్రవరి 14 మనం న్యూస్ ప్రతినిధి.;** నూతనంగా సంగారెడ్డి సదాశివపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలవడంతో సంగారెడ్డి సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్ లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి శనివారం నాడు ప్రకటించారు. సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 38 వార్డుల 22 మంది కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు గెలుపొందడంతో మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక లాంఛనప్రాయంగా అయింది. సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గా కూన వనిత సంతోష్ వైస్ చైర్మన్ గా మహమ్మద్ షఫీ ఎన్నిక కానున్నట్టు తెలిపారు సదాశివపేట మున్సిపాలిటీలో 26 వార్డుల్లో గాను 16 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడంతో మున్సిపల్ చైర్ పర్సన్ గా మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ ప్రకటించారు వైస్ చైర్మన్ గా రేణుక చిరు లను ఎంపిక చేశారు ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీలలో అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి మెప్పించైనా నిధులు తీసుకువచ్చి ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

## తాటి చెట్టుపై నుండి జారిపడి గీత కార్మికుడి మృతి



**హుజురాబాద్, ఫిబ్రవరి 14 (మనం న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని వీణవంక మండలం కొండపాక గ్రామానికి చెందిన గట్టు ఐలయ్య గౌడ్ వృత్తిలో భాగంగా శనివారం తాటి చెట్టు ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి జారి పడటంతో మృతి చెందినట్లు తోటి గీత కార్మికులు తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కు అయిన గట్టు ఐలయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న వీణవంక ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

## బ్లాక్ డే,పుల్వామా దాడి

- **అమరులైన వీర జవాన్లకు క్యాండిల్ ర్యాలీ**




**కోరుట్ల ఫిబ్రవరి 14** కోరుట్ల భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో రుద్ర శ్రీనివాస్, మాడవేణి నరేష్ మాట్లాడుతూ పుల్వామా దాడిలో అమరవీరులైన జవాన్లకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. కోరుట్ల పట్టణ శాఖ ఈ రోజున అదేవిధంగా ఇలాంటి దాడులు చేస్తే భారతదేశం ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది అని తెలిపారు. ఇలాంటి దాడిన ఖండిస్తూ ఉగ్రవాదాన్ని భారతీయ జనతా పార్టీ హెచ్చరిస్తోంది ఉగ్రవాదాన్ని, . కేంద్ర ప్రభుత్వం ఇలాంటి దాడులకు భయపడదు అని చెప్పి తెలిపారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. చాలా బాధాకరమైన విషయం పులువమ దాడిలో అమరవీరుని జవాన్లకు నివాళులర్పిస్తూ. కోరుట్ల పట్టణ శాఖ భారతీయ జనతా పార్టీ హెచ్చరిస్తున్నారు ఇలాంటి పనులు మానుకోవాలని బిజెపి నాయకులు హెచ్చరిస్తున్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పారు. ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలని కోరుట్ల పట్టణ శాఖ బిజెపి నాయకులు ఖండిస్తున్నారు. జై భారత్ జై భారత్ అంటూ బిజెపి నాయకులు నినాదాలు చేశారు. అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తూ జోహార్ అమరవీరులు జోహార్ జోహార్ మీ త్యాగం వృధా కాదు వృధా కాదు. జై జవాన్ జై కిసాన్.

## ఓటు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు

- **41 డివిజన్ బిజెపి అభ్యర్థి యానాల కరుణాకర్ రెడ్డి**



**నల్లగొండ- ఫిబ్రవరి 14( మనం న్యూస్)** నల్గొండ జిల్లా కేంద్రంలోని 41 డివిజన్ మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేసే అవకాశం ఇచ్చిన పార్టీ నాయకులకు , ఓటు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు 41 డివిజన్ బిజెపి అభ్యర్థి యానాల కరుణాకర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ సమయంలో విశేష ప్రజాదరణ అందించిన ప్రజలకు ,ముఖ్యంగా నన్ను నమ్మి ఓటు వేసిన ప్రతి ఓటరికీ,,నిరంతరం నా వెంటే నిలిచిన పార్టీ కార్యకర్తలకు ,ధైర్యంగా స్వార్థంగా పనిచేసిన బూత్ స్థాయి నాయకులకు ,నన్ను ప్రోత్సహించిన పెద్దలు ,యువత ,మహిళా శక్తికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రజలు ఇచ్చిన తీర్పుని గౌరవిస్తూ భవిష్యత్తులో డివిజన్ అభివృద్ధి కొరకు, పారదర్శక పాలన, అవినీతి రహిత పాలన ,సమన్యాయం వంటి అంశాలపై గొంతుగా నిలబడ తాననీ, పాలకపక్షం ప్రజల ఆకాంక్షలకు స్పందించేలా, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నిస్తూనే ఉంటామని ,ఈ ఫలితాల వల్ల నా ధైర్యం ఏమి తగ్గలేదని ,పార్టీ పటిష్టత కోసం కార్యకర్తల మనోబలాన్ని పెంచడానికి ,రాబోయే ఎన్నికల్లో బిజెపి పార్టీ మరింత బలంగా నిలవడానికి నేను నిరంతరం ప్రజల్లోనే ఉంటానని ,ప్రజల సేవే నా లక్ష్యంగా ,ప్రజల నమ్మకమే నా బలం, మేము ప్రకటించిన మేనిఫెస్టోను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తూ డివిజన్ అభివృద్ధికి నిరంతరం తోడ్పడతామని తెలుపుతూ తదుపరి ప్రణాళికలను ముఖ్య కార్యకర్తల సమావేశానంతరం ప్రకటిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి సురేందర్ రెడ్డి ,కంచర్ల విద్యాసాగర్ రెడ్డి ,చిట్టిపోలు సత్యనారాయణ , పగిడోజు హైమావతి, నల్ల వంశి గౌడ్ తొగిటి అనుదీప్ తోగిటి శ్రీనివాసచారి నాగులపాటి మహేందర్ పల్లె శ్రీనివాస్ గౌడ్, యానాల కీర్తన తదితరులు పాల్గొన్నారు.

# యాప్‌లో యూరియా స్టాక్ ప్రత్యక్షం... క్షణాల వ్యవధిలోనే మాయం



- మా ప్రమేయం లేదంటున్న సి ఈ ఒ, సిబ్బంది
- యాప్ హాక్ అయిందంటు....ప్రచారం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు
- రైతుల పాలిట శాపంగా మారిన ఆన్లైన్ వ్యవహారం
- యూరియా కోసం తల్లడిల్లుతున్న అన్నదాతలు

పెన్ పహాడ్ ఫిబ్రవరి 14 (మనం న్యూస్): యాప్ లో స్టాక్ ఉన్నట్లు ప్రత్యక్షమైన యూరియా క్షణాల్లోనే మాయమైన ఘటన మండల పరిధిలోని నారాయణ గూడెం సబ్ సెంటర్ అనంతారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది...వరి పంట సాగు రైతులకు ప్రస్తుతం వరి పంట కీలక దశలో ఉంది.. ఈ సమయంలో యూరియా పంట పొలాలకు పిచికారి చేయకపోతే,పంటలో పిలుకలు తగ్గి ఎదుగుదల మందగించి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందినీ దీంతో తాము భారీ ఎత్తున పంట నష్టపోతామని మండలంలోని రైతులు గగ్గోలు పెడుతున్నారు అసలు స్టాక్ లేకుండా యాప్ లో యూరియా బుక్ చేసుకోమనడం ఏమిటని, యాప్ ఎప్పుడు ఓపెన్ చేసినా జీరో స్టాక్ చూపిస్తుందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు మండలంలోని 32 వేల ఎకరాల వరి పంట నాలుగువేల ఎకరాల పత్తి పంట సేద్యం చేసి యూరియా బస్తాల కోసం ఎదురుచూస్తున్నారు ఇప్పటివరకు మండలానికి 2500 టన్నుల యూరియా అవసరము ఉండగా 1600 టన్నులు మాత్రమే సరఫరా చేశారు దీంతో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లి పంట చూసి పుట్టెడు దుఃఖంలో తల్లడిల్లుతున్నారు యూరియా లేనందున ఏం చేయాలో అర్థం కాక అధిక ధరలకు 14 : 35 : 14, 20:20: 0:13,పంట ఎదుగుదలకు మందులను కొనుగోలు చేస్తూ పంటను దక్కించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు చెబుతున్నారు ఇదిలా ఉండగా సూర్యాపేట జిల్లాలోని పెన్ పహాడ్ మండల పరిధిలోని అనంతారం పీ ఏ సి ఎస్ కార్యాలయానికి శుక్రవారం యూరియా 444 బస్తాల స్టాక్ వచ్చింది విషయం తెలుసుకున్న రైతులు సి ఈ వో ఆలకుంట్ల సైదులు ను సంప్రదించగా శనివారం ఆదివారం సెలవు దినాలు ఉన్నందున సోమవారం ఆన్లైన్లో యూరియా స్టాక్ పెట్టడం జరుగుతుందని ఆ తర్వాతే రైతులు బక్ చేసుకోవాలని తెలిపినట్లు రైతులు చెపుతున్నారు ఇదిలా ఉండగా శనివారం ఉదయం 7గంటలకు ఆన్లైన్లో పి ఏ సి ఎస్ నారాయణగూడ (అనంతారం)లో స్టాక్ చూపించడంతో ఇతర గ్రామాల రైతులు ఆన్లైన్ యాప్ ద్వారా బుక్ చేసుకున్నారు దీంతో స్టాక్ క్షణాల వ్యవధిలోనే యూరియా ఖాళీ అయింది ఈ విషయం బయటికి పొక్కడంతో రైతులంతా కార్యాలయం వద్దకు చేరుకుని సిబ్బందిని కార్యాలయాన్ని ముట్టడించి కార్యాలయం తాళం తీయకుండా అడ్డుకున్నారు సెలవు రోజు కార్యాలయం ఎలా ఓపెన్ చేసి యూరియా బస్తాలు పంచుతారని నిలదీశారు దీంతో మండల వ్యవసాయ అధికారి, పోలీసులు అక్కడికి చేరుకున్నారు రైతులు పెద్ద ఎత్తున యూరియా స్టాక్ ఆన్లైన్లోకి ఎవరు పెట్టారు..? ఎలా వచ్చిందని.. సీఈవో సైదులు సోమవారం ఆన్లైన్లో పెడతామని రైతులకు సమాచారం ఇచ్చారు ఈలోపే ఆన్లైన్ లో స్టాక్ ఎలా ప్రత్యక్షమైందని దీనికి కారకులు ఎవరని..? సిబ్బంది సమాధానం చెప్పాలని పెద్ద ఎత్తున ఆందోళన చేశారు ఆన్లైన్లో బుక్ చేసుకున్న యూరియా బస్తాలు బయటికి వెళ్లనీయమని విషయం తేలే వరకు తాళాలు తీయొద్దని రైతులు ఆందోళనకు దిగారు దీంతో వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, సి ఓ సైదులును చరవాణి ద్వారా సంప్రదించి వివరణ కోరారని సీఈఓ సైదులు ఆన్లైన్లో ఎవరు పెట్టారో తనకు తెలియదని ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు రైతులు ఈ విషయం తేలేంతవరకు స్టాక్ ను పంచవద్దని సిబ్బందికి అడ్డు పడ్డారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు యూరియా బుక్ చేసుకున్న రైతులు మాకు యూరియా ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు దీంతో మెజార్టీ రైతులు అనధికారికంగా యాప్ లోకి స్టాక్ ఎలా వచ్చిందో తేలే వరకు ఇవ్వడం కుదరదని సోమవారం మరో లోడ్ యూరియా స్టాక్ వస్తుందని ఇప్పుడు ఉన్నది రేపు వచ్చే స్టాక్ మొత్తం కూడా ఒకేసారి యాప్ లో అధికారికంగా పెట్టడం జరుగుతుందని ఆరోజు బుక్ చేసుకోవాలని రైతులకు సర్ది చెప్పారు ఏది ఏమైనా యూరియా అప్లోడ్ చేయడానికి ఉపయోగించే పాస్వర్డ్ సీఈఓ,సిబ్బందికి మాత్రమే తెలుస్తుందని వారు తప్ప ఇంకెవరు స్టాక్ అప్లోడ్ చేయడానికి వీలు లేదు కాబట్టి అనధికారికంగా అప్లోడ్ చేసిన వ్యక్తిని గుర్తించి అతనిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## మంచి మనిషిని కోల్పోయాం: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



నడిగూడెం, ఫిబ్రవరి 14(మనం న్యూస్): మంచి వ్యక్తిత్వం మనసున్న మనిషిని కోల్పోయామని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి రణబోతు బిక్షమారెడ్డి అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ వారి స్వగృహానికి చేరుకొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన మనిషిని కోల్పోవడం బాధాకరమని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిచారు అనంతరం అదే గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ కూడా అనారోగ్య కారణంగా మరణించడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పల్లా నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, తవణం వెంకటరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు నూకపంగు ఈదయ్య, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ వట్టికూటి వెంకన్న, జానిమియ, రామ నరసయ్య, ఖాసిం, పుల్లయ్య, సంజీవరెడ్డి, వెంకటరాములు, వెంకటేశ్వర్లు, జమాల్ సాహెబ్, నాగుల్ మీరా, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత

చిలుకూరు ఫిబ్రవరి14(మనం న్యూస్): చిలుకూరు మండలం రామచంద్రానగర్ ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రమండలి రామినేని.కళింగ రావు(డిఎస్పీ), వసుకుల.రామారావు (జిహెచ్ఎం) ఆధ్వర్యంలో అంకతి .నరసయ్య భార్య అంకతి నాగమ్మ మరణించటంతో సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగ,ఉపాధ్యాయ మిత్రమండలి తరపున 75 కేజీల బియ్యం,40,500/- నగదు ఆర్థిక సహాయం గ్రామ సర్పంచ్ పాయిలి నాగరాజు, గ్రామ పెద్దల సమక్షంలో అందించడం జరిగింది. ఈ సందర్భంగా అంకతి.నరసయ్య వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోని సహాకారాలు అందించిన ఉద్యోగ,ఉపాధ్యాయ మిత్రమండలికి ధన్యవాదాలు తెలియజేశారు.

## రేపటి ప్రజావాణి రద్దు



జగిత్యాల ఫిబ్రవరి 14(మనం ప్రతినిధి): జగిత్యాల జిల్లా కలెక్టరేట్లో సోమవారం 16 తేది రోజున నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కోడ్ ముగిసే వరకు ప్రజల నుంచి వినతుల స్వీకరణ ఉండదని, ఆ తర్వాతే యథావిధిగా కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మార్పును జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

## ఎన్నికల హామీని అమలు చేస్తున్న సంపత్ రెడ్డి

- గ్రామంలో పుట్టిన ప్రతి ఆడబిడ్డకి 5016 అందజేస్తా
- గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సర్పంచ్ పిలుపు





చిగురుమామిడి: ఫిబ్రవరి 14 (మనం న్యూస్): ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా తనను గెలిపిస్తే గ్రామంలో పుట్టిన ప్రతి ఆడబిడ్డకి 5016రూపాయలు డిపాజిట్ చేస్తానని ఇచ్చిన హామీని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామ సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి అమలు చేస్తు ఆదర్శంగా నిలుస్తున్నారు.ఈ మేరకు శనివారం లంబాడిపల్లె గ్రామపంచాయతీ వద్ద జెట్టి మనసా శ్రీనివాస్ లకు కూతురు 21రోజున 5016రూపాయలను గ్రామస్తుల సమక్షంలో సర్పంచ్ వారికి అందజేశారు.ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా ప్రతి ఒక్కరూ కృషిచేసినప్పుడే ఆడ, మగ వ్యత్యాసాలు తొలగిపోతాయన్నారు.ఆడపిల్లను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం చదవనిద్దాం,ఎదగనిద్దాం, రక్షించుకుందాంమని,భ్రూణ హత్యలును హరికడదాం,సృష్టికి మూలమైన ఆడపిల్లలను కాపాడుకుందామని సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి పిలుపునిచ్చారు.గ్రామంలో ఉన్న ప్రతి సమస్య పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సర్పంచ్ కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామం అన్నిరంగంలో అభివృద్ధి చెందుతుందాన్నారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ నల్లాల మధుసూదన్ రెడ్డి ,జెట్టి సంపత్,నాగెల్లి కళావతి,మంద లక్ష్మయ్య, గ్రామస్తులు అనుమాండ్ల కనుకరెడ్డి,జెట్టి లక్ష్మయ్య ,కాటం రవీందర్ రెడ్డి, అనుమాండ్ల రాజిరెడ్డి,నల్లాల రాజిరెడ్డి,కర్ర అశోక్ రెడ్డి,నందికొండ మల్లారెడ్డి ,మంద కిష్టయ్య,చందబోయిన పరశరములు, బండారిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంగపేట మండలం మల్లూరులో షార్ట్ సర్క్యూట్ – రూ.1.5 లక్షల నష్టం



మంగపేట, ఫిబ్రవరి14, మనం న్యూస్: మల్లూరు కట్ట మైసమ్మ సెంటర్ వద్ద ఉదయం సుమారు 7 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దుకాణానికి చెందిన నగదు మరియు ఇతర సామగ్రి దగ్ధమై భారీ నష్టం వాటిల్లినట్లు సమాచారం. బాధితుడు అబ్బు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం, దుకాణంలో ఉంచిన సుమారు రూ.60,000 నగదు మరియు ఇతర సామాను కలిపి మొత్తం రూ.1,50,000 వరకు నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అగ్ని ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూట్ కావచ్చని స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న తరువాత స్థానిక ప్రజలు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పరిశీలించి, బాధితుడికి తగిన నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నాణ్యతకు నమ్మకానికి మారుపేరు నాగార్జున డెయిరీ పాలఉత్పత్తులు



- నాగార్జున మిల్క్ పార్లర్ ను సద్వినియోగం చేసుకోవాలి...
- డెయిరీ సేల్స్ మేనేజర్ శివకుమార్

చిగురుమామిడి: ఫిబ్రవరి 14 (మనం న్యూస్): నాణ్యతకు నమ్మకానికి మారుపేరుగా నాగార్జున డెయిరీ పాల ఉత్పత్తులు నిలుస్తున్నాయని,హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటుచేసిన నాగార్జున డెయిరీ పాల ఉత్పత్తులను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నాగార్జున డెయిరీ జోనల్ సేల్స్ మేనేజర్ వెనిశెట్టి శివకుమార్ తెలిపారు.శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 10వ వార్డులో ఏర్పాటుచేసిన నాగార్జున మిల్క్ పార్లర్ ను వార్డు కౌన్సిలర్ సావుల మంజుల,11వ వార్డ్ కౌన్సిలర్ పూధరి వరప్రసాద్ లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించినట్లు శివకుమార్ చిగురుమామిడి విలేకరులకు తెలిపారు.ఈ సందర్భంగా డెయిరీ ప్రతినిధులు మాట్లాడుతూ నాగార్జున డెయిరీని 2006సంవత్సరంలో ప్రారంభించామని నాటి నుండి నేటి వరకు నాణ్యతలో రాజీపడకుండా వినియోగదారులకు నాణ్యమైన పాలు,పాల ఉత్పత్తులను అందజేస్తున్నట్లు తెలిపారు.నాగార్జున డెయిరీ ఆధ్వర్యంలో రోజుకు 50వేల లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.నాగార్జున డెయిరీ ఏర్పాటుతో దాదాపు 4వందల మందికి ఉద్యోగా అవకాశాలు కల్పించామని,వేలాది మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నట్లు వారు వివరించారు.నాగార్జున డెయిరీ పాల ఉత్పత్తులను విక్రయిస్తూ సంస్థకు అండగా నిలుస్తున్న వినియోదారులకు వారు ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛమైన, నాణ్యమైన పెరుగు, మజ్జిగ, పన్నీరు, నెయ్యి,లస్సి,బాదంపాలు,దూద్ పేడ, బట్టర్, పచ్చికోవా తదితర పదార్థాలను 20సంవత్సరాల నుండి ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో డెయిరీ జోనల్ సేల్స్ మేనేజర్ వేనిశెట్టి శివకుమార్, కంపెనీ ఏఎస్ఎం వెంకటేష్,విజయ్, రాకేష్,పార్లర్ నిర్వాహకులు ప్రసాద్, ఏజెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ స్నాతకోత్సవం మహోన్నత బహిరంగ సభ



- విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాల ప్రధాన ఉత్సవం
- మదర్సా అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది

కోదాడ, ఫిబ్రవరి 14(మనం న్యూస్); మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో శనివారం మదర్సా స్నాతకోత్సవ మహోన్నత బహిరంగ సభను నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక మత పెద్దలు హజరత్ మౌలానా పీ.ఎం ముజమ్మిల్ అహ్మద్ సాహెబ్, హజ్రత్ మౌలానా సాహెబ్ ఎహ్ సానుద్దీన్ సాహెబ్ ఖాస్మి సాహెబ్ లు పాల్గొని మాట్లాడారు గుడిబండ గ్రామంలో 10 సంవత్సరాల క్రితం మహమ్మద్ జాన్ షరీఫ్ సాహెబ్, మహమ్మద్ ఉస్మాన్ సాహెబ్ ఇద్దరు కలిసి దాతల సహకారంతో ధార్మిక విజ్ఞాన వ్యాప్తి చేయటానికి కరుణామయుడైన అల్లాహు పై నమ్మకంతో మదర్సా ధారుజ్జిక్రను స్థాపించారని వారి త్యాగం వెలకట్టలేనిది అని తెలిపారు మదర్సా స్థాపించిన నాటి నుండి నేటి వరకు వందమంది విద్యార్థులకు ఉచిత విద్య ఉచిత హాస్టల్ వసతి కల్పించినట్లు గుర్తు చేశారు వీరిలో 51 మంది విద్యను పూర్తి చేసుకున్నారని తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థులకు ద్రోపత్రాల ప్రధానోత్సవం తలపాక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు , ఫిబ్రవరి 18వ తారీకు నుండి రంజాన్ నెల ప్రారంభమవుతుందని ముస్లిం సోదరులంతా భక్తిశ్రద్ధలతో ప్రతిరోజు నమాజ్ చేసుకోవాలని అలాగే నిరుపేదలకు ధన రూపంలో కానీ వస్త్రాల రూపంలో కానీ సహాయం చేయాలని తెలిపారు అలాగే సమాజ ంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలు దురాచారాలు అన్యాయమైన పద్ధతులు మరియు సామాజిక అసమానతలు తొలగించి సమాజాన్ని ప్రగతి పదంలో నడిపించేందుకు ముస్లింలు ముందుండాలని తెలిపారు హజ్రత్ మౌలానా మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య ఉపసర్పంచ్ ఇర్ల జయసింహారెడ్డి భావుద్దీన్, మహబూబ్ అలీ, గౌస్ బాబా రఫీ, షేక్ కరిముల్లా, రఫీ, ఇక్బాల్, మౌలానా, హసన్ అలీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## మ్యానువోల్ గుంతపై (మూత) ఏర్పాటు



- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మునుగోడు ఫిబ్రవరి 14(మనం న్యూస్): మనం పత్రిక కథనానికి స్పందించిన గ్రామపంచాయతీ పాలకవర్గం సిబ్బంది మూడు రోజుల క్రితం 'ప్రమాదకరంగా మ్యానువోల్ గుంత' అనే శీర్షిక కథనం మనం పత్రిక ద్వారా వెలువడింది, మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఎదురుగా ఉన్న కాలనీ సిసి రోడ్డు మీద ఉన్న మ్యానువోల్ గుంత మీద మూత విరిగి పోయి ఉండడంతో ఆ కాలనీలో వాహనాలు పై వెళ్లాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి, ముందుగా ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్దకు వచ్చే రైతులు మందు బస్తాలు వాహనాలలో తీసుకువెళ్లే టప్పుడు తీవ్ర ఇబ్బందులు పడేవారు, స్పందించిన ఆరవ వార్డు మెంబర్ యాసరాని దినేష్ గ్రామపంచాయతీ సిబ్బందితో కలసి శనివారం రోజున మ్యానువల్ గుంతపై పాత మూత తొలగించి కొత్త మూత బిగించారు,దీనితో కాలనీ ప్రజలు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎక్స్ ప్లోరిక పాఠశాలలో అట్టహాసంగా 'ఎబూలియెన్స్' వార్షికోత్సవ వేడుకలు







కరీంనగర్, ఫిబ్రవరి 14(మనం న్యూస్): స్థానిక నగరంలోని జ్యోతినగర్ పారమిత ఎక్స్ ప్లోరికా పాఠశాల 'ఎబూలియన్స్' పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు రేకుర్తిలోని రాజశ్రీ కన్వెన్షన్ హాల్ లో అత్యంత కన్నుల పండుగగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ. ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఎబూలియేన్స్ శీర్షికతో జరిగిన ఈ కార్యక్రమంలో స్వార్థం, ఆశ, నిస్వార్థం అనే భావాలను విద్యార్థులు వినూత్నంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంతోషం యొక్క మూడు రూపాలను ప్రదర్శించారు . వ్యక్తిగత సంతోషం : పుట్టినరోజులు, పెళ్లిళ్లు ,కుటుంబ వేడుకలు. ఆశ: రైతులు, కాన్సర్ జయించినవారు, దృష్టిహీనుల జీవిత పోరాటం నిస్వార్థ సేవ : ప్రకృతిని కాపాడటం, క్రికెట్, సైనికులు సేవలను గౌరవించడం. మొదలైన అంశాలు అందరిని ఆకట్టుకున్నాయి ఈ సంధర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన పాఠశాల చైర్మన్ డా.ఇ ప్రసాదరావు మాట్లాడుతూ ఎక్సప్లోరికా కేవలం పాఠశాల కాదు, పిల్లల అభివృద్ధికి మంచి వేదిక అని అన్నారు . నిస్వార్థ సేవలోనే నిజమైన ఆనందం ఉందని తెలిపారు. ఈ వేడుకల్లో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, వి. యు. ఎం. ప్రసాద్, రష్మిత, అనుకర్ రావు, రాకేష్, ప్రాచి, వినోద్ రావు, హన్మంతరావు పాఠశాల ప్రిన్సిపాల్ శర్మిష్ఠ ,ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏడుగురు హీరోయిన్స్‌తో మూవీ.. క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్ క్రిష్..!



టాలీవుడ్ విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తన తదుపరి చిత్రం గురించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై స్పందించారు. ఇటీవల ఆయన దర్శకత్వం వహించిన 'ఘాటీ' చిత్రం ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోవడంతో, తర్వాతి సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే ఏడుగురు హీరోయిన్లతో ఒక ట్రెకింగ్ అడ్వెంచర్ మూవీని క్రిష్ ప్లాన్ చేస్తున్నారంటూ ప్రచారం జరిగింది.

ఈ వార్తలపై క్రిష్ క్లారిటీ ఇస్తూ.. ఏడుగురు హీరోయిన్లు, ట్రెకింగ్ అడ్వెంచర్ అనేది మంచి ఐడియానే కానీ, అది నిజం కాదు అని తేల్చి చెప్పారు. ఇదంతా సోషల్ మీడియా సృష్టించిన కథేనని, తన తదుపరి ప్రాజెక్ట్ గురించి త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం క్రిష్ కొన్ని కొత్త కథలపై కసరత్తు చేస్తున్నారు.

మరోవైపు, నందమూరి బాలకృష్ణ డ్రీమ్ ప్రాజెక్ట్ 'ఆదిత్య 999' సీక్వెల్ కు క్రిష్ దర్శకత్వం వహిస్తారని భావించినా, ఆయన ఆ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిన్న విరామం తీసుకున్న ఈ సెన్సిబుల్ డైరెక్టర్, తన తర్వాతి చిత్రాన్ని ఎవరితో చేస్తారో చూడాలి.

# 'హిట్' చిత్రాల దర్శకుడు తీసిన తొలి ప్రేమకథ



'హిట్' ఫ్రాంచైజీ సినిమాలతో ఆకట్టుకున్న దర్శకుడు శైలేష్ కొలను.. కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు అన్నీ థ్రిల్లర్సే తీశాడు. ఇప్పుడు రూటు మార్చి తొలిసారి ఓ ప్రేమకథని తెరకెక్కిస్తున్నాడు. అదే 'ఏమో ఏమో ఇది'. శ్రీకాంత్ కొడుకు రోషన్ హీరో కాగా ప్రీతి ముకుందన్ హీరోయిన్. తాజాగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఫస్ట్ బ్రీజ్ పేరిట సినిమా కాన్సెప్ట్ ఏంటనే విషయాన్ని రివీల్ చేశారు.

సింగల్ మదర్ పెంపకంలో పెరిగే అభయ్(రోషన్).. ఓ కెఫే యజమాని అయిన అపూర్వ(ప్రీతి ముకుందన్)తో ఎలా ప్రేమలో పడ్డాడు? ఈ జర్నీలో ఏమేం జరిగింది? అనేది సినిమా స్టోరీలా అనిపిస్తుంది. హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతమందిస్తున్నాడు. సితార ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ ఏడాది దసరాకే థియేటర్లలోకి మూవీ వస్తుందని ప్రకటించారు. గతంలో 'పెళ్లి సందD', 'ఛాంపియన్' చిత్రాలు చేసిన రోషన్.. వాటితో సక్సెస్ అందుకోలేకపోయాడు. ఈసారి ఏం చేస్తాడో చూడాలి?

# 'కోర్ట్' జంట మరో సినిమా.. కొత్త గ్లింప్స్ రిలీజ్



కోర్ట్' సినిమాతో గతేడాది హిట్ కొట్టిన జంట శ్రీదేవి-రోషన్. వీళ్లిద్దరూ కలిసి చేస్తున్న మరో మూవీ 'బ్యాండు మేళం'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకోగా.. వచ్చే నెల 13వ తేదీన థియేటర్లలోకి రానుంది. వాలంటైన్స్ డే సందర్భంగా ఎమోషనల్ గ్లింప్స్ ఒకటి రిలీజ్ చేశారు. బ్రేకప్ అయినప్పుడు హీరో బాధపడుతున్నట్లు ఇందులో చూపించారు. 'కోర్ట్' మూవీ ఆంధ్ర బ్యాక్ డ్రాప్ లో ఇది తెలంగాణ నేపథ్యంగా ఉండనుంది. సతీష్ జవ్వాజి దర్శకుడు కాగా విజయ్ బుల్గానిన్ సంగీతమందించాడు. మరి రోషన్-శ్రీదేవి ఈసారి ఏం చేస్తారో చూడాలి? గ్లింప్స్ లో ఎమోషన్ చూపించినప్పటికీ.. హీరో, తన ఫ్రెండ్కి తాళి కట్టడం ఫన్నీగా అనిపించింది.

## శ్రీవిష్ణు VS శ్రీవిష్ణు

# ఒక్క రోజు గ్యాప్‌లో వస్తున్న రెండు సినిమాలు..!

కింగ్ ఆఫ్ ఎంటర్ టైన్ మెంట్ శ్రీవిష్ణు ప్రస్తుతం ఒక అరుదైన బాక్సాఫీస్ ఫైట్ కు సిద్ధమవుతున్నాడు. ఒకే హీరో నటించిన రెండు వేర్వేరు సినిమాలు కేవలం 24 గంటల వ్యవధిలో విడుదల కావడం విశేషం. ఆయన నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'మృత్యుంజయ' ఫిబ్రవరి 27న విడుదల కానుండగా, మరుసటి రోజే అంటే ఫిబ్రవరి 28న కామెడీ డ్రామా 'విష్ణు విన్యాసం' థియేటర్లలోకి రానుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక వైవిధ్యమైన పోస్టర్ ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేసింది. సాధారణంగా ఏ హీరో అయినా తన సినిమాల మధ్య కనీసం నెల రోజుల గ్యాప్ ఉండాలని కోరుకుంటాడు. కానీ ఇక్కడ శ్రీవిష్ణు ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం ఓటీటీ ఒప్పందాలే. ప్రస్తుతం టాలీవుడ్ లో ఓటీటీ ప్లాట్ ఫారమ్ ల నిబంధనలు సినిమా విడుదల తేదీలను శాసిస్తున్నాయి. 'మృత్యుంజయ' డిజిటల్ హక్కులను నెట్ ఫ్లిక్స్ దక్కించుకోగా, 'విష్ణు విన్యాసం' స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఒప్పందం ప్రకారం ఆయా ప్లాట్ ఫారమ్ లు సూచించిన తేదీలకే థియేటర్లలో రిలీజ్ చేయాలనే కఠిన నిబంధన ఉండటంతో ఈ 'సెల్ఫ్ క్లాష్' తప్పలేదు. దీంతో ఈ నెల ఆఖరులో శ్రీవిష్ణు వర్సెస్ శ్రీవిష్ణు వార్ను ప్రేక్షకులు చూడబోతున్నారు. ఒకవైపు సీరియస్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ తో, మరోవైపు తనదైన శైలి వినోదంతో ఆయన ప్రేక్షకులను పలకరించనున్నాడు. ఈ రెండు సినిమాల ప్రమోషన్లను శ్రీవిష్ణు ఎలా బ్యాలెన్స్ చేస్తారో, అలాగే బాక్సాఫీస్ వద్ద ఏ చిత్రం పైచేయి సాధిస్తుందో చూడాలి. వరుస విజయాలతో ఊపుమీదున్న శ్రీవిష్ణుకు ఈ డబుల్ రిలీజ్ ఏ మేరకు కలిసివస్తుందో వేచి చూడాల్సిందే.




# ఒమన్‌పై ఐర్లాండ్ ఘన విజయం



కొలంబో వేదికగా ఒమన్తో టీ20 వరల్ కప్ 2026 నేపథ్యంలో జరిగిన మ్యాచ్ లో 96 పరుగుల తేడాతో ఐర్లాండ్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో ఒమన్ తడబడింది. 18 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. ఒమన్ బ్యాటర్లలో అమీర్ కలీమ్ (50; 29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్ లు), హమ్మద్ మీర్జా (46; 37 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే రాణించారు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో జాషువా లిటిల్ 4 ఓవర్లలో 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. మాథ్యూ హంఫ్రీస్, బారీ మెక్కార్తీ 2, జార్జి డాక్రెల్ ఒక వికెట్ తీసుకున్నారు.

# స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం



ఆరంభంలో కాస్త కంగారు పడినప్పటికీ స్కాట్లాండ్ పై ఇంగ్లాండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ కు దిగిన స్కాట్లాండ్ 19.4 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 18.2 ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి 155 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఆటగాడు బాంటన్ (63₹) హాఫ్ సెంచరీ చేయగా.. జాకబ్ బెతెల్ (32), సామ్ కరన్ (28), విల్ జాక్స్ (16₹) రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాండన్, బ్రాడ్, వీల్, లీస్క్, డేవిడ్సన్ తలో వికెట్ తీశారు.

# పెళ్లి చేసుకుంటాను.. కానీ.. : మృణాల్

కొన్ని రోజులుగా వరుసగా రూమర్స్ తో వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. ధనుష్ తో ఆమె ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. వీరిద్దరూ ఫిబ్రవరి 14న పెళ్లి చేసుకోనున్నారంటూ రూమర్స్ వచ్చాయి. వాటిని ఖండించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి మాట్లాడారు. వివాహం విషయంలో తొందరపడటం లేదన్నారు.

''పెళ్లి చేసుకుంటాను. కానీ.. దానికి సమయం రావాలి. సరైన వ్యక్తి నా జీవితంలోకి వచ్చినప్పుడు వివాహబంధంలోకి అడుగుపెడతాను. అప్పుడు నేనే స్వయంగా చెబుతాను. నా సోషల్ మీడియా అకౌంట్స్ లో నేనే పోస్ట్ చేస్తాను. ఆ విషయాన్ని మీతో పంచుకునే మొదటి వ్యక్తిని నేనే'' అని చెప్పారు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు పెళ్లిపై అందరి ఆలోచనల్లో మార్పు వచ్చిందని మృణాల్ అన్నారు. ఇక ప్రేమికుల రోజు తన పెళ్లి జరగనుందంటూ వచ్చిన వార్తలపై ఆమె హాస్యాస్పదంగా స్పందించారు. నేడు ఫిబ్రవరి 14. మరికొన్ని రోజుల్లో ఏప్రిల్ 1 వస్తుంది.. ఆరోజు ఫూల్స్ డే కదా.. అని సెటైర్ వేశారు.

ఇక ఇటీవల ఆమె తన మాజీ బాయ్ ఫ్రెండ్ గురించి చెప్పిన విషయం తెలిసిందే. తాను యాక్టింగ్ చేయడం అతడికి నచ్చలేదని అందుకే బ్రేకప్ చెప్పినట్లు వెల్లడించారు. అలాంటివాళ్లతో కొనసాగడం కూడా కష్టమేనని అందుకే విడిపోయినట్లు చెప్పారు.



# బన్నీని చూసి బాలీవుడ్ రగిలిపోతోందా?

## అల్లు అర్జున్‌పై వ్యతిరేక ప్రచారం...



'పుష్ప 2' ఘన విజయం తర్వాత, దక్షిణాది నటుల్లో ఎవరికీ రానంత దేశవ్యాప్త క్రేజ్ అల్లు అర్జున్ కి రావడం, జవాన్ సినిమా తీసిన అట్లీ తన రెండో సినిమాకి ఎంచుకోవడం...అలాగే బాలీవుడ్ అగ్రనటి దీపికా పదుకొణే వంటి స్టార్స్ తో బన్నీ కలిసి నటించనుండడం వంటివి జరిగాయి. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ బాలీవుడ్ లో కొందరికి ముప్పుగా కనిపిస్తున్నారా? అనే ప్రశ్నకు కొందరు సినీ పెద్దలు అవుననే సమాధానమే చెబుతున్నారు. ఈ మేరకు ప్రస్తుతం అటు టాలీవుడ్ ఇటు బాలీవుడ్ లో సినీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. హైదరాబాద్ లో సంధ్యా థియేటర్ సంఘటన తర్వాత అల్లు అర్జున్ ఎదుర్కొన్న పరిణామాలు తను కొందరు ప్రముఖులకు టార్గెట్ గా మారాడనే విషయాన్ని స్పష్టంగా వెల్లడించాయి. తాజా పరిణామాల నేపథ్యంలో బన్నీ ని ఈ సారి వేరే రకంగా టార్గెట్ చేశారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

**వివాదమా? బాలీవుడ్ వ్యూహమా?**

ఇండియన్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గురించి పాడ్ కాస్ట్ లో పాల్గొన్న ఓ బ్రాండ్ స్ట్రాటజిస్ట్ అల్లు అర్జున్ ను కలవాలంటే ఏకంగా 42 కఠినమైన నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, అందులో కళ్లలోకి చూడకూడదు, చేతులు కలపకూడదు వంటి ఆంక్షలు కూడా ఉన్నాయని ఆరోపించారు. ఈ క్లిప్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. ఫలితంగా అల్లు అర్జున్ పేరు అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ లలో ట్రెండింగ్ గా మారింది. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున చర్చ జరగడంతో, నిజంగానే ఇలాంటి నిబంధనలు ఉన్నాయా? అని కొందరిలో సందేహాలు వ్యక్తమవడం సహజమే. అయితే అదే సమయంలో కొందరు ఇది అల్లు అర్జున్ పెరుగుతున్న పాన్ ఇండియా క్రేజ్ ను తగ్గించేందుకు చేసిన ప్రయత్నమని అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇలాంటి వివాదాలను కావాలనే పెద్దవిగా చేసి ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయితే ఇలా టాలీవుడ్ స్టార్స్ పై వ్యతిరేక ప్రచారం జరగడం ఇదే తొలిసారి కాదు. గతంలో 'బాహుబలి', 'సాహో' సినిమాల భారీ విజయం తర్వాత ప్రభాస్ కూడా ఇలాంటి విమర్శలు, నెగెటివ్ ప్రచారం చేశారని కొందరు గుర్తు చేస్తున్నారు. బాలీవుడ్ లో చెప్పుకోదగ్గ ఆదరణ పొందిన దక్షిణాది నటులు ఇలాంటి కుట్రలను ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.










Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.